

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 1-6-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 46 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: షష్ఠి రా.8.00 తదుపరి సప్తమి, నక్షత్రం: ఆశ్లేష రా.9.36 తదుపరి మఖ, వర్జ్యం: ఉ.10.10-11.48, దుర్ముహూర్తం: సా.4.58-5.50. అమృతఘడియలు: రా.7.58-9.36, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

లోకేశ్‌కు పట్టం!



..సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు ఒంగోలులో నిర్వహించిన మహానాడు పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపగా, అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఇప్పుడు నిర్వహించిన మహానాడు ద్వారా కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారంలో నిజం లేదని, ప్రభుత్వంపై ప్రజల భరోసా సన్నగిల్లలేదని రుజువైంది. ప్రభుత్వం పట్ల సానుకూలత విషయం పక్కనపెడితే, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ప్రజల్లో కోపం ఇంకా తగ్గలేదని మహానాడు ముగింపు సభ చెబుతోంది.

..ఈ మహానాడులో లోకేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మూడవ తరం ప్రతినిధిగా పార్టీ బాధ్యతలు మోయగల శక్తియుక్తులు తనకు ఉన్నాయని ఆయన నమ్మకం కలిగించగలిగారు. మహానాడులో ప్రసంగించిన లోకేశ్‌ను నిశితంగా గమనిస్తే ఆయనలో మూర్తీభవించిన ఆత్మవిశ్వాసం కనిపించింది.

..'మీలో పరిణతి కనిపిస్తోంది. ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. మీ ప్రసంగాలలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మార్పును నేను గమనించాను. మొదట్లో తడబడిన మీరు ఇప్పుడు అసువుగా ఉపన్యసిస్తున్నారు' అని ఇటీవలి భేటీ సందర్భంగా లోకేశ్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు. సొంతంగా ఎదిగే ప్రయత్నం చేయాలని సూచించారు.

..మహానాడులో లోకేశ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి అప్పగించాలని పలువురు ప్రతిపాదించారు. నిజానికి ఆయన ఇప్పుడు జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాత్రమే ఉన్నప్పటికీ పార్టీ నిర్వహణ బాధ్యతలను ఇప్పటికే చేపట్టారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉంటున్నందున పార్టీ బాధ్యతలను లోకేశ్ చూసుకుంటున్నారు. పార్టీలోని సీనియర్ నాయకులు కూడా ఆయన నాయకత్వాన్ని ఇప్పుడిప్పుడే అంగీకరిస్తున్నారు. కార్యకర్తల్లో కూడా లోకేశ్ నాయకత్వం పట్ల నమ్మకం ఏర్పడుతోంది.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో

..లోకేశ్‌కు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష పదవి కట్టబెట్టినా చంద్రబాబు నీడలోనే ఆయన పనిచేయాల్సి ఉంటుంది. ఈ కారణంగా వారసుడిగా లోకేశ్‌ను ఇప్పుడే ప్రకటించాలని పలువురు భావిస్తున్నారు.

..శషభిషలకు స్వస్తి చెప్పి లోకేశ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నియమించే విషయంలో చంద్రబాబు ఒక నిర్ణయం తీసుకోవాలి. ఇప్పుడే పార్టీ బాధ్యతలను లోకేశ్ చేపడితే ఎన్నికల నాటికి మరింత రాటుదేలుతారు.

..మరి పార్టీ నియమావళికి అనుగుణంగా నాయకత్వ మార్పిడికి చంద్రబాబు శ్రీకారం చుడతారా? లేదా? అంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.



అంబేడ్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరులో ఉపాధి కూలీలు రత్నం, మరియమ్మలతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఇక గేరు మారుస్తా..

ఈ నెల 12తో పాలనకు ఏడాది పూర్తి

- అవినీతి లేని వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నాం
- అధికారులు పేదల కోసం పనిచేయాల్సిందే
- లంచాలు తీసుకుంటే చూస్తూ ఊరుకోను
- నాది డేగ కన్ను.. ఎవరూ తప్పించుకోలేరు
- ఎవరైనా తప్పు చేస్తే చండశాసనుడినవుతా
- బడులు తెరిచేలోగా 'అమ్మకు వందనం' డబ్బులు
- నాలుగు నెలలకోసారి గ్యాస్ డబ్బులు వేస్తున్నాం
- మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు
- గత ప్రభుత్వంలో కేంద్ర పథకాల నిధులు పక్కదారి
- ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక అన్నీ సరిచేస్తున్నాం
- చెయ్యేరు ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు

భగవంతుడు కరుణిస్తే పింఛన్ల సొమ్ము పెంచుతాం

- మహారాష్ట్రలో రూ.1,000 మాత్రమే
- తెలంగాణలో 2,250 ఇస్తున్నారు
- ఏపీలోనే అత్యధికంగా 4 వేలు ఇస్తున్నాం
- ఎక్కడికెళ్లినా 3 నెలలకు ఒకసారి తీసుకోవచ్చు
- పింఛన్‌పై సీఎం స్పష్టీకరణ

అమలాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): 'అవినీతి లేని వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నాం. ప్రభుత్వ అధికారులు లంచాలు తీసుకుంటే చూస్తూ ఊరుకోను. ఈ నెల 12వ తేదీతో ఏడాది పాలన పూర్తిచేసుకుంటున్నాం. ఇకపై గేరు మారుతుంది. ప్రతిరోజూ సమీక్షలు చేస్తున్నా. నిమిషం ఖాళీ లేకుండా పనిచేస్తున్నాను. టెక్నాలజీ వచ్చిన తర్వాత ఎవరూ తోక జాడించడం లేదు. నన్ను మోసం చేయాలంటే కుదరదు. అధికారులు పేదల కోసం పనిచేయాల్సిందే' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన ప్రజా వేదిక సభలో ఆయన ప్రసంగించారు. రానున్న

మిగతా 12వ పేజీలో...

ప్రపంచ సుందరి థాయ్ సిరి

సుచాత షుంగ్‌సిరిని వరించిన కిరీటం

- దయాగుణమే అత్యుత్తమం అన్న జవాబుతో విజయం
- 16 ఏళ్లకే రొమ్ము క్యాన్సర్ బారిన.. చికిత్సతో విముక్తి
- అప్పటినుంచి ఆ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు
- థాయ్‌లాండ్‌కు తొలిసారిగా ప్రపంచ సుందరి కిరీటం
- రన్నరప్‌లుగా ఇథియోపియా, పోలాండ్, మార్టినిక్ సుందరీమణులు.. టాప్-20లో నందినీ గుప్తా

మోడల్ కాకుంటే రాజకీయాల్లోకి..

- రొమ్ము క్యాన్సర్ రావడంతో భయపడ్డా
- ఆ భయమే ధైర్యాన్నిచ్చి నడిపింది
- 'ఆంధ్రజ్యోతి'తో మిస్‌వరల్డ్-2025 ఓపల్



హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల వేదికపై థాయ్ అందం విరబూసింది. అందానికి ఆత్మవిశ్వాసం తోడుగా ఎదిగిన థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత షుంగ్‌సిరిని మిస్ వరల్డ్ కిరీటం వరించింది. 16 ఏళ్లకే రొమ్ము క్యాన్సర్ బారినపడి కోలుకున్న ఆమె చేపట్టిన 'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్టు.. 'బ్యూటీ విత్ పర్పస్'కు

మిగతా 13వ పేజీలో...

ప్రపంచ సుందరిగా నిలిచిన సుచాత షుంగ్‌సిరి, కిరీట ధారణ



మన యుద్ధ విమానాలు

కూలడం నిజమే



- ఆరింటిని కూల్చామన్న పాక్ ప్రకటన తప్పు
- వ్యూహాత్మక తప్పిదం జరిగింది.. గుర్తించి వెంటనే సరిదిద్దాం
- 2 రోజుల్లోనే అన్ని విమానాలు ఎగిరి పాక్‌ను దెబ్బకొట్టాయి: జనరల్ అనిల్ చౌహాన్
- ఫైటర్లు కూలాయని తొలిసారి అంగీకారం

2



ఆ పేరు చెబితే నాకదే

ఆఖరి రోజు!

సిట్ విచారణలో రాజ్ కసిరెడ్డి ఆందోళన

- ఇంతకంటే ఏమీ చెప్పలేనంటూ మౌనం.. విచారణకు సహకరించని ఆ నలుగురు
- బ్యాంకు లావాదేవీలు, ఐటీ రిటర్న్‌లు ముందుంచి ప్రశ్నించిన అధికారులు
- కొన్నింటికి పొంతన లేని సమాధానాలు.. మరికొన్ని ప్రశ్నలకు మూగనోము
- ముగిసిన లిక్కర్ గ్యాంగ్ కస్టడీ.. జిల్లా జైలుకు తరలించిన పోలీసులు

12



ఇక రేషన్ దుకాణాల్లో

సరుకులు

- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పునఃప్రారంభం
- పండుగ వాతావరణంలో పంపిణీకి ఏర్పాట్లు
- వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే..
- పిఠాపురంలో ప్రారంభించనున్న నాదెండ్ల
- ఈ విధానంతో రేషన్ అక్రమాలకు అడ్డుకట్ట
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి

11

మేమంతా జైలుకే!



- నెలో రెండు నెలలో అంతే
- ఎప్పుడైనా జైలుకెళ్లొచ్చు
- 'రెడ్ బుక్'ను లైట్ తీసుకున్నాం
- వైసీపీ నేత సజ్జల వ్యాఖ్యలు
- జైలులో కాకాణితో ములాఖత్

14

మా నేతల ప్రోద్బలంతోనే

టీడీపీ ఆఫీసుపై దాడి

- వైసీపీ పరంగానే జరిగింది
- నాకెలాంటి సమాచారం లేదు
- అప్పుడు పొలం పనుల్లో ఉన్నా
- నేను ఎమ్మెల్యేనైనా.. నాకు తెలీకుండా చాలానే చేశారు
- సీఐడీ విచారణలో ఆళ్ల

12



ఒంగోలులో రెండు కొవిడ్ కేసులు?

- జీజీహెచ్‌లో రెండు రోజుల క్రితం వైద్యపరీక్షలు
- పాజిటివ్‌గా నిర్ధారణ

ఒంగోలు కార్పొరేషన్, మే 31(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో రెండు కొవిడ్ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. శుక్రవారం ఇద్దరు వ్యక్తులు ఛాతి, ముక్కు, గొంతు సమస్యలతో పట్టణంలోని జీజీహెచ్‌కు వచ్చారు. వైద్యులు వారికి ఆర్‌టీపీసీఆర్, ఇతర పరీక్షలు చేశారు. అనంతరం ఒకరు ఇంటికివెళ్లిపోగా మరొకరు స్థానిక ఆసుపత్రిలోని ప్రత్యేక వార్డులో చేరారు. శనివారం రిపోర్టులు రాగా, వారిరువురికీ కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు సమాచారం. వైద్యాధికారులు వెంటనే డీఎంఅండ్‌హెచ్‌వోకి, కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందించారు. వారి పూర్తివివరాలను జీజీహెచ్ వైద్యాధికారులు సోమవారం అధికారికంగా వెల్లడించనున్నట్లు తెలిసింది.

దేశంలో 3,395కు పెరిగిన కొవిడ్ కేసులు

న్యూఢిల్లీ, మే 31: దేశంలో యాక్టివ్ కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతూ 3వేల మార్కును దాటేసింది. కేరళ రాష్ట్రంలో కొవిడ్ వ్యాప్తి ఎక్కువగా ఉంది. తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, ఢిల్లీ ఉన్నట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం విడుదల చేసిన గణాంకాల ద్వారా వెల్లడైంది. గత 24 గంటల్లో ఢిల్లీ, కేరళ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లో ఒక్కొక్కరి చొప్పున మరణించారు. మే 22 నాటికి దేశంలో 257 యాక్టివ్ కేసులు ఉండేవి. ఈ సంఖ్య క్రమంగా పెరుగుతూ మే 26 నాటికి 1,010కి, శనివారం నాటికి 3,395కి చేరుకుంది. గత 24 గంటల్లోనే 685 కొత్త కేసులు నమోదయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇక కేసుల విషయానికి వస్తే.. కేరళలో అత్యధికంగా 1,336 యాక్టివ్ కేసులున్నాయి.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.24 తగ్గింపు

న్యూఢిల్లీ, మే 31: వాణిజ్య అవసరాలకు కోసం ఉపయోగించే గ్యాస్ సిలిండర్ ధరను రూ.24 మేర తగ్గిస్తూ శనివారం ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల బరువు ఉండే ఈ సిలిండర్ ప్రస్తుతం రూ.1,730.50 పలకనుంది. ఈ నిర్ణయం ఆదివారం నుంచి అమల్లోకి రానుంది. ఏప్రిల్ ఒకటో తేదీన కూడా ఈ సిలిండర్ ధరను రూ.41 మేర తగ్గించడం గమనార్హం. గృహ అవసరాలకు ఉపయోగించే సిలిండర్ ధరల్లో మార్పులు చేయలేదు.

నైజీరియాలో వరదలు..150మంది మృతి

అబూజా (నైజీరియా), మే 31: నైజీరియాలో భారీ వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి. గురువారం ఉదయం కురిసిన కుండపోత వర్షానికి కొన్నిగంటల్లోనే వరదలు సంభవించి నైజర్ రాష్ట్రంలోని ముఖ్య వ్యాపార పట్టణమైన మోక్వా జలదిగ్బంధంలో చిక్కుకుంది. పలు రోడ్లు, వంతెనలు ధ్వంసమయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. భారీ వరదల కారణంగా ఇళ్లు, వాహనాలు కొట్టుకుపోయాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఘోరమైన వరదల వల్ల శనివారం నాటికి 150 మందికి పైగా మృతి చెందినట్లు స్థానిక అత్యవసర సేవల విభాగం తెలిపింది.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి: విద్యాసాగర్



విజయవాడ, మే 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ ఎన్జీజీవో అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ చెప్పారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యలోనూ వారి వెన్నంటే ఉంటానన్నారు. శనివారం విజయవాడలో ఏపీఎన్జీజీవో నూతన అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో తన బాధ్యతలు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. మరింత బాధ్యతగా ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఏపీ ఎన్జీజీవో మాత్రమే వ్యవస్థపరంగా పనిచేస్తుందని తెలిపారు.

నేరాల నియంత్రణకు టెక్ పోలీసింగ్: డీజీపీ



అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని సమర్థవంతంగా పని చేయాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పోలీసులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను పూర్తిస్థాయి డీజీపీగా నియమించడంతో మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించగా, సీనియర్ ఐపీఎస్‌లు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రెండేళ్లలో ఏపీ పోలీసుల ప్రతిష్ఠ దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉండాలని ఆయన పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం 'శక్తి' యాప్ ఒక డిజిటల్ రక్షణ కవచంగా నిలిచిందని, తాజాగా వాట్సాప్ సేవల్ని అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. 'డ్రోన్ డిటెక్ట్.. పోలీస్ ప్రొటెక్ట్' విధానంలో పోలీసింగ్ అమలు చేయాలన్నారు. ప్రజలు ప్రశాంతగా.. నేరస్థులు జైల్లో.. ఉండేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు.

భారత యుద్ధ విమానాలు కూలిపోయాయి

ఆరు ఫైటర్లను కూల్చామన్న పాక్ ప్రకటన మాత్రం తప్పు

- ఎన్ని ఫైటర్లు కూలాయన్నది కాదు, ఎందుకు కూలాయన్నదే ముఖ్యం
- వ్యూహాత్మక తప్పిదం జరిగింది
- దాన్ని గుర్తించి వెంటనే సరిదిద్దాం
- సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ వెల్లడి



షాంగ్రీ లా డైలాగ్ సెక్యూరిటీ ఫోరం' సదస్సులో అనిల్ చౌహాన్

సింగపూర్, మే 31: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ యుద్ధ విమానాలను కోల్పోయిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అంగీకరించారు. ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయినదీ వెల్లడించలేదు. నాలుగు రాఫెల్‌లు సహా ఆరు ఫైటర్లను కూల్చామని పాకిస్థాన్ చెబుతున్నది మాత్రం తప్పు అని స్పష్టం చేశారు. ఎన్ని ఫైటర్లు కూలాయన్నది ముఖ్యం కాదని, ఎందుకు కూలిపోయాయన్నది కీలకమని పేర్కొన్నారు. తప్పు ఎక్కడ జరిగిందో వెంటనే గుర్తించి సరిదిద్దుకున్నామని.. తర్వాత రెండు రోజుల్లోనే అన్ని రకాల విమానాలు, ఆయుధాలతో కచ్చితమైన దాడులు చేసి పాక్‌ను దెబ్బకొట్టామని తెలిపారు. పాక్‌తో నెలకొన్న ఉద్రిక్తతల్లో భారత్ యుద్ధ విమానాలను కోల్పోయిందన్న అంశాన్ని అధికారికంగా అంగీకరించడం ఇదే తొలిసారి. శనివారం సింగపూర్‌లో జరిగిన 'షాంగ్రీ లా డైలాగ్ సెక్యూరిటీ ఫోరం' సదస్సుకు హాజరైన సీడీఎస్ అనిల్ చౌహాన్.. అక్కడ బ్లూమ్‌బర్గ్ టీవీకి, రాయిటర్స్‌కు విడిగా ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆరు భారత యుద్ధ విమానాలను కూల్చామని పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ చేసిన ప్రకటనను ప్రస్తావించగా.. "ఎన్ని విమానాలు కూలాయన్నది ముఖ్యం కాదు.. ఎందుకు కూలిపోయాయి, తప్పు ఎక్కడ జరిగిందన్నది ముఖ్యం. యుద్ధం జరిగినప్పుడు నష్టాలు ఉండక మానవు. మే 7న ఆపరేషన్ సిందూర్ మొదలైన సమయంలో భారత్‌కు కొంత నష్టం జరిగింది. ఆ నష్టాలకు కారణమేంటి, ఆ తర్వాత చేయాల్సినది ఏమిటి అనే దానిపై దృష్టిపెట్టాం. మేం చేసిన వ్యూహాత్మక తప్పిదం ఏమిటో వెంటనే గుర్తించి విశ్లేషించాం. దానిని వెంటనే సరిదిద్దుకున్నాం. రెండు రోజుల్లోనే అన్ని రకాల యుద్ధ విమానాలను ఆయుధాలతో రంగంలోకి తెచ్చాం" అని అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. అయితే ఇరు దేశాల మధ్య అణు యుద్ధం జరిగేటువంటి పరిస్థితి ఏదీ తలెత్తలేదని అనిల్ చౌహాన్ చెప్పారు. భారత్-పాక్ మధ్య అణు యుద్ధాన్ని ఆపానని, కాల్పుల విరమణకు ఒప్పించానని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చారు.


చైనా రక్షణ వ్యవస్థలు పనిచేయలేదు!

పాక్‌లోని కీలక ఎయిర్‌బేస్‌లు, సైనిక స్థావరాల వద్ద గగనతల రక్షణ వ్యవస్థలు ఉన్నా.. వాటిని తప్పుదారి పట్టించి మరీ భారత్ దాడులు చేయగలిగిందని సీడీఎస్ అనిల్ చౌహాన్ చెప్పారు. పాకిస్థాన్ భూభాగంలో 300 కిలోమీటర్ల లోపలివరకు కూడా కేవలం ఒక మీటర్ తేడాతో కూడిన కచ్చితత్వంతో లక్ష్యాలను ధ్వంసం చేశామని వెల్లడించారు. పాక్‌కు చైనా అందించిన గగనతల రక్షణ వ్యవస్థలు పనిచేయలేదని పేర్కొన్నారు.

యుద్ధం ముదిరి.. కాల్పుల విరమణ జరిగి..

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. మే 7న అర్ధరాత్రి పాకిస్థాన్‌లోని 9 ఉగ్ర స్థావరాలపై దాడి చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా పాక్ పెద్ద సంఖ్యలో ఆయుధ డ్రోన్లు, స్వల్ప శ్రేణి క్షిపణులతో భారత్‌పై దాడికి ప్రయత్నించింది. వాటిని చాలా వరకు ఎదుర్కొన్న భారత్ మే 9వ తేదీన అర్ధరాత్రి 11 పాక్ ఎయిర్‌బేస్‌లు, రాడార్, కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ధ్వంసం చేసింది. దీనితో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఇది పూర్తిస్థాయి యుద్ధంగా మారుతుందేమోనన్న సమయంలో.. ఒక్కసారిగా ఇరుపక్షాలు కాల్పుల విరమణ పాటించాలని నిర్ణయించాయి. మరోవైపు కాల్పుల విరమణ పాటించకపోతే భారీగా వాణిజ్య సుంకాలు విధిస్తామని తాను బెదిరించడంతోనే.. భారత్, పాక్ దిగొచ్చాయని ట్రంప్ పేర్కొన్నారు.

లోకం తీరు



ఫలించిన భారత్ దౌత్యం

- పాకిస్థాన్ ఉగ్రవాదుల మృతిపై సంతాపాన్ని ఉపసంహరించుకున్న కొలంబియా

న్యూఢిల్లీ, మే 31: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై భారత్ దాడుల తర్వాత అక్కడ మరణించిన వారికి సంతాపం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ప్రకటనను కొలంబియా ఉపసంహరించుకుంది. వాస్తవాలు తెలుసుకొన్న ఆ దేశం ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న వైఖరికి బలమైన మద్దతు ఇస్తూ త్వరలో ప్రకటన విడుదల చేయనుంది. ఈ మేరకు ఉగ్రవాదంపై పాక్ వైఖరిని, ఆ దేశ కుతంత్రాలను వివరించేందుకు కొలంబియాకు వెళ్లిన ఎంపీ శశిథరూర్ నేతృత్వంలోని బృందం దౌత్యం ఫలించింది. ఆ దేశ విదేశాంగ శాఖ ఉపమంత్రి రోసా విల్లావిసెన్సియోతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొలంబియా వైఖరిపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. అసంతృప్తి తెలియజేశారు. పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలిపారు. విల్లావిసెన్సియో మాట్లాడుతూ 'భారత బృందం తెలియజేసిన అన్ని వివరాల పట్ల విశ్వాసంగా ఉన్నాం. కశ్మీర్‌లో ఏం జరిగిందో తెలుసుకున్నాం' అని పేర్కొన్నారు.

కేసీఆర్‌కు నోటీసులంటే తెలంగాణకు ఇచ్చినట్లే: కవిత

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించి మాట్లాడారు.ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

భారత్-పాక్ యుద్ధాన్ని ఆపినందుకు గర్విస్తున్నా

- బుల్లెట్లతో కాదు బిజినెస్‌తో ఆపా
- అయినా ఎవరూ చెప్పుకోవడం లేదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, మే 31: భారత్-పాక్‌ల మధ్య తలెత్తిన ఘర్షణ అణ్వాయుధ యుద్ధంగా మారకుండా 'డీల్' కుదిర్చినందుకు గర్వపడుతున్నానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. బుల్లెట్లను కాకుండా వాణిజ్యాన్ని ఉపయోగించడం ద్వారా యుద్ధాన్ని ఆపినట్టు చెప్పారు. శుక్రవారం రెండు సందర్భాల్లో ఆయన ఈ విషయాన్ని ప్రముఖంగా చెప్పడం గమనార్హం. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ "భారత్-పాక్‌ల మధ్య కుదిర్చిన డీల్‌కు గర్వపడుతున్నా. దీనిపై ఎవరూ మాట్లాడుకోవడం లేదు గానీ, పాకిస్థాన్- భారత్‌ల మధ్య చాలా అసహ్యకరమైన యుద్ధం నడుస్తోంది. ప్రస్తుతం అంతా బాగుందిగానీ, రెండూ అణ్వాయుధ దేశాలు. పరిస్థితి దారుణంగా ఉండేది" అని వ్యాఖ్యానించారు. భారత్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ట్రంప్ వెల్లడించారు. "ఇండియాతో త్వరలో డీల్ కుదుర్చుకుంటాం. వచ్చే వారం పాక్ ప్రతినిధులు వాషింగ్టన్ రానున్నారు. రెండు దేశాలు యుద్ధాన్ని కొనసాగించి ఉంటే డీల్ కుదర్చాలన్న ఆసక్తి నాకు ఏమాత్రం ఉండేది కాదు" అని చెప్పారు. అంతకుముందు శ్వేత సౌధంలోని ఓవల్ ఆఫీసులో కూడా ట్రంప్ ఇదే విషయం చెప్పారు.

20 రోజుల్లో 9సార్లు చెప్పారు..

- మోదీ మౌనమెందుకో?: కాంగ్రెస్

భారత్-పాక్‌ల మధ్య యుద్ధం ఆపానంటూ ట్రంప్ పదేపదే చెబుతున్నా ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని కాంగ్రెస్ ప్రశ్నించింది. 'మిత్రుడు డొనాల్డ్ భాయ్' చెబుతున్న మాటలపై మోదీ ఎందుకు పెదవి విప్పడం లేదని అడిగింది. "20 రోజుల్లో ఇది తొమ్మిదోసారి. మూడు దేశాల్లోని మూడు నగరాల్లో డొనాల్డ్ భాయ్ చెప్పిందే చెబుతున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన నాలుగు రోజుల యుద్ధాన్ని అమెరికా ఎలా ఆపిందో వివరించుకుంటూ వెళ్తున్నారు. భారత్-పాక్‌లను సమానంగా పరిగణిస్తున్నట్టు పునరుద్ఘాటిస్తున్నారు. దీనిపై మోదీ మాట్లాడడం లేదు" అని జైరాం రమేశ్ అన్నారు.

రాజ్యాంగంతోనే భారత్ సమైక్యం, సుదృఢం



ప్రయాగ్‌రాజ్, మే 31: ఎటువంటి సంక్షోభం తలెత్తినా భారతదేశం సమైక్యంగా, సుదృఢంగా ఉండేలా రాజ్యాంగం తగిన జాగ్రత్తలను పొందుపరిచిందని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. శనివారం అలహాబాద్ హైకోర్టు న్యాయవాదుల చాంబర్లతోపాటు బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయాన్ని జస్టిస్ గవాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత భారత్ అభివృద్ధిపథంలో కొనసాగిందంటే అది రాజ్యాంగం వల్లనేనన్నారు. మన పొరుగుదేశాల పరిస్థితి ఎలా ఉందో కనిపిస్తూనే ఉందన్నారు. రాజ్యాంగం అమలైన ఏడున్నర దశాబ్దాల కాలంలో దేశంలో సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని తీసుకురావటానికి శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు ఎంతగానో తోడ్పడ్డాయని తెలిపారు. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య వైరుధ్యం తలెత్తితే ప్రాథమిక హక్కులకే ప్రాధాన్యం ఇవ్వాలని 1973 ముందు వరకూ సుప్రీంకోర్టు భావించేదని జస్టిస్ గవాయ్ తెలిపారు. 1973లో 13 మంది సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం.. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉంటుందని పేర్కొంటూనే.. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రాజ్యాంగానికి ఆత్మవంటివని ఆ తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. రాజ్యాంగం అనే బంగారు రథానికి ఇవి రెండు చక్రాల వంటివని, ఏ చక్రాన్ని ఆపినా రథం ఆగిపోతుందని జస్టిస్ గవాయ్ హెచ్చరించారు.

ముడి వంటనూనెలపై సుంకం తగ్గింపు

రిఫైండ్ ఆయిల్‌పై యథాతథం: కేంద్రం

న్యూఢిల్లీ, మే 31: విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మూడు రకాల ముడి వంటనూనెలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని సగానికి సగం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ముడి పామాయిల్, ముడి సోయాబీన్ నూనె, ముడి సన్‌ఫ్లవర్ నూనెలపై 20 శాతం మేర ఉన్న 'బేసిక్ కస్టమ్ డ్యూటీ'ని 10 శాతానికి తగ్గిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇతరత్రా పన్నులను కలుపుకొంటే దిగుమతి చేసుకునే ముడి నూనెపై ప్రస్తుతం ఉన్న 27.5శాతం సుంకం 16.5 శాతానికి తగ్గనుంది. వంట నూనెల రిటెయిల్ ధరలను తగ్గించడం, దేశీయ తయారీదార్లకు రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకొంది. దిగుమతి చేసుకునే రిఫైండ్ ఆయిల్‌పై విధించే సుంకాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. రిఫైండ్ ఆయిల్‌పై 27.5శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ ఉండగా, ఇతరత్రా కలుపుకొంటే దిగుమతిదార్లు మొత్తంగా 35.75 శాతం చెల్లించాల్సి ఉంటుంది. దీంట్లో ఎలాంటి మార్పులు లేవు. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుంది. దేశ అవసరాల్లో 50 శాతం వంట నూనెలను విదేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. 2023-24 మార్కెట్ సంవత్సరం (నవంబరు-అక్టోబరు నెలల మధ్యకాలం)లో రూ.1.32 లక్షల కోట్లు విలువచేసే 159.6 లక్షల టన్నుల వంట నూనెలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. మలేసియా, ఇండోనేసియా నుంచి పామాయిల్; అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి సోయాబీన్ ఆయిల్ దిగుమతి అవుతోంది. ముడి వంటనూనెలు, రిఫైండ్ వంట నూనెలపై విధించే సుంకాల మధ్య తేడాను 8.25% నుంచి 19.25%నికి పెంచడం సాహసోపేత నిర్ణయమని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంజీవ్ అస్థానా అభిప్రాయపడ్డారు.


క్రికెట్ బెట్టింగ్ ముఠా నిందితులను చూపుతూ వివరాలు తెలుపుతున్న కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.. చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

» రూ.91 లక్షల నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం

కర్నూలు క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ బెట్టింగుకు పాల్పడుతున్న ఏడుగురు ముఠా సభ్యులను కర్నూలు జిల్లా ఆదోని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.91 లక్షల నగదుతో పాటు 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ విలేకరులకు తెలిపిన వివరాలు...ఈ నెల 18వ తేదీన వాల్మీకి నగర్‌లో కొంత మంది సెల్ ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. నాగరాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోగా మిగతా వారు పరారయ్యారు. నాగరాజు నుంచి రూ.50వేల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ముఠాలో అంతర్రాష్ట్ర సభ్యులు ఉన్నట్టు, అంతా ఆన్‌లైన్‌లోనే క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నేషనల్ ఎక్ఛేంజ్-9, రాధే ఎక్ఛేంజ్, వజ్రా ఎక్ఛేంజ్, నేషనల్-777, మోర్ ఎక్ఛేంజ్ అనే బెట్టింగ్ యాప్‌ల ద్వారా ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు పోలీసు విచారణలో వెల్లడైంది. ఒంగోలు, హైదరాబాదు, బెంగళూరు నగరాల్లో ముఠా సభ్యుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మసీదుపురం ఇస్మాయిల్(ఆదోని), బోయ మహానంది (ఆదోని), బోయ రమేష్ (ఆదోని), రాకేష్ (చిక్‌బల్లాపూర్, కర్ణాటక), శ్రీనివాసరావు (ఒంగోలు జిల్లా), అడ్డాల కళ్యాణ్ (ఒంగోలు), రఘు ఆచారి (ఐజ)ను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు.

'విపత్తుల' డైరెక్టర్ రోణంకిపై బదిలీ వేటు

» ఆర్‌సీజీఎస్ సీఈవో ప్రభాకర్ జైన్‌కు అదనపు బాధ్యతలు

అమరావతి, మే 31 (ఆంధ్రజ్యోతి): విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్‌గా ఉన్న రోణంకి కూర్మనాథ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయనను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సీఈవోగా ఉన్న ప్రభాకర్ జైన్‌కు విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో విపత్తుల నిర్వహణలోనూ, ప్రజలను అప్రమత్తం చేయడంలో ఆ విభాగం పూర్తిగా విఫలమైంది. ఆ మధ్య కాలంలో దాదాపు నెల రోజుల పాటు ప్రజలను అప్రమత్తం చేసే ఫోన్ మేసేజ్‌లు పూర్తిగా నిలిచిపోయాయి. పైగా విపత్తుల నిర్వహణకు సంబంధించి కొన్ని ముఖ్యమైన పరికరాల కొనుగోలులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. మొత్తంగా ఆ విభాగంలో జరుగుతున్న వ్యవహారాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సమావేశాల్లో సీరియస్ అయ్యారు. దీంతో కూర్మనాథ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది.

క్యూలైన్‌లో నినాదాలపై టీటీడీ సీరియస్

» భక్తుడిపై బైండోవర్ కేసు

» వీడియోలు తీసేవారిపై చట్టపరమైన చర్యలు: టీటీడీ అదనపు ఈవో

» క్షమించమంటూ భక్తుడి వీడియో


సౌకర్యాలపై క్యూలైన్‌లో భక్తులను అడిగి తెలుసుకుంటున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, మే31(ఆంధ్రజ్యోతి): తిరుమల క్యూలైన్‌లో భక్తులు అసహనంతో నినాదాలు చేసిన అంశాన్ని టీటీడీ తీవ్రంగా పరిగణించింది. 'టీటీడీ చైర్మన్ డౌన్‌డౌన్, భక్తులకు సౌకర్యాలు కల్పించాలి, పసిపాపలకు పాలు అందించాలి, ఆడవాళ్లకు ప్రత్యేక దర్శనం చేయించాలి, అధికారులు రావాలి, భక్తులను కాపాడాలి' అంటూ క్యూలైన్‌లో శుక్రవారం రాత్రి పదిన్నర సమయంలో ఒక భక్తుడు నినాదాలు చేస్తుండగా మిగిలిన భక్తులు గొంతు కలుపుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా, 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన విషయం విదితమే. ఈ సంఘటనకు కారకుడు అని గుర్తించిన వ్యక్తిపై తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ కేసు నమోదు చేశారు. కాగా, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తిరుమలలోని సర్వదర్శన క్యూలైన్లను అధికారులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కొందరు భక్తులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... టీటీడీ సిబ్బంది కృషిని పట్టించుకోకుండా భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కొందరు ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. కొందరు అనధికార వ్యక్తులు దర్శన క్యూలైన్లలో భక్తులను రెచ్చగొడుతూ వీడియోలు చిత్రీకరిస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నినాదాలు చేసిన వ్యక్తి తన తప్పును గ్రహించి క్షమాపణలు కోరారని తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రతిరోజూ లక్షకుపైగా భక్తులు దర్శనానికి వస్తున్నారని, వారాంతాల్లో ఈ సంఖ్య 1.20 లక్షలకు చేరుకుటోందన్నారు. వీఐపీ బ్రేక్, శ్రీవాణి దర్శనాలను తగ్గించి సాధారణ భక్తులకే పెద్ద పేస్తున్నామన్నారు. క్యూలైన్లలోని భక్తులకు శ్రీవారిసేవకుల ద్వారా నిరంతరాయంగా అన్నప్రసాదాలు, టీ, కాఫీ, పాలు, మజ్జిగ, స్నాక్స్ పంపిణీ చేస్తున్నామని అదనపు ఈవో వెంకయ్య చౌదరి వివరించారు.

క్షమించండి.. తప్పు చేశా: భక్తుడు అచ్చారావు

శుక్రవారం రాత్రి నినాదాలు చేసిన కాకినాడకు చెందిన అచ్చారావు ఓ వీడియో ద్వారా టీటీడీకి క్షమాపణలు చెప్పారు. 'ఉదయం నుంచి జ్వరంగా ఉంది. టీటీడీ అందజేస్తున్న సాంబారన్నం తినడం ఇష్టం లేక, దర్శనం ఎప్పుడు అవుతుందో తెలీక త్వరగా దర్శనం చేయిస్తారనే ఉద్దేశంతో నినాదాలు చేశాను. నిజానికి టీటీడీ సిబ్బంది నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు అందజేశారు. చాలా తప్పుగా మాట్లాడానని అర్థమైంది. నా తప్పును తెలుసుకున్నాను. అహర్నిశలు భక్తుల కోసం శ్రమిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో, సిబ్బందిని ఈ ఘటనలోకి తీసుకువచ్చినందుకు క్షమించమని కోరుతున్నా. ఈ పొరపాటును మన్నించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అంటూ శనివారం దర్శనం అనంతరం వీడియో ద్వారా తెలిపారు.

ఇది వైసీపీ కుట్ర: భానుప్రకాశ్, కిరణ్ రాయల్

కాగా, క్యూలైన్‌లోని భక్తులను రెచ్చగొట్టడం వెనుక వైసీపీ కుట్ర ఉందని టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని అధికారపార్టీని అల్లరి చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అసత్యప్రచారాలు చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. చట్టంలో మార్పులు తీసుకువచ్చేలా రానున్న టీటీడీ బోర్డు సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఇది వైసీపీ చేసిన కుట్రే అని జనసేన నేత కిరణ్‌రాయల్ వ్యాఖ్యానించారు. క్యూలో నినాదాలు చేసిన వ్యక్తి వైసీపీ కార్యకర్త అని తెలిపారు. దీనిని వీడియోరికార్డు చేయించి సోషల్‌మీడియాలో వైరల్ చేయడం వెనుక వైసీపీ ఉందన్నారు.

6న ఆప్కాబ్ చైర్మన్‌గా 'గన్ని' ప్రమాణ స్వీకారం

ఏలూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్‌గా నియమితులైన గన్ని వీరాంజనేయులు ఈనెల 6న విజయవాడలో పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఆయన్ను ఆప్కాబ్ చైర్మన్‌గా ప్రభుత్వం ఇటీవల నియమించింది.

డిఫెన్స్ ఉద్యోగులకు విశాఖ ఐఐఎంలో మేనేజ్‌మెంట్ కోర్సు

విశాఖపట్నం: డిఫెన్స్(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్)లో పనిచేసే ఉద్యోగుల కోసం విశాఖపట్నం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఎగ్జిక్యూటివ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లమో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఈపీజీడీపీఎం) కోర్సు ను శనివారం ప్రారంభించింది. ఈ కోర్సు కాలవ్యవధి ఏడాది. కోర్సు ప్రారంభ కార్యక్రమానికి హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ రిటైర్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి, ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ హాజరయ్యారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు 10 వరకు దరఖాస్తుల స్వీకరణ

నూజివీడు టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయుకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో ఇంటిగ్రేటెడ్ విద్యలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును పొడిగించా రు. జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని రిజిస్ట్రార్ ఎస్.అరమరేంద్రకుమార్ తెలిపారు. 2వ తేదీ నుంచి యూనివర్సిటీ వెబ్‌సైట్ లేదా ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా విద్యార్థులు దరఖాస్తులను దాఖలు చేయవచ్చని ఆయన తెలిపారు. కాగా, నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ ప్రవేశాలకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ పరిశీలన శనివారం ముగిసింది.

అర్ధనగ్నంగా చేసి.. స్తంభానికి కట్టేసి..!

» పెట్రోల్ పంప్ బాయ్‌ని చితకబాదిన వైనం

» వైసీపీ నేత బంకులో దాష్టీకం

» అమ్మకం డబ్బులు తక్కువగా ఇచ్చాడని నెపం

» శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన


యువకుడిని అర్ధనగ్నంగా స్తంభానికి కట్టేసిన దృశ్యం

కదిరి, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి వద్ద ఉన్న ఓ పెట్రోల్ బంకులో పంప్ బాయ్‌గా పనిచేసే యువకుడిని నిర్వాహకులు చిత్రహింసలు పెట్టారు. అర్ధనగ్నంగా చేసి, స్తంభానికి కట్టేయడంతో పాటు చితకబాదారు. వైసీపీ రాష్ట్ర నాయకుడు బత్తల హరిప్రసాద్ కుటుంబం ఈ పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తోంది. నల్లచెరువు మండల కేంద్రానికి చెందిన బాబాఫకృద్దీన్ కొన్ని రోజులక్రితం అక్కడ పంప్ బాయ్‌గా చేరాడు. శనివారం ఉదయం డ్యూటీ ముగించుకుని నగదు అప్పగించాడు. అందులో రూ.24 వేలు తక్కువ ఉందని మేనేజర్, ఇతర ఉద్యోగులు ఫకృద్దీన్‌ను చితకబాదారు. దుస్తులు లేకుండా చేసి, బంకు వద్ద ఉన్న స్తంభానికి చైన్లతో కట్టేశారు. కదిలేందుకు వీల్లేకుండా చేతులు వెనక్కి, కాళ్లను స్తంభానికి కట్టేశారు. సుమారు 2-3 గంటలపాటు బహిరంగంగా హింసించారు. అతని బంధువులు వచ్చి నిర్వాహకులను నిలదీసినా వెనక్కి తగ్గలేదు. బాధితుడిని తీసుకెళ్లి ఓ గదిలో పడేశారు. విషయం తెలుసుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని విచారించారు. గదిలో ఉన్న ఫకృద్దీన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మేనేజర్, ఇతర ఉద్యోగులను కూడా స్టేషన్‌కు తీసుకొచ్చారు. తమ యజమాని చెబితేనే ఇలా చేశామని, ఏమైనా ఉంటే వారితోనే మాట్లాడుకోవాలని వారు సమాధానం చెప్పారు.

నలుగురిపై కేసు నమోదు

ఫకృద్దీన్‌పై దాడి చేసినందుకు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెట్రోల్ బంక్ మేనేజర్ సత్యనారాయణ, పంప్ బాయ్‌లు అమర్‌నాథ్, మాబు, హరికృష్ణను నిందితులుగా చేర్చారు. బంక్ నిర్వహిస్తున్న వైసీపీ నాయకుడు బత్తల హరిప్రసాద్, ఆయన తండ్రి వెంకటరమణపై కేసు నమోదు చేయలేదు.

కలుపు మందుకు యువ రైతు బలి

» తూర్పుగోదావరి జిల్లా చీపురుగూడెంలో విషాదం

నల్లజర్ల, మే 31(ఆంధ్రజ్యోతి): కలుపు మందు శరీరంపై పడి ఒక యువ రైతు మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన చెల్లు లీలా కృష్ణప్రసాద్ (30) పదిహేను రోజుల కిందట బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై ఉండే కవర్‌లో కలుపు మందు తీసుకుని పొలానికి బయలుదేరాడు. అయితే ఆ కలుపు మందు తన పొట్ట బాగాన టీషర్ట్‌పై పడిన విషయాన్ని ప్రసాద్ గమనించలేదు. సాయంత్రం వరకు పొలం పనులు చేసుకుని తిరిగి ఇంటికొచ్చాడు. తర్వాత గుండీలు లేని టీషర్ట్‌ను ముఖంపై నుంచి తీసి స్నానం చేసి పడుకున్నాడు. మరుసటి రోజు కళ్లు తిరిగి పడిపోవడంతో తండ్రి సుబ్రహ్మణ్యం హుటాహుటిన నల్లజర్ల విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కలుపు మందు ప్రభావం ఉందని, మరొక చోటుకు తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కృష్ణప్రసాద్‌ను తొలుత ఏలూరు, తర్వాత విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. ప్రసాద్‌కు ఏడాది క్రితం వివాహమైంది. అతని అకాల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


లీలా కృష్ణప్రసాద్(ఫైల్)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

• ఆర్కే RK

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొన్నదన్నట్టుగా ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. జగన్‌రెడ్డి పాలనలో అనేక ఇబ్బందులు పడ్డ కార్యకర్తల్లో ప్రభుత్వంపై ఆశలు, ఆకాంక్షలు అధికంగా ఉన్నందున ప్రభుత్వంలో ఏ చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియా వేదికగా ప్రతిస్పందన తీవ్రంగా ఉంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడానికి సైతం తెలుగు తమ్ముళ్లు వెనుకాడలేదు. దీనికితోడు కొన్ని ప్రధాన సంక్షేమ కార్యక్రమాలు ఇంకా అమలుకాకపోవడంతో ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత ఏర్పడిందా? అన్న అనుమానం రాజకీయ పరిశీలకుల్లో కూడా ఏర్పడింది. ఇదంతా చూసి ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత మొదలైందని, నాలుగేళ్ల తర్వాత మళ్లీ అధికారం తనదేనని జగన్‌రెడ్డి ఆశలు పెంచుకుంటున్నారు. అయితే ఈ ప్రచారంలో వాస్తవం లేదని కడప మహానాడు రుజువు చేసింది.

లోకేశ్‌కు పట్టం!

రాజకీయ పార్టీలు సమావేశాలు జరుపుకోవడం కొత్త కాదు. అయితే తెలుగుదేశం పార్టీ నిర్వహించుకునే మహానాడుకు ప్రత్యేకత ఉంటుంది. అది ఒక పార్టీ కార్యక్రమం మాత్రమే కాదు.. అదొక ఉద్విగ్నభరిత సన్నివేశం. తెలుగు ప్రజలతో విడదీయరాని బంధం కూడా. వేలాది మంది పార్టీ ప్రతినిధులతో క్రమం తప్పకుండా మహానాడును ఒక పండుగలా జరుపుకోవడం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ మహానాడు నిర్వహణను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు అధికారంలో ఉన్నా, లేకపోయినా మహానాడును క్రమశిక్షణతో నిర్వహించగలగడం ఆ పార్టీ ప్రత్యేకత. పార్టీ అధ్యక్షుడిగా ఎన్టీఆర్ ఉన్నప్పుడు గండిపేటలోని పార్టీ కార్యాలయం వద్ద మహానాడు నిర్వహించే వారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగేది. పెళ్లిళ్లు, పేరంటాలకు హాజరైనట్టుగా పార్టీ ప్రతినిధులు ముస్తాబై ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు. ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ, విశాఖలో నిర్వహించిన మహానాడుకు జాతీయ నాయకులు హాజరయ్యారు. నాటి కాంగ్రెస్ వ్యతిరేక శక్తులకు మహానాడు వేదికగా ఉండేది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం పార్టీ ప్రతినిధులకు ఒక అనుభూతిని మిగిల్చేది. పార్టీ అధ్యక్షుడిగా ఎన్టీఆర్ ఉన్నప్పుడు, ప్రస్తుత పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆయనకు కుడి భుజంగా వ్యవహరిస్తూ మహానాడు నిర్వహణలో కీలక పాత్ర పోషించేవారు. తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు మూడో తరం ప్రవేశించింది. కడపలో నిర్వహించిన మహానాడు బాధ్యతను మూడవ తరానికి చెందిన లోకేశ్ చేపట్టారు. ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా కడప మహానాడు గ్రాండ్ సక్సెస్ అయింది. ముగింపు రోజున నిర్వహించే బహిరంగ సభకు జనం భారీగా హాజరవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు ఒంగోలులో నిర్వహించిన మహానాడు పార్టీ శ్రేణుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపగా, అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఇప్పుడు నిర్వహించిన మహానాడు ద్వారా కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారంలో నిజం లేదని, ప్రభుత్వంపై ప్రజల భరోసా సన్నగిల్లలేదని రుజువైంది. ప్రభుత్వం పట్ల సానుకూలత విషయం పక్కనపెడితే, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ప్రజల్లో కోపం ఇంకా తగ్గ లేదని మహానాడు ముగింపు సభ చెబుతోంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొన్నదన్నట్టుగా ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. జగన్‌రెడ్డి పాలనలో అనేక ఇబ్బందులు పడ్డ కార్యకర్తల్లో ప్రభుత్వంపై ఆశలు, ఆకాంక్షలు అధికంగా ఉన్నందున ప్రభుత్వంలో ఏ చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియా వేదికగా ప్రతిస్పందన తీవ్రంగా ఉంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించ డానికి సైతం తెలుగు తమ్ముళ్లు వెనుకాడలేదు. దీనికితోడు కొన్ని ప్రధాన సంక్షేమ కార్యక్రమాలు ఇంకా అమలుకాక పోవడంతో ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత ఏర్పడిందా? అన్న అనుమానం రాజకీయ పరిశీలకుల్లో కూడా ఏర్పడింది. ఇదంతా చూసి ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత మొదలైందని, నాలుగేళ్ల తర్వాత మళ్లీ అధికారం తనదేనని జగన్‌రెడ్డి ఆశలు పెంచు కుంటున్నారు. అయితే ఈ ప్రచారంలో వాస్తవం లేదని కడప మహానాడు రుజువు చేసింది. పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదు. అతి క్రియాశీలకంగా వ్యవహరించే కొద్ది మంది మాత్రం అతిగా వ్యాఖ్యలు చేస్తున్నారని అర్థమవుతోంది. శాసనసభ్యులపై కార్యకర్తలకు కోపం ఉన్నప్పటికీ ఆ కోపం పార్టీ మీద కాదని రుజువైంది. కడప వంటి చోట మహానాడు నిర్వహించినా వసతులు ఉన్నాయా లేవా అని కూడా చూడ కుండా వేలాది మంది కార్యకర్తలు తరలి రావడమే ఇందుకు నిదర్శనం. ముగింపు సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడం హైలైట్. నిజానికి కడప జిల్లా నుంచి గెలిచిన ఎమ్మెల్యేలపై పార్టీ కార్యకర్తలు సంతృప్తిగా లేరు. తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. చంద్రబాబు మీద ప్రేమ తగ్గకపోయినా స్థానిక ఎమ్మెల్యేలపై ఆగ్రహంతో ఉన్నారు. అయితే మహానాడు విజయవంతం కావడానికి ఇవేమీ అడ్డు రాలేదు. ఇదే ఈ మహానాడు ప్రత్యేకత! ఈ మహానాడులో మరో మూడు నాలుగు ప్రత్యేకతలూ కనిపించాయి. కార్యకర్తల మనోభావాలను గుర్తించిన అధినేత చంద్రబాబు నాయుడు తన ప్రసంగంలో కోవర్టుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎన్నికల తర్వాత అప్పటి వరకు వైసీపీలో అధికారం చెలాయించి తమను ఇబ్బంది పెట్టినవారు ఇప్పుడు ఎమ్మెల్యేల చుట్టూ చేరి అధికారం చెలాయిస్తున్నారని కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నారు. ఎమ్మెల్యేల పంచన చేరుతున్న కోవర్టుల కారణంగానే పల్నాడు జిల్లాలో ఇటీవల ఇద్దరు కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా వచ్చింది. ఈ కారణంగానే ఒక పథకం ప్రకారం పార్టీలో చేరుతున్న కోవర్టుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన పార్టీ శాసనసభ్యులను పరోక్షంగా హెచ్చరించారు. ఈ సమస్యను అధిగమించడానికి ఎటువంటి చర్యలు చేపడ తారో చూడాలి. అదే సమయంలో ఎమ్మెల్యేలను కట్టడి చేయ వలసిన అవసరాన్ని ఈ మహానాడు గుర్తుచేస్తోంది. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఓడిపోవడానికి ఆయన మాత్రమే కారణం కాగా, ఇప్పుడు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత అంటూ ఏర్పడితే అందుకు శాసనసభ్యులే ప్రధాన కారణం కాబోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రజల్లో భరోసా సన్నగిల్లలేదు కనుక ప్రజలు ప్రస్తుతానికి సర్దిచెప్పు కొంటున్నారు. ఈ దశలో ఎమ్మెల్యేలను కట్టడి చేయని పక్షంలో దాని ప్రభావం పార్టీపై పడుతుంది. ఈ అంశాన్ని వక్తలు తమ ప్రసంగాల్లో ప్రస్తావించకపోయినా ఈ మహానాడు ద్వారా పార్టీకి అంతర్లీనంగా అందిన సందేశం ఇదే. కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా ప్రస్తుతానికి సానుకూలంగా ఉన్నారు. మిగతా నాలుగేళ్లు కూడా ఇదే సానుకూలత కొనసాగాలంటే పార్టీ నాయకత్వం కొన్ని విరుగుడు చర్యలు తీసుకోవాల్సిందే.

ఎమ్మెల్యేలను కట్టడి చేయవలసిన అవసరాన్ని కడప మహానాడు గుర్తుచేస్తోంది. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఓడిపోవడానికి ఆయన మాత్రమే కారణం కాగా, ఇప్పుడు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత అంటూ ఏర్పడితే అందుకు శాసనసభ్యులే ప్రధాన కారణం కాబోతున్నారు.

రాటుదేలిన లోకేశ్!

ఈ విషయం అలా ఉంచితే, ఈ మహానాడులో లోకేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మూడవ తరం ప్రతినిధిగా పార్టీ బాధ్యతలు మోయగల శక్తియుక్తులు తనకు ఉన్నాయని ఆయన నమ్మకం కలిగించగలిగారు. మహానాడులో ప్రసం గించిన లోకేశ్‌ను నిశితంగా గమనిస్తే ఆయనలో మూర్తీభ వించిన ఆత్మవిశ్వాసం కనిపించింది. గతంలో కొంత తొట్రుపాటు కనిపించేది. తెలుగు భాషపై అంతగా పట్టు కూడా ఉండేది కాదు. ఇటీవల ఢిల్లీలో కుటుంబ సభ్యులతో కలసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని లోకేశ్ కలుసుకోవడం, ప్రధాని వారితో రెండు గంటలపాటు గడపటం తెలిసిందే. ఈ సందర్భంగా లోకేశ్‌కు కొన్ని సూచనలు చేయడంతో పాటు ఆయనలో తాను గమనించిన మార్పు గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. 'మీలో పరిణతి కనిపిస్తోంది. ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతోంది. మీ ప్రసంగాలలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మార్పును నేను గమనించాను. మొదట్లో తడబడిన మీరు ఇప్పుడు ఆసువుగా ఉపన్యసిస్తు న్నారు' అని ప్రధాని మోదీ ప్రశంసించారు. అదే సమయంలో చంద్రబాబు నీడ నుంచి బయటపడి సొంతంగా ఎదిగే ప్రయత్నం చేయాలని కూడా లోకేశ్‌కు ప్రధాని సూచించారు. ప్రధాని పరిశీలన నిజమే. గతంతో పోలిస్తే లోకేశ్ ఇప్పుడు రాటుదేలారు. నిజం చెప్పాలంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపన్యాసాలు ప్రజలను ఆకట్టుకొనే విధంగా ఉండవు. ఆయనకు అంతటి వాగ్ధాటి లేదు. 2019కి పూర్వం తెలుగులో మాట్లాడటానికి తొట్రుపడిన లోకేశ్, ఇప్పుడు అనర్గళంగా మాట్లాడగలుగుతున్నారు. లోకేశ్ భాష కూడా బాగా మెరుగైంది. అదే సమయంలో ఆయనలో ఆత్మవిశ్వాసం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. బాడీ లాంగ్వేజ్ కూడా అందుకు అనుగుణంగా మారింది. సాధన వల్లనే ఇది సాధ్యమై ఉంటుంది. వర్తమాన రాజకీయాలలో లోకేశ్‌కు ఎదురైనన్ని అవమానాలు మరే ఇతర నాయకుడికీ ఎదురవలేదు. జగన్ అండ్ కో ఒక పథకం ప్రకారం లోకేశ్‌ను కించపరిచే విధంగా ప్రచారం చేశారు. పప్పు అని అవమానించారు. ఆయన భాషను హేళన చేశారు. చివరికి ఆయన పుట్టుకపై కూడా జుగుప్సాకరంగా మాట్లాడారు. మామూలుగా అయితే ఇన్ని అవమానాలు ఎదురైనప్పుడు మానసికంగా కుంగిపోతాం. అయితే లోకేశ్ వాటిని పట్టించు కోకుండా లక్ష్యం వైపు కదిలారు. తానేమిటో రుజువు చేసుకోవ డానికి అహరహం కృషి చేశారు. బాడీ షేమింగ్‌కు గురైనప్పటికీ బాధపడకుండా ఆహార నియంత్రణ పాటించడం ద్వారా విమర్శకుల నోళ్లు కట్టేశారు. రాజకీయాలలో నంబర్ 2గా ఉన్న వారిని టార్గెట్ చేసుకోవడం సహజం. ఎన్టీఆర్ ఉన్నప్పుడు నంబర్ 2గా ఉన్న చంద్రబాబును కూడా అప్పటి కాంగ్రెస్ నాయకులు టార్గెట్ చేశారు. ఆయనపై నిత్యం ఆరోపణలు చేసేవారు. చివరికి చర్మ సంబంధమైన సమస్య వచ్చి చికిత్స తీసుకున్నప్పుడు కూడా అవమానించారు. అయితే లోకేశ్‌కు ఎదురైనన్ని అవమానాలు చంద్రబాబుకు ఎదురవలేదు. తనపై వస్తున్న ఆరోపణలకు చంద్రబాబు వెరవకుండా కార్యకర్తలు, నాయకులకు నిత్యం అందుబాటులో ఉండటం ద్వారా ఎన్టీఆర్‌కు వారసుడిగా నిలిచారు. 1983లో కాంగ్రెస్ పార్టీ తరఫున చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయిన చంద్రబాబు, ఆ తర్వాత సురక్షితమైన కుప్పం నియోజకవర్గానికి మారారు. లోకేశ్ అలా చేయలేదు. సంక్లిష్టమైన మంగళగిరి నుంచి మొట్టమొదటిసారి పోటీచేసిన ఆయన ఓడిపోయారు. మంగళగిరి నుంచి పోటీ చేసి ఉండాల్సింది కాదు అని అప్పట్లో చాలా మంది అభిప్రాయపడ్డారు. ఎందుకంటే, మంగళగిరిలో 1983 నుంచి నేటి వరకు తెలుగుదేశం పార్టీ మూడు నాలుగు పర్యాయాలు మాత్రమే గెలిచింది. అయిన ప్పటికీ లోకేశ్ మరో సురక్షిత నియోజకవర్గం వెతుక్కోకుండా ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలి అన్నట్టుగా పట్టుదల ప్రదర్శించి గత ఎన్నికల్లో తాను ఓడిన మంగళగిరి నుంచే 91 వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందారు. ఆయన లోని ధైర్యానికి, పట్టుదలకు ఇదొక నిదర్శనం. ఈ నేపథ్యంలో కడపలో జరిగిన మహానాడులో లోకేశ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి అప్పగించాలని పలువురు ప్రతిపాదించారు. నిజానికి ఆయన ఇప్పుడు జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాత్రమే ఉన్నప్పటికీ పార్టీ నిర్వహణ బాధ్యతలను ఇప్పటికే చేపట్టారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రభుత్వ కార్యక్రమా లతో బిజీగా ఉంటున్నందున పార్టీ బాధ్యతలను లోకేశ్ చూసుకుంటున్నారు. పార్టీలోని సీనియర్ నాయకులు కూడా ఆయన నాయకత్వాన్ని ఇప్పుడిప్పుడే అంగీకరిస్తున్నారు. కార్యకర్తల్లో కూడా లోకేశ్ నాయకత్వం పట్ల నమ్మకం ఏర్పడు తోంది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు దారుణ హత్యకు గురైన చంద్రయ్య అనే పార్టీ కార్యకర్త కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించడంలో లోకేశ్ పట్టుదలతో కృషి చేశారు. దీంతో ఆయనపై కార్యకర్తల్లో భరోసా ఏర్పడింది. ఇప్పుడు ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందడమే లోకేశ్ ముందున్న కర్తవ్యం. ప్రజలతో నేరుగా సంబంధాలు ఏర్పరచుకోవడం, అంటే ప్రజల్లోకి వెళ్లడం ద్వారా ప్రజామోదం పొందే ప్రయత్నాలను ఆయన ఇప్పటికే మొదలెట్టారు. పార్టీ వ్యవహారాల్లో ఆయనకు చంద్రబాబు ఇప్పుడిప్పుడే స్వేచ్ఛ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ బాధ్యతలను లోకేశ్‌కు పూర్తిగా ఎందుకు అప్పగించ కూడదు అన్న ప్రతిపాదన కూడా అంతర్గతంగా చర్చకు వచ్చింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు తీరిక లేకుండా ఉన్నందున పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని లోకేశ్‌కు అప్పగిస్తే తప్పేమిటి? ఇవాళ కాకపోయినా రేపైనా తానే వారసుడు కదా? చంద్ర బాబు యాక్టివ్‌గా ఉన్నప్పుడే పార్టీ బాధ్యతలను పూర్తిగా ఆయనకు అప్పగిస్తే నాయకత్వ మార్పిడి సాఫీగా జరిగిపోతుంది కదా? అన్న అభిప్రాయం కూడా బలంగా ఉంది. ప్రజామోదం ఉన్నంత వరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. మూడో తరం ప్రతినిధిగా లోకేశ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ప్రకటిస్తే ఇటు ప్రభుత్వ, అటు పార్టీ వ్యవహారాలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చు అన్న అభిప్రాయం ఉంది. లోకేశ్‌కు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష పదవి కట్టబెట్టినా చంద్ర బాబు నాయుడు నీడలోనే ఆయన పనిచేయాల్సి ఉంటుంది. ఈ కారణంగా తెలుగుదేశం పార్టీ తదుపరి వారసుడిగా లోకేశ్‌ను ఇప్పుడే ప్రకటించాలని పలువురు భావిస్తున్నారు. చంద్రబాబు కూడా ఈ ప్రతిపాదన పట్ల సుముఖంగా ఉన్నారు. అయితే చంద్రబాబు యాక్టివ్‌గా ఉన్నప్పటికీ ఆయనను పక్కనబెట్టి నాయకత్వం చేపట్టాడన్న అపప్రథ తనకు చుట్టుకో కూడదన్న అభిప్రాయంతో లోకేశ్ ఉన్నట్టు చెబుతున్నారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉన్నంత వరకు ఆయనను ధిక్కరించే పరిస్థితి తెలుగుదేశం పార్టీలో ఉండదు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ పదమూడేళ్లు మాత్రమే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగగా, చంద్రబాబు ముప్పై ఏళ్లకు మించి పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ ముప్పై ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని తాను నిలబడటమే కాకుండా పార్టీని నిలబెట్టారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు పర్యవేక్షణలో లోకేశ్ పార్టీ బాధ్యతలను చేపడితే ఇటు కార్యకర్తలు, అటు ప్రజలకు కూడా భరోసా ఏర్పడే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీతో చంద్రబాబుకు సంబంధం లేదు అన్న అభిప్రాయం కలగకుండా పార్టీ ప్రెసీడియం ఏర్పాటు చేసి దానికి ఆయనను చైర్మన్‌గా పెట్టుకోవచ్చునన్న అభిప్రాయం కూడా ఉంది.



తదుపరి ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడే పార్టీ బాధ్యతలను లోకేశ్ చేపడితే ఎన్నికల నాటికి మరింత రాటుదేలుతారు. లోటుపాట్లు ఏవైనా జరిగినా సరిదిద్దడానికి చంద్రబాబు ఉండనే ఉంటారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలు చేపట్టినవారు విజయవంతమైన దాఖలాలు పెద్దగా లేవు. తెలుగుదేశం సీనియర్ నాయకుడు ఒకరు ఈ విషయమే ప్రస్తావిస్తూ.. లోకేశ్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించడానికి ఇంతకు మించిన తరుణం ఏముంటుంది? అని ప్రశ్నించారు. శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వం తరఫున ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే బాధ్యతను లోకేశ్ సమర్థవంతంగా నిర్వహించారు. శాసనమండలిలో వైసీపీకి మెజారిటీ ఉండటం గమనార్హం. ప్రతిపక్ష నాయకుడిగా బొత్స సత్యనారాయణ ఉన్నారు. అయినప్పటికీ లోకేశ్ తొట్రుపడకుండా ప్రతిపక్షాన్ని దీటుగా ఎదుర్కొన్నారు. దీంతో లోకేశ్‌ను తక్కువ అంచనా వేయడానికి లేదు, ఆయనలో సరుకు ఉందని ప్రతిపక్ష ముఖ్యుడు ఒకరు వ్యాఖ్యానించారు. పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి లోకేశ్ కూడా సుముఖంగా ఉన్నందున ఆయనకు ముందస్తు అభినందనలు చెబుదాం.

అస్సలు తగ్గేదేలే..!

ఎన్టీఆర్ ఏ ముహూర్తంలో తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారో గానీ నాలుగు దశాబ్దాలు గడచినా ఆ పార్టీ చెక్కు చెదరలేదు. ఇప్పుడు పార్టీలోకి కొత్త తరం వచ్చింది. వారందరికీ పార్టీ భవిష్యత్తుపై భరోసా కల్పించాల్సిన బాధ్యత చంద్ర బాబుపై ఉంది. చంద్రబాబు నిన్నటి తరానికి చెందినవారు. లోకేశ్ ఈ తరానికి చెందినవారు. నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు సాచివేత ధోరణి అవలంబిస్తారు. లోకేశ్ మాత్రం ఈ తరానికి అనుగుణంగా వేగంగా నిర్ణయాలు తీసుకుంటారు. అదే సమయంలో సీనియర్లు, అనుభవజ్ఞులు ఇచ్చే సలహాలను స్వీకరిస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డితో ఢీ అంటే ఢీ అనడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు. 2029లో ఏ కారణం వల్లనైనా జగన్‌రెడ్డి అధికారంలోకి వస్తే పరిణామాలు ఎలా ఉంటాయో లోకేశ్‌కు తెలుసు. అయినా తగ్గేదేలే అన్నట్టుగా ఆయన అడుగులు వేస్తున్నారు. లోకేశ్ చేతుల్లో తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు భద్రంగా ఉంటుందన్న నమ్మకాన్ని కార్యకర్తల్లో కల్పించాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉంది. చంద్రబాబు మార్గదర్శకత్వంలో తెలుగుదేశం పార్టీని లోకేశ్ నడిపించడానికి నిజానికి ఇదే సరైన తరుణం. ఇప్పుడు పార్టీ బలంగా ఉంది. మాజీ ముఖ్యమంత్రిపై ప్రజల్లో కోపం ఇంకా పోలేదు. నాయకత్వ మార్పిడికి ఇంతకంటే మంచి తరుణం ఏముంటుంది? తెలంగాణలో కేసీఆర్ కూడా పార్టీ నాయకత్వాన్ని కుమారుడు కేటీఆర్‌కు బదలాయించాలని అనుకున్నారు. ఈ క్రమంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్‌ను నియమించారు. అయితే కేసీఆర్ నీడ నుంచి ఆయన బయటపడక ముందే ఎన్నికలు రావడం, పార్టీ అధికారాన్ని కోల్పోవడం జరిగింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కార్యకర్తలతో సంబంధాలను పటిష్టం చేసు కోవడంలో కేటీఆర్ విఫలమయ్యారు. ఇప్పుడు పార్టీ అధికారంలో లేదు కనుక కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన సోదరి కవిత వ్యతిరేకిస్తున్నారు. కేటీఆర్ నాయకత్వంలో తాను పనిచేయనని ఆమె ప్రకటించారు. చంద్రబాబుకు ఈ సమస్య లేదు. లోకేశ్‌కు కూడా సోదరుడో, సోదరో ఉండి ఉంటే నాయకత్వం కోసం పోటీ పడేవారేమో? దివంగత రాజశేఖరరెడ్డి, కేసీఆర్ కుటుంబాలలో అన్నాచెల్లెళ్లు అధికారం కోసం పోటీ పడటాన్ని చూస్తున్నాం. చంద్రబాబుకు లోకేశ్ ఒక్కడే వారసుడు కనుక ఈ బెడద కూడా లేదు. కాలూ చేయీ సరిగ్గా ఉన్నప్పుడే అన్నీ చక్కదిద్దుకోవాలని అంటారు. చంద్రబాబుకు 75 ఏళ్ల వయసు వచ్చినప్పటికీ మానసికంగా, శారీరకంగా ఆయన దృఢంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి కొత్త తరం నాయకుడిని అందించడంపై చంద్రబాబు దృష్టి పెట్టాలి. శషభిషలకు స్వస్తి చెప్పి లోకేశ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నియమించే విషయంలో ఆయన ఒక నిర్ణయం తీసుకోవాలి. తదుపరి ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడే పార్టీ బాధ్యతలను లోకేశ్ చేపడితే ఎన్నికల నాటికి మరింత రాటుదేలుతారు. లోటుపాట్లు ఏవైనా జరిగినా సరిదిద్దడానికి చంద్రబాబు ఉండనే ఉంటారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలు చేపట్టినవారు విజయవంతమైన దాఖలాలు పెద్దగా లేవు. తెలుగుదేశం సీనియర్ నాయకుడు ఒకరు ఈ విషయమే ప్రస్తావిస్తూ.. లోకేశ్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించడానికి ఇంతకు మించిన తరుణం ఏముంటుంది? అని ప్రశ్నించారు. శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వం తరఫున ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే బాధ్యతను లోకేశ్ సమర్థవంతంగా నిర్వహించారు. శాసనమండలిలో వైసీపీకి మెజారిటీ ఉండటం గమనార్హం. ప్రతిపక్ష నాయకుడిగా బొత్స సత్యనారాయణ ఉన్నారు. అయినప్పటికీ లోకేశ్ తొట్రు పడకుండా ప్రతిపక్షాన్ని దీటుగా ఎదుర్కొన్నారు. దీంతో లోకేశ్‌ను తక్కువ అంచనా వేయడానికి లేదు, ఆయనలో సరుకు ఉందని ప్రతిపక్ష ముఖ్యుడు ఒకరు వ్యాఖ్యానించారు. పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి లోకేశ్ కూడా సుముఖంగా ఉన్నందున ఆయనకు ముందస్తు అభినందనలు చెబుదాం. 2029లో పార్టీ మళ్లీ విజయం సాధించాలంటే పార్టీపరంగా తీసుకోవాల్సిన దిద్దుబాటు చర్యలపై లోకేశ్ వెంటనే దృష్టి పెట్టాలి. చంద్రబాబులో మొహమాటం ఎక్కువ. లోకేశ్ అలా కాదని, కరాఖండీగా వ్యవహరిస్తారని అంటున్నారు. తండ్రిని మించిన తనయుడు అని రుజువు చేసుకోవాలన్న పట్టుదల కూడా ఆయనలో కనిపిస్తోంది. అన్నీ మంచి శకునములే అన్నట్టుగా పార్టీ నియమావళికి అనుగుణంగా నాయకత్వ మార్పిడికి చంద్రబాబు శ్రీకారం చుడతారా? లేదా? అంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. పార్టీలో కట్టుతప్పుతున్న నాయకులను, శాసనసభ్యులను కట్టడి చేసే విషయంలో కూడా చంద్రబాబుకు మొహమాటం అడ్డు వస్తోంది. ఇది అంతిమంగా పార్టీకి నష్టం చేస్తుంది. ఇలాంటి లోటుపాట్లను అధిగమించడం అవసరం. మహానాడులో ఉపన్యాసాల ద్వారా లోకేశ్ ఇప్పటికే తండ్రి కంటే చాలా మెరుగు అని రుజువు చేసుకున్నారు. నాయకత్వం అప్పగిస్తే పార్టీలో క్రమశిక్షణను మరింతగా ఆయన పాదుగొల్పగలరని నాయకులు అంగీకరిస్తున్నారు. తనకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుకు ఢోకా ఉండదని లోకేశ్ ఇప్పటికే రుజువు చేసుకున్నారు. కడప మహానాడుతో ఈ విషయం రుజువైంది. కడప మహానాడు వేదికగా లోకేశ్‌కు నాయకత్వం అప్పగించే విషయం తెర మీదకు వచ్చింది. రాజకీయంగా తెలుగుదేశం పార్టీ తలబడుతున్న వైసీపీ అధినేత జగన్‌రెడ్డి సొంత జిల్లా కడప అయినందున మహానాడులోనే ఆయనకు నాయకత్వ బాధ్యతలు అప్పగించే విషయమై ప్రకటన చేసి ఉంటే బాగుండేదని కూడా కొందరు పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా తెలుగుదేశం పార్టీ భావి నాయకుడు లోకేశ్ మాత్రమే కనుక చంద్రబాబు కనుసన్నల్లోనే నాయకత్వ మార్పిడి జరగడం వాంఛనీయం అని తెలుగుదేశం శ్రేణులు కూడా అభిప్రాయపడుతున్నాయి. మొత్తానికి నాయకత్వ మార్పిడికి నిర్ణయం జరిగిపోయింది. ముహూర్తం ఖరారు కావడమే మిగిలి ఉంది. సో.. లోకేశ్‌కు ముందస్తు శుభాకాంక్షలు చెబుదాం!

---

80 వసంతాల భాభా దార్శనికత

దేశంలో నాణ్యమైన శాస్త్ర పరిశోధనల కోసం ఒక సంస్థ అవసరముందన్న హోమీ జహంగీర్ భాభా ప్రతిపాదనకు అంగీకరించి, అందుకవసరమైన నిధులను ఇవ్వడానికి అంగీకరించింది సర్ దొరాబ్జి టాటా ట్రస్ట్. దీంతో 1 ఏప్రిల్, 1944లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) రూపుదిద్దుకుంది. ఈ సంస్థను బొంబాయిలో స్థాపించడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు సహ వ్యవస్థాపకుడిగా ఉండటానికి ఉత్సుకత చూపడమే. ఆ తరువాత టీఐఎఫ్ఆర్ అద్దె భవనంలో జూన్ 1, 1945న ప్రారంభమయింది. అప్పటి నుంచి అద్దె భవనాల్లోనే పరిశోధనలు, కార్యక్రమాలు నిర్వహించేది. 1962లో ఈ సంస్థ కొలాబాలోని స్వంత భవనానికి మారింది. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ భవన ప్రారంభోత్సవం చేస్తూ "సంస్థను, సంస్థ ఉద్దేశాలను, ఈ సంస్థ స్థాపనకు మీ తపన, ప్రయత్నం చూసిన తరువాత, సంస్థ అద్భుత మైన ఫలితాలను సాధించగలదని విశ్వసనీయంగా చెప్పగలను" అన్నారు.

'టీఐఎఫ్ఆర్‌ని ప్రపంచ స్థాయిలో ప్రాథమిక శాస్త్ర పరిశోధనలకు నిలయంగా, అగ్రగామిగా ఉండాలని డా. భాభా కోరుకున్నారు. ముఖ్యంగా భారతదేశంలో నూతన శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలకు, విద్యా నైపుణ్యాన్ని పెంచడానికి దోహద కారిగా ఉండాలన్నది ఆయన ఆశయం. శాస్త్ర రంగంలో దేశ అవసరాలను తీర్చేందుకు 'టీఐఎఫ్ఆర్' ఒక ముందడుగు. గణితం, భౌతికశాస్త్రంతో పాటు ఇతర ప్రాథమిక శాస్త్రాల పరిశోధనలకు ఈ సంస్థ నిలయమైంది. ప్రాథమిక సంవత్సరాలలో ముఖ్యమైన పరిశోధనా కార్యక్రమాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన శాస్త్రజ్ఞులను నియామకం చేసింది. రెండవ సంవత్సరం నుంచే దానికి 'కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ద్వారా ప్రభుత్వ నిధులు అందసాగాయి.

టీఐఎఫ్ఆర్‌లో భవిష్యత్తు అభివృద్ధి కోసం రూపురేఖలు (ఫ్లో చార్ట్) ఏమీ లేవు. హోమీ భాభా సముచిత ప్రజ్ఞావంతులను ఎంపిక చేసి, వారి పరిశోధనలకు కావలసిన అవకాశాలను, పని పరిస్థితులను కల్పించారు. మొదట నైపుణ్యం గల వ్యక్తులను ఎంపిక చేసి, తదనంతరం వారికి కావలసిన విభాగాన్ని స్థాపించి, అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేవారు. ఇందుకు ఒక ఉదాహరణ డా. భాభా, మైక్రో బయాలజిస్ట్ ఒబైద్ సిద్దిఖీకి రాసిన ఉత్తరం. "ప్రస్తుతానికి ఈ సంస్థలో బయాలజీ సెక్షన్ లేదు. కానీ ఈ సంస్థ ప్రారంభం నుంచి కూడా నాకు ఇందులో బయోఫిజిక్స్, మైక్రో బయాలజీ డిపార్టుమెంట్ ప్రారంభించాలని ఉంది. దానికి సరిపోయిన వ్యక్తి కావాలి. మీరు ఇక్కడ కాని, ఆటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంటులో కాని చేరాలని నా అభిలాష. మీకు కావలసిన వనరులు, పరికరాలు, మానవ సంసాధనాలు మొదలైనవి జీరో నుంచి మొదలు పెట్టాలి. మీకు ఏ విధమైన ఆర్థిక లోటూ ఉండదు. మీకు అవసరమైన పరికరాల, ఉప కరణాల జాబితా పంపండి. ఇక్కడ ఈ సంస్థలో కానీ, దేశంలో ఇతరచోట్ల లభ్య మేమో చూస్తాను, ఇక్కడ లభించనివి మీరు అక్కడి నుంచి కొని తెచ్చుకోమని నా సలహా. ఈ కొత్త డిపార్టుమెంటు త్వరలోనే ఏర్పడాలని ఆకాంక్షిస్తున్నాను. మీ ప్రయోగాలకి కావలసిన పూర్తి అవకాశం, స్వేచ్ఛ మీకు ఇవ్వబడతాయి."

1945లో స్థాపితమైన టీఐఎఫ్ఆర్ ఎనిమిది దశాబ్దాల కాలంలో గొప్ప ప్రతిభావంతులైన శాస్త్రజ్ఞులను రూపొందించింది. గణిత శాస్త్రం, విజ్ఞానశాస్త్రంలోని అన్ని విభాగాలతో పాటు కంప్యూటర్స్, అంతరిక్షం, విజ్ఞానశాస్త్ర బోధన, ప్రజారోగ్య రంగంలో కూడా పరిశోధనలు చేసింది. మనదేశంలో టీఐఎఫ్ఆర్ శాస్త్ర సాంకేతిక ప్రయోగాలకు ఆలంబనగా, అగ్రగామిగా నిలిచింది.



నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ఆఫ్ ఇండియా, (తరువాతి కాలంలో ఇది 'ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ'గా మార్పు చెందింది) 1963లో జరిగిన వార్షిక సమావేశంలో డా. భాభా మాట్లాడుతూ "భారతదేశంలో మనం నాణ్యమైన పరిశోధనా సంస్థలను ప్రభుత్వమే స్థాపించగలదని నమ్ముతాం. ఒక సైంటిఫిక్ సంస్థ, అది ఒక ప్రయోగశాల కావచ్చు లేదా విద్యాసంస్థ కావచ్చు, దానిని మనం చాలా జాగ్రత్తగా ఒక చెట్టుని పెంచినట్లు పెంచాలి. అప్పుడే అది సరైన ఫలాలను (ఫలితాలను) ఇస్తుంది. ఇది అందరూ చేయలేరు. ప్రతిభావంతులకు మాత్రమే ఇదిసాధ్యం. కొన్ని సందర్భాలలో ఫలితాలు సాధించడానికి 10/15 సంవత్సరాలు పైనే పట్టవచ్చు" అంటారు. హోమి జె భాభా నాయకత్వం, ఆయన నిరంతర ప్రయత్నాల ఫలితంగా టీఐఎఫ్ఆర్ శాస్త్ర సాంకేతిక ప్రయోగాలకు ఆలంబనగా, అగ్రగామిగా నిలిచింది. దేశ శాస్త్ర సాంకేతిక వారసత్వానికి టీఐఎఫ్ఆర్ ఒక ప్రతీక. భారతదేశ శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి డా. భాభా, టీఐఎఫ్ఆర్ చేసిన సేవ ఎనలేనిది.


1945లో స్థాపితమైన టీఐఎఫ్ఆర్ ఎనిమిది దశాబ్దాల కాలంలో అత్యంత ప్రతిభావంతులైన శాస్త్రజ్ఞులను రూపొందించింది. గణిత శాస్త్రం, విజ్ఞానశాస్త్రంలోని అన్ని విభాగాలతో పాటు (భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం) కంప్యూటర్స్, అంతరిక్షం, విజ్ఞానశాస్త్ర బోధన క్షేత్రాలతో పాటు ప్రజారోగ్య రంగంలో కూడా పరిశోధనలు చేసింది. ఇందులో సుమారు 550 మంది శాస్త్రవేత్తలున్నారు. 250కి పైగా విద్యావేత్తలు, మిగిలినవారు శాస్త్రవేత్తలు. సుమారుగా 1500 మంది సిబ్బంది వివిధ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటారు. ఈ శాస్త్రజ్ఞులు 1. స్కూల్ ఆఫ్ నాచురల్ సైన్సెస్ (సహజశాస్త్రాల శాఖ), 2. స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ (గణిత శాస్త్ర శాఖ), 3. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ కంప్యూటర్ సైన్సెస్ (సాంకేతికత, కంప్యూటర్ శాస్త్ర శాఖ)లలో తమ కార్యకలాపాలు సాగిస్తుంటారు.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశోధనా కేంద్రాల్లో పరిశోధనా వసతులున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద రేడియో టెలిస్కోప్, 'జైంట్ మీటర్ వేవ్ రేడియో టెలిస్కోప్' నారాయణ్ గాంవ్, పూణేలో పనిచేస్తుంది. కాస్మిక్ రే పరిశోధనాశాల, మరో స్థూపాకార రేడియో టెలిస్కోప్, తమిళనాడులోని ఊటీలో కార్యాచరణలో ఉంది. "హై ఎనర్జీ కాస్మిక్ కిరణాలు, గామా కిరణాల ప్రయోగ శాలలు, మధ్యప్రదేశ్‌లోని పాంచ్‌మర్హిలో పనిచేస్తున్నాయి. హైదరాబాదులో ఉన్న టీఐఎఫ్ఆర్ 'నేషనల్ బెలూన్ ఫెసిలిటీ', ప్రపంచ స్థాయిలో అత్యుత్తమమైంది. ఈ బెలూన్ ఫెసిలిటీకి ఉన్న ఒక అడ్వాంటేజ్ ఏమిటంటే ఇది భూమధ్యరేఖ వద్ద, భూ అయస్కాంత క్షేత్రానికి సమీపంలో ఉండడం. టీఐఎఫ్ఆర్ గురుత్వా కర్షణ, జడత్వ భారం (ఇనెర్షియల్ మాస్) మధ్య భేదాన్ని కనుక్కోవడానికి ఒక అసాధారణమైన, సెన్సిటివ్ బాలన్స్‌ని (తరాజు) కర్ణాటకలోని, గౌరి బిదనూరులో నిర్మించింది. రీసెర్చ్ లాబొరేటరీస్ మాత్రమే కాక టీఐఎఫ్ఆర్‌లో సైంటిఫిక్ ఇన్ఫ ర్మేషన్ రిసోర్స్ సెంటర్‌లో (ఎస్ఐఆర్సీ) 65 వేల పుస్తకాలతో పాటు లక్షకు పైగా పత్రికలు (జర్నల్స్) మైక్రో ఫిలిమ్స్ ఉన్నాయి. ఈ రిసోర్స్ సెంటర్ పూర్తిగా కంప్యూటరైజ్ చేయబడి ఆడియో–వీడియో, సీడీ సౌకర్యాలతో కూడి ఉంటుంది. శక్తివంతమైన సెంట్రల్ కంప్యూటేషనల్ సౌకర్యంతో పాటు పర్సనల్ కంప్యూటర్లతో కూడిన వర్క్ స్టేషన్స్, మానిటరింగ్, డేటా ఫెసిలిటీస్ కలిగి ఉంటుంది.

టీఐఎఫ్ఆర్ చేసిన పరిశోధనల ఆధారంగా కొత్త జాతీయ సంస్థలను ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (C–DAC), సొసైటీ ఫర్ అప్లైడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇంజనీరింగ్ (SAMEER) ఉదాహరణకు కొన్ని. ఈ సంస్థ సైంటిస్టులు, స్కాలర్లతో కూడిన అధ్యాపకులను తయారు చేస్తుంది. మొత్తంగా టీఐఎఫ్ఆర్ ప్రపంచంలోని అత్యుత్తమ పరిశో ధనా కేంద్రాల్లో ఒకటి.

■ పలకంశెట్టి జయప్రకాష్





నేటి నుంచి రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ



- ఉదయం 8-12 వరకు, సాయంత్రం 4-8 గంటల వరకు..
- ఏ రేషన్ షాపులో అయినా తీసుకోవచ్చు

8



యోగాసిటీ



యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకుని, యోగాపై నగరవాసుల్లో అవగాహన పెంచేందుకు అధికార యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఫ్లై ఓవర్లపై యోగాసనాలతో కూడిన బొమ్మలను ఆకర్షణీయంగా తీరిదిద్దారు. బెంజిసర్కిల్ వద్ద పిల్లర్లకు వేసిన యోగా పెయింటింగ్స్ చూడచక్కగా ఆకట్టుకుంటున్నాయి.

మత్తు వదిలిస్తారు

గంజాయి గ్యాంగ్‌లపై ఇక పిట్ ఎన్డీపీఎస్ చట్టం

రాష్ట్రంలోనే తొలిసారిగా ఎన్టీఆర్ కమిషనరేట్‌లో..

- రెండుసార్లు గంజాయితో చిక్కితే ఏడాది జైలు
- ఇప్పటి వరకు ఎనిమిది మందిపై ప్రయోగం
- మరికొంతమందిపై నమోదుకు సిద్ధమవుతున్న జాబితా





నగరంలోని గంజాయి స్మగ్లర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే తాజాగా పిట్ ఎన్డీపీఎస్ చట్టాన్ని తెరపైకి తెచ్చారు. ఈ చట్టం వల్ల గంజాయితో రెండుసార్లు దొరికితే ఏడాది పాటు తప్పక జైల్లోనే ఉండాల్సి ఉంటుంది. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఎన్టీఆర్ కమిషనరేట్‌లో ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గంజాయి వినియోగం తగ్గినా సరఫరా మాత్రం ఆగట్లేదు. దీనికి ఎన్ని విధాలుగా అడ్డుకట్ట వేసినా గ్యాంగ్‌లు మాత్రం ఏదో ఒకలా గంజాయిని తరలిస్తూనే ఉన్నాయి. ఇక్కడి నుంచి ఒడిసా సరిహద్దుల్లోకి వెళ్లి గంజాయిని కొని తీసుకొస్తూనే ఉన్నాయి. ఇలా గంజాయిని తీసుకొస్తున్న వారిని కట్టడి చేయడానికి ఇకపై పిట్ ఎన్డీపీఎస్ చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. ఇప్పటి వరకు పదేపదే గంజాయి కేసుల్లో చిక్కుతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసేవారు. దీంతో ఆరు నెలలపాటు జైల్లో గడిపాక బయటకు వచ్చి మళ్లీ ఒడిసా సరిహద్దుల వైపు అడుగులు వేస్తున్నారు. పీడీ యాక్ట్ నమోదు చేసినా గంజాయి గ్యాంగ్‌ల్లో పరివర్తన రాకపోవడంతో మరింత పదునైన పిట్ ఎన్డీపీఎస్‌ను ప్రయోగించడానికి ఎన్టీఆర్ కమిషనరేట్ పోలీసులు సిద్ధమవుతున్నారు.

20-25 గ్యాంగ్‌ల గుర్తింపు

జిల్లాలో కేవలం గంజాయితో సహవాసం చేస్తున్న వారి జాబితాను పోలీసులు సిద్ధం చేశారు. జిల్లా మొత్తం మీద 20-25 గ్యాంగ్‌లు అదే పనిగా ఒడిసా సరిహద్దులకు వెళ్లి గంజాయిని తీసుకొస్తున్నట్టు గుర్తించారు. గంజాయిని కొనడానికి డబ్బు లేకపోవడంతో ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తున్నారు. గంజాయిని కొత్తగా వ్యసనంగా మార్చుకున్న వారు ఇదే పని చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. ఇలాంటి వారిని కట్టడి చేయడానికి పిట్ ఎన్డీపీఎస్ చట్టాన్ని మిగతా 6లో..

పిట్ ఎన్డీపీఎస్ అంటే..

గంజాయి, మాదకద్రవ్యాలను కట్టడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం 1988లో పిట్ ఎన్డీపీఎస్ చట్టాన్ని రూపొందించింది. సాధారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపైన, పదేపదే చోరీలు చేసే వారిపైన పోలీసులు పీడీ (ప్రివెంటివ్ డిటెన్షన్) యాక్ట్‌ను ఉపయోగిస్తారు. ఒకసారి ఏదైనా నేరంలో జైలుకు వెళ్లిన నిందితులు బయటకు వచ్చాక మళ్లీమళ్లీ అవే నేరాలు చేస్తే దీన్ని ఉపయోగిస్తారు. ఈ చట్టాన్ని ప్రయోగించాలంటే నిందితులపై ఐదారు కేసులు నమోదై ఉండాలి. ఈ కేసుల నమోదుకు మధ్య మూడు, నాలుగు నెలల వ్యవధి ఉండాలి. దీనికి భిన్నంగా ప్రివెన్షన్ ఆఫ్ ఇల్లిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ (పిట్ ఎన్డీపీఎస్) చట్టం ఉంది. డ్రగ్స్, గంజాయితో రెండుసార్లు చిక్కితే చాలు వారిపై పిట్ ఎన్డీపీఎస్‌ను ప్రయోగించవచ్చు. కేసుల నమోదుకు మధ్య ఎలాంటి వ్యవధి ఉండాల్సిన అవసరం లేదు. పోలీసు అధికారులు దీనికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు పంపాల్సి ఉంటుంది. అక్కడ ఆమోదముద్ర పడిన తర్వాత నిందితులను కోర్టులో హాజరుపరుస్తారు. ఒకసారి ఈ చట్టాన్ని ప్రయోగిస్తే ఏడాది జైల్లోనే. రాష్ట్రంలో ఈ చట్టాన్ని ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లోనే మొదటిసారిగా అమలు చేస్తున్నారు.



'బంగారం శ్రీను' కోసం గాలింపు

ఇతర రాష్ట్రాలకు వెళ్లిన పోలీసు బృందాలు

- శ్రీను కుటుంబ సభ్యులపై ఎల్‌వోసీ జారీ
- ఆడియో రాయబారం పంపిన శ్రీనివాసరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బంగారం, నగదు చీటీలు నిర్వహించి కోట్ల రూపాయలకు టోకరా వేసిన ముచ్చెర్ల శ్రీనివాసరావు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయోధ్యనగర్ లోటస్‌కు చెందిన శ్రీనివాసరావుపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఒక ఖాతాదారుడే రూ.కోటి వరకు మోసపోవడంతో ఈ కుంభకోణం ఇంకెంత వరకు వెళ్తుందో తెలియని పరిస్థితి. పోలీసులు ఇప్పటి వరకు 40 మంది బాధితుల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ముచ్చెర్ల శ్రీనివాసరావు కోసం పోలీసులు సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్నారు. లోటస్‌లో ఉన్న శ్రీనివాసరావు భార్యను పోలీసులు విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆయన కుమారుడు నిఖిల్, హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె సాయి అమృత, అల్లుడు అభిలాష్‌పై పోలీసులు లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ) జారీ చేశారు. పోలీసులను ఆశ్రయించిన వారు కాకుండా ఇంకా 60 మంది వరకు బాధితులు ఉన్నట్టు తెలుస్తోంది. శ్రీనివాసరావు బ్యాంక్ ఖాతాలపై పోలీసులు దృష్టిసారించారు. ఆయన ఖాతాల నుంచి లావాదేవీలను నిలుపుదల చేయాలని బ్యాంకులకు లేఖలు మిగతా 6లో..

వైసీపీ వికృత చేష్టలపై పోలీసుల ఆరా

- జోగి కుమారుడి రిసెప్షన్‌లో సైకిల్ ధ్వంసంపై టీడీపీ ఫిర్యాదు
- సెల్‌ఫోన్ వీడియో ఆధారంగా నిందితుల గుర్తింపు

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : మే 29న ఇబ్రహీంపట్నంలో మాజీమంత్రి జోగి రమేశ్ కుమారుడు రాజీవ్-మేఘన రిసెప్షన్ వేడుకలో వైసీపీ నాయకులు చేసిన వికృత చేష్టల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ వేడుకకు వైసీపీ అధినేత జగన్ హాజరు కాగా, జోగి రమేశ్ ఇంటి వద్దకు భారీగా చేరుకున్న ఆ పార్టీ కార్యకర్తలు ఓ బాలుడి వద్ద సైకిల్‌ను లాక్కుని, గిరగిరా తిప్పుతూ, కాళ్లతో, నేలకేసి కొడుతుండగా, కొందరు సెల్‌ఫోన్లలో వీడియో తీశారు. సైకిల్‌ను పాడు చేయకండని.. ఆ పిల్లాడు ఏడుస్తూ బతిమాలినా వినలేదు. వైసీపీ మూకలు చేసిన ఈ వికృత చేష్టలపై ఇబ్రహీంపట్నానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సెల్‌ఫోన్ వీడియో ఆధారంగా సైకిల్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- అధికారులతో సమీక్షలో దుర్గగుడి ఈవో శీనానాయక్

6

రేపటి నుంచి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్ష

- పరీక్షకు హాజరుకానున్న 660 మంది అభ్యర్థులు
- నలందా విద్యానికేతన్‌లో పరీక్ష : డీఆర్‌వో నరసింహం

8

కట్టలేరులో ధ్వంసమైన చెక్‌డ్యామ్‌లు



చెక్‌డ్యామ్‌లు కట్టలేరా?

కట్టలేరుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ఎన్నటికో?

- 2019లోనే ప్రతిపాదనలు పంపినా పట్టించుకోరు
- పాత చెక్‌డ్యామ్‌లన్నీ ధ్వంసం.. వృథాగా పోతున్న నీరు
- ఏరులోని ఇసుకను తరలించేస్తున్న అక్రమార్కులు

తిరువూరు, సమీప గ్రామాల తాగు, సాగునీరుకు కీలకమైన కట్టలేరుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం కలగానే మారింది. పాత చెక్‌డ్యామ్‌లు ధ్వంసం కావడంతో కొత్తవాటి నిర్మాణానికి 2019లోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, ఇప్పటివరకు అతీగతీ లేదు. మరోవైపు కట్టలేరులోని ఇసుకను అక్రమార్కులు దోచుకెళ్తుండటంతో ఈ ఏరు పరిసరాలు ఇసుక లేక పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.

(ఆంధ్రజ్యోతి, తిరువూరు) : తిరువూరు పట్టణానికి సమీపంలోని ఖమ్మం జిల్లా నీలాద్రి గట్టు నుంచి ప్రవహించే నీరు లంకాసాగర్ డ్యామ్‌కు చేరి, అక్కడి నుంచి కట్టలేరు వాగుగా రూపాంతరం చెందుతుంది. తిరువూరు మీదుగా సుమారు 64 కిలోమీటర్ల మేర ప్రవహించే వాగు వీరులపాడు మండలం పల్లెంపల్లి, నందిగామ మండలం కూడలి వద్ద వైరా ఏరులో కలుస్తుంది. ఈ వాగు పరిసర ప్రాంతాల్లోని గ్రామాలకు తాగు, సాగునీరు సంవృద్ధిగా లభించేది. ప్రస్తుతం ఈ వాగులో గతంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు ధ్వంసం కావడంతో నీరు వృథాగా పోతోంది. ఫలితంగా సరిహద్దు గ్రామాలకు మిగతా 6లో..

విజయవాడ పశ్చిమ బైపాస్

మరింత ఆలస్యం

మోర్తు నుంచి స్పష్టత రాకపోవడం వల్లే..

- ల్యాంకో అలైన్‌మెంట్ మార్పు అయితే లేదు
- ఎత్తు పెంపు విషయంలో తర్జనభర్జన
- కోర్టు కేసులు కొలిక్కి వచ్చాకే నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ పశ్చిమ బైపాస్ ప్రారంభం కావటానికి మరింత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ లైన్లకు సంబంధించి ఏం చేయాలన్న దానిపై కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్, టాన్స్‌పోర్ట్స్, హైవే.. మోర్తు) చైర్మన్ నుంచి స్పష్టత రాకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రధాని నరేంద్రమోదీ అమరావతి పర్యటన సందర్భంలో మోర్తు చైర్మన్ పశ్చిమ బైపాస్‌ను పరిశీలించారు. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్స్ లైన్‌కు సంబంధించి ఉన్న సమస్య గురించి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి మోర్తు ఇచ్చే డైరెక్షన్ ప్రకారం ఎన్‌హెచ్ అధికారులు ముందుకెళ్లాలి. అయితే, మోర్తు నుంచి ఇంకా స్పష్టత రాలేదు.



చిక్కుముడి వీడేనా?

ల్యాంకోలైన్ చిక్కుముడి అంశంపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వాలన్న దానిపై మోర్తు ఓ నిర్ణయానికి రాలేకపోతోందని తెలుస్తోంది. ల్యాంకో లైన్‌కు సంబంధించి అనేక వివాదాలు ఉండటమే ఇందుకు కారణం. హైకోర్టుతో పాటు ఎన్‌సీఎల్‌టీలో అనేక కేసులు నడుస్తున్నాయి. ల్యాంకోలైన్ అలైన్‌మెంట్‌ను మార్చే విషయంలో కొండపల్లిలోని ల్యాంకో పవర్ ప్రాజెక్టు రన్నింగ్‌లో ఉన్నప్పుడు ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత ల్యాంకో మూతపడింది. మూతపడిన క్రమంలో తలెత్తిన పరిణామాలు తెలిసిందే. ఈ అంశంపై కేంద్రానికి ఫిర్యాదులు అందటంతో చిక్కుముడిని ఎలా పరిష్కరించాలన్న అంశాన్ని మోర్తు తేల్చుకోలేకపోతోంది. న్యాయస్థానాలు, ఎన్‌సీఎల్‌టీలలో నడుస్తున్న కేసులను దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు మోర్తు కూడా ఆలోచనలో పడింది. గతంలో ల్యాంకో మిగతా 6లో..



డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం మెట్రోదే..

నిడమానూరు-రామవరప్పాడు వరకు..

- రామవరప్పాడు-మహానాడు బాధ్యతలు ఎన్‌హెచ్‌కు..
- ఏపీఎంఆర్‌సీ-ఎన్‌హెచ్ మధ్య కుదిరిన ఒప్పందం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నిడమానూరు నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు వరకు నిర్మించే డబుల్ డెక్కర్ నిర్మాణంపై ఓ స్పష్టత వచ్చింది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఏపీ మిగతా 6లో..



పెన్షన్ పంపిణీ

జిల్లావ్యాప్తంగా శనివారమే పెన్షన్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధానచంద్ర, ఇతర అధికారులు నగరంలో పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓ వృద్ధురాలి బరిస్ తీసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

8



ప్రమాణ స్వీకారోత్సవం

ఏపీఎన్జీజీవో అధ్యక్షుడిగా విద్యాసాగర్ శనివారం ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు సుమారు 500 బైకులు, వందకు పైగా కార్లు, వేలాది మంది ఉద్యోగులతో గాంధీనగర్‌లోని ఎన్జీజీవో హోమ్ నుంచి బందరు రోడ్డులోని శేషసాయి కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు.

6

కనకదుర్గమ్మ సేవలో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి


జయలక్ష్మికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, మే 31 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను శనివారం రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో వి.కె.శీనానాయక్ ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం వారికి అందజేశారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● అధికారులతో సమీక్షలో ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, మే 31 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, పార్కింగ్ సమస్య పరిష్కారం, టోల్‌గేట్ నుంచి రథం సెంటర్ వరకు ఆక్రమణ విషయమై తగు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం శనివారం దేవస్థాన మహామండపం నాల్గో అంతస్థులో ఈవో వి.కె.శీనానాయక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవో శీనానాయక్ భక్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు వివరించారు. టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సమస్య, దుర్గాఘాట్ ముందు, విజయేశ్వరస్వామి ఆలయం నుంచి రథం సెంటర్ వరకు ఆక్రమణలు వలన కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆషాడ మాసం సారె సమర్పణకు, శాకంబరీ ఉత్సవాలు, శ్రావణ మాసంలో భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం ఏర్పాటు చేయడానికి సహకరించాలని కోరారు. వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురు ప్రకాష్, ట్రాఫిక్ సీఐ, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

డీజీపీకి సీపీ శుభాకాంక్షలు


హరీష్‌కుమార్ గుప్తాకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీ రాజశేఖర్‌బాబు

గుణదల, మే 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డీజీపీగా పూర్తి బాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తాను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హరీష్‌కుమార్ గుప్తాకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో పనిచేస్తామని డీజీపీకి ఈ సందర్భంగా సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలియజేశారు. డీజీపీని కలిసిన వారిలో డీసీపీలు కె.జి.సరిత, తిరుమలేశ్వర రెడ్డి, కె.ఎం.మహేశ్వరరాజు తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేసిన అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

ఏపీఎంఈఎస్ వేతన స్కేల్ నుంచి విముక్తి కల్పించాలి : ప్రభుత్వ వైద్యుల వినతి

ప్రభుత్వాసుపత్రి, మే 31 (ఆంధ్రజ్యోతి) : వైద్య అధ్యాపకుల వేతనాలను గతంలో వలే యూజీసీ వేతనాలు గానే కొనసాగించాలని, బలవంతంగా రుద్దిన ఏపీఎంఈఎస్ వేతన స్కేలు నుంచి తమకు విముక్తి కలిగించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ప్రభుత్వ వైద్యుల సంఘం (జీడీఏఏపీ) ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ వివి.నారాయణరావు కలిసి విన్నవించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐ.బాబ్జిశ్యామ్ కుమార్ శనివారం తెలిపారు. సచివాలయంలోని చాంబర్‌లో మంత్రి సత్యకుమార్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చినట్లు తెలిపారు. స్వరూప్ కాంత్, డాక్టర్ మహేష్, భాను కుమార్, యాదవ్, రాజా మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

ఉద్యోగుల వెన్నంటి ఉంటా

- పదవిని బరువుగా చూడను..బాధ్యతగా నిర్వహిస్తా
- సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తా
- ఉద్యోగులు ఆకాంక్షలకు అనుగుణంగా కార్యాచరణ
- హక్కుల సాధనకు అవసరమైతే ఆందోళన బాట
- ఏపీ ఎన్జీజీవో అధ్యక్షుడు విద్యాసాగర్ హామీ


ఏపీ ఎన్జీజీవో అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న విద్యాసాగర్, గజమాలతో సత్కరిస్తున్న సంఘం నాయకులు

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వారిని వెన్నంటే ఉంటానని ఏపీ ఏపీఎన్జీజీవో అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ అన్నారు. విజయవాడలోని శేషసాయి కల్యాణ మండపంలో ఏపీఎన్జీవో అధ్యక్షుడిగా శనివారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. విద్యా సాగర్ మాట్లాడుతూ, గత 32 సంవత్సరాలుగా ఏపీ ఎన్జీజీవో సంఘంలో ఉద్యోగుల ఆదరాభిమానాలతో ఎన్నో పదవులు నిర్వహించానన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా తన కార్యాచరణ ఉంటుందన్నారు. పదవిని బరువుగా కాకుండా బాధ్యతగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వంతో సామరస్యపూర్వకంగా చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు హక్కుగా పొందాల్సిన వాటి కోసం అవసరమైతే ఆందోళన బాట పడతానని హామీ ఇచ్చారు. తనకంటే ముందు ఈ పదవిని నిర్వర్తించిన నాయకుల పని తీరు గుర్తుపెట్టుకుని మరింత బాధ్యతతో ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. దేశంలోని ఉద్యోగ సంఘాలలో ఏపీ ఎన్జీజీవో సంఘానికి ఉన్న పేరు ప్రతిష్ఠలను పెంచుతానన్నారు. ఇప్పటి వరకు అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వంతో చర్చించి సానుకూల ఫలితాలను అందిస్తానన్నారు.

విద్యాసాగర్‌కు ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె, ఎమ్మెల్సీ ఆలపాటి అభినందనలు

ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని నూతన నాయకత్వానికి అభినందనలు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల కోసం పెట్టిన తొలి సంఘం ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ అని, 74 సంవత్సరాల చరిత్ర, అనుభవం, 205 తాలూకా యూనిట్లు ఏపీ ఎన్జీజీవో సాధించిన ఘనత అన్నారు. సంఘం అంటే డిమండ్ మాత్రమే కాదని, సంఘం అంటే భావజాలం కూడా ఉంటుందని నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మాజీ అధ్యక్షుడు శ్రీరాములు వంటి వారు తమకి ఆదర్శమన్నారు. ఆర్థిక, ఆర్థికేతర ఫలితాలను పొందేలా తన పనితీరు ఉంటుందన్నారు. గడిచిన ప్రభుత్వంలో ఉద్యోగులు ఎవరూ కూడా స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితి లేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత ఉద్యోగులు గొంతెత్తి తమ హక్కుల కోసం నినదిస్తున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగు లు ఎదుర్కొన్న ఎన్నో ఇబ్బందులను ప్రతి ఉద్యోగి గుర్తు పెట్టుకోవాలన్నారు. ఉద్యోగులకు దక్కాల్సిన ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పోరాట మార్గాన్ని వదలబోనని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన రూ.6700 కోట్ల బకాయిలను చెల్లించిందన్నారు. రాష్ట్ర నాయకత్వం ఇంతటితో సంతృప్తిపడే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు ప్రతినెలా నిర్ణీత సమయంలో జీతాలు వస్తున్నాయన్నది ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రభుత్వం ఏదైనా డిమాండ్ల సాధన మాత్రమే ఉద్యోగ సంఘ నాయకుల లక్ష్యం కావాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలలో కనీసం ఒక్కటైనా అతి త్వరలో సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో పీఆర్‌సీ కమిషన్ నియామకం సత్వరమే ఏర్పా టు చేయాలన్నారు. ఉద్యోగుల డిమాండ్ల మేరకు ప్రభుత్వం వేగంగా స్పందించాలని డిమాండ్ చేశారు. పూర్వ అధ్యక్షుడు కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం లో ఎంతో పేరు ప్రతిష్ఠలు కలిగిన ఏపీ ఎన్జీజీవో సంఘానికి విద్యాసాగర్ వంటి నాయకుల అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి రావలసిన ప్రతి ప్రయోజనాన్ని ఉద్యోగులకు విద్యాసాగర్ అందించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

భారీ ర్యాలీ

ప్రమాణస్వీకారానికి ముందు సుమారు 500 బైక్‌లు, వందకు పైగా కార్లతో గాంధీనగర్‌లోని ఎన్జీజీవో హోమ్ నుంచి బందరు రోడ్డులో ఉన్న శేషసాయి కల్యాణ మండపం వరకు వేలాది మంది ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ప్రభుత్వ ఉద్యోగుల ఉత్సాహం, కేరింతలు, బాణసంచా కాల్పుల మధ్య ప్రమాణ స్వీకార కార్యక్రమానికి చేరుకున్నారు. తనపై ఇంత ఆదరణ చూపుతున్నందుకు ప్రతి ఒక్కరికీ విద్యాసాగర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి అశోక్‌బాబు, జి.పూర్ణచంద్రరావు, మాజీ నాయకులు రాధాకృష్ణమూర్తి, పూర్ణచంద్రరావు, చంద్రశేఖర్, రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెం దిన కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్షులు, ఐదు వేల మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.


ప్రజాదర్బార్‌లో మంత్రి కొల్లు రవీంద్రకు వినతి పత్రం ఇస్తున్న ఆటోవర్కర్ల సంఘం నాయకులు

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలకు సత్వర పరిష్కరం చూపుతామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్‌లో మంత్రి రవీంద్ర పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 96 మంది నుంచి వినతులు స్వీకరించారు. ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎక్కువ మంది వినతిపత్రాలు అందజేశారు. ఆటో నగర్ సమస్యలను పరిష్కరించాలంటూ ఆటోనగర్ సంక్షేమ సంఘం నాయకులు శ్రీరామ వెంకట దుర్గాప్రసాద్, కొప్పినేని రాఘవులు, సురేంద్రప్రసాద్ విజ్ఞాపన అందజేశారు. ఆటోనగర్‌లో తాగునీరు, రోడ్లు , డ్రైనేజీ మెరుగు పరచాలని కోరారు. భారీ వర్షం కురిస్తే రోడ్లు ముంపునకు గురవుతున్నాయన్నారు. దివ్యాంగురాలై తన కుమార్తె త్రివేణిని ఆదుకోవాలని శారదానగర్ నుంచి వచ్చిన మహిళ కోరారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ప్రజాదర్బార్‌లో వచ్చే అర్జీలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. జూన్ 12వ తేదీ నుంచి 95 వేల మందికి కొత్త పింఛన్లు అందిస్తామన్నారు. రేషన్ కార్డులను సరిచేసి ఇస్తున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు జూన్ 1వ తేదీ నుంచి చౌక డిపోల్లోనే రేషన్ పంపిణీ చేస్తామన్నారు. తమకు వీలయినప్పుడు వెళ్లి రేషన్ తీసుకోవచ్చన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తామన్నారు. సూర్యఘర్ పథకం కింద సబ్సిడీపై విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవలు కింద మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికి రూ.1.90 కోట్లు సీఎం సాయం అందించామన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, బోయిన రాజు, కరెడ్ల సుశీల, బత్తిన దాసు, తలారి సోమశేఖర్, యువరాజ్, మచిలీపట్నం నగర టీడీపీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ వల్ల ఏమీ జరగదు

● మాజీ మంత్రి పేర్ని నాని ● వైసీపీ ఇన్‌చార్జి వంశీనే



గన్నవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌బుక్‌ను మడిచిపెట్టుకోండి. దాని వల్ల ఏమీ జరగదు. మహా అయితే నాలుగు రోజులు జైలులో పెడతారు.. అంతేగా అని వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. గన్నవరం వైసీపీ కార్యాలయంలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో పేర్ని నాని మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మీద తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు మానవత్వాన్ని మరిచి వంశీ ఆరోగ్యాన్ని క్షీణింప జేసి ఏదో రకంగా అనారోగ్యంతో మరణించాలనే దుర్బుద్ధితో చేస్తున్నాయని ఆరోపించారు. వంశీ వాంతులు చేసుకుని స్పృహ లేకుండా పడిపోతుంటే, అంతా బాగుందని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యు లు తప్పుడు రిపోర్టులు ఇచ్చారని ఆరోపించారు. భర్తని కాపాడుకునే పనిలో వంశీ భార్య పంకజశ్రీ ఉన్నారన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంశీనేనని, 2029లో ఆయనే పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుస్తారని అన్నారు. జూన్ 4వ తారీఖున జరగనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో ఎక్కువ మంది పాల్గొనాల్సిందిగా కోరారు. మాజీ ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్, నాయకులు పేర్ని కృష్ణమూర్తి, సీలం ప్రవీణ్‌కుమార్, శీలం రంగారావు, జడ్పీటీసీ సభ్యురాలు ఏఈ రాణి పాల్గొన్నారు.

నమూనా డీఎస్సీ నేడు : పీఆర్‌టీయూ

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని హోటల్ మురళిఫార్చ్యూన్ దగ్గర గల ప్రతిభానికేతన్‌లో ఆదివారం డీఎస్సీ నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు పీఆర్‌టీయు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్, కార్యదర్శి కొనకళ్ల రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతందని తెలిపారు. నమూనా పరీక్ష రాసే అభ్యర్థులందరూ ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రతిభ కోచింగ్ సెంటర్ సహకారంతో ఈ పరీక్షా ఫలితాలను వెంటనే ప్రకటించి విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

క్లబ్‌లలో ఎక్కడా పేకాట జరగడం లేదు : ఏసీపీ

నందిగామ, మే 31 (ఆంధ్రజ్యోతి) : నందిగామ, కంచికచర్ల పట్టణాలలోని పలు రిక్రియేషన్ క్లబ్‌లలో పేకాట నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన కథనానికి పోలీసు లు స్పందించారు. శనివారం ఏసీపీ ఏబీజీ తిలక్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ, పలు క్లబ్‌లలో విస్తృత తనిఖీలు నిర్వహించామని, ఎక్కడా పేకాట జరడం లేదని స్పష్టం చేశారు. ఇకపై పూర్తి నిఘా ఉంచుతామని, ఎవరైనా పేకాట నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, నందిగామలోని ఒక క్లబ్‌కు ఇటీవల చైర్మన్‌గా ఎన్నికైన చెన్నుపాటి సాంబశివ రావు ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. గతంలో తమ క్లబ్‌లలో పేకాట ఆడిన మాట వాస్తవమేని, ప్రస్తుతం జరగడం లేదని స్పష్టం చేశారు. తాము పోలీసుల అనుమ తితో తప్ప పేకాట ఆడించమన్నారు. 13 ము క్కల ఆట ఆడడం నేరం కాదని, కావా లంటే తమ వద్ద అందుకు సంబంధించిన చట్టాల ప్రతులు ఉన్నాయని చెప్పారు.

కంచికచర్ల క్లబ్‌లోనూ లేదు..

కంచికచర్ల రూరల్ : కంచికచర్ల క్లబ్‌లో పేకాట ఆడటం లేదని క్లబ్ అధ్యక్షుడు కోయ రాజా, కోశాధికారి దమ్మాలపాటి కోటిబాబు తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలించి పేకాట నిర్వహిస్తున్నట్లు రుజువయితే చర్యలు తీసుకోవచ్చన్నారు


యర్ర వెంకట బాబ్జీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి

● ప్రముఖుల నివాళి

చల్లపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఊటీ విహారయాత్రకు వెళ్లి హైదరాబాద్ తిరిగి వెళుతూ తెలంగాణలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన తల్లీ కుమార్తెలు యర్ర శ్రావణి (35), సాయి చైత్ర (7)భౌతికకాయాలకు చల్లపల్లిలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. చేనేత రంగ ప్రముఖులు యర్ర కోటమల్లయ్య మనుమడు యర్ర వెంకట బాబ్జీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తుండగా, కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో భార్య, చిన్న కుమార్తె అక్కడికక్కడే మ రణించగా, పెద్దకుమార్తె హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శవ పరీక్ష అనంతరం భౌతికకాయాలను స్వగ్రామం చల్లపల్లి తీసుకురాగా, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నివాళుల అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. చేనేత కుటుంబీకులు, బంధుమిత్రులు పెద్దఎత్తున భౌతికకాయాలను సందర్శించి నివాళులు అర్పించి బాబ్జీని పరామర్శించారు. ప్రమాద ఘటన బాధాకరమని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. భౌతికకాయాలను సందర్శించి నివాళులు అర్పించారు. భార్య, చిన్నకుమార్తెను కోల్పోయిన బాబ్జీని పరామర్శించి ఓదార్చారు. పెద్దకుమార్తె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గుండె నిబ్బరం చేసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట వైసీపీ నేతలు శీరం వెంకట సత్యనారాయణ, వెనిగళ్ల తారక జగదీష్, యడ్ల జగదీష్ తదితరులు ఉన్నారు. ఎంపీపీ కోట విజయరాధిక, పెద్దలు ఆకుల స్వభూప్రసాద్, టీడీపీ నేతలు రావి చిట్టి, రావి రాజేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం మెట్రోదే..

(5వ పేజీ తరువాయి)

మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) మాత్రమే నిర్మించనుంది. ఈ మేరకు ఎన్‌హెచ్, ఏపీఎంఆర్‌సీ మధ్య అవగాహన కుదిరింది. కాగా, రామవరప్పాడు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు సాధారణ ఫ్లై ఓవర్‌ను ఎన్‌హెచ్ నిర్మిస్తుంది.

ఇప్పటికి స్పష్టత

నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు రూ.600 కోట్లతో 7 కిలోమీటర్ల ఆరు వరసల ఫ్లై ఓవర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఏడాది కావస్తోంది. డీపీఆర్ కారణంగా జాప్యం జరిగింది. డీపీఆర్ వచ్చాక దీనికి టెండర్లు పిలుస్తారనుకున్న దశలో ఇదే అలైన్‌మెంట్‌లో మెట్రోలైన్ కూడా వస్తుండటంతో ఇబ్బందిగా మారింది. దీంతో ఏపీఎంఆర్‌సీ, ఎన్‌హెచ్ అధికారులు భేటీ కావాల్సి వచ్చింది. ఈ సమస్యను పరిష్కరించటానికి వీలుగా డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ చేపట్టాలన్న ఆలోచన వచ్చింది. కింద రోడ్డు, పైన మొదటి ఫ్లై ఓవర్ మీద వాహనాలు, ఆ పైన మెట్రో ఎలివేటెడ్ కారిడార్ వస్తుంది. ఈ డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు సంబంధించి అంచనాలను ఏపీఎంఆర్‌సీ రూపొందించింది. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు 4.2 కిలోమీటర్ల మేర రూ.1,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి ప్రతిపాదనలను మోర్తుకు పంపించారు. మోర్తు నుంచి గ్రీన్‌సిగ్నల్ రావటమే ఆలస్యం. అయితే, డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ఎవరు చేపడతారన్న అంశంపై ఇప్పటికి స్పష్టత వచ్చింది. సింగిల్ ఫ్లై ఓవర్‌కు అయ్యే ఖర్చును ఎన్‌హెచ్ భరిస్తుంది. మెట్రో ఎలివేటెడ్ కారిడార్, డబుల్ డెక్కర్ పిల్లర్ల కోసం అయ్యే ఖర్చును ఏపీఎంఆర్‌సీ భరిస్తుంది. రామవరప్పాడు నుంచి మహానాడు వరకు అయ్యే సాధారణ ఫ్లై ఓవర్ ఖర్చును ఎన్‌హెచ్ భరిస్తుంది.

'బంగారం శ్రీను' కోసం గాలింపు

(5వ పేజీ తరువాయి)

రాశారు. శ్రీనివాసరావు ఇతర రాష్ట్రాలకు పారిపోయినట్టు అనుమానిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఆయా రాష్ట్రాలకు వెళ్లాయి. ఇన్ని రోజులూ అజ్ఞాతంలో ఉన్న శ్రీనివాసరావు శనివారం ఖాతాదారులకు ఆడియో రాయబారం పంపాడు. రెండు రోజుల్లో వచ్చి బకాయిలను సెటిల్ చేస్తానని వాయిస్ మెసేజ్ పంపాడు. విజయవాడలో ఓ మాజీమంత్రికి ముఖ్య అనుచరుడిగా ఉన్న విషయం బయటకు రావడంతో తన వ్యాపారంలో భాగస్వాములు ఎవరూ లేరన్న సందేశాన్ని బయటకు తీసుకొచ్చాడు. ఏడీసీపీ జి.రామకృష్ణ శనివారం రాత్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. దర్యాప్తు ఎంతవరకు వచ్చిందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

రెండు రోజుల్లో వస్తా.. : ముచ్చెర్ల శ్రీనివాసరావు

నేను వ్యాపారం రీత్యా బంగారు, నగదు చీటీలు రెండేళ్లుగా నడుపుతున్నాను. త్వరలో వచ్చి ఖాతాదారులకు బకాయిలు సెటిల్ చేస్తా. ఎవరూ అన్యథ భావించవద్దు. దొరికితే కొడతారు, చంపుతారని ఊరి వదిలిపెట్టి వెళ్లాను. నాకు చెల్లింపులు చేసే ఉద్దేశం ఉంది కాబట్టి కుటుంబ సభ్యులను, బంగారాన్ని ఇంట్లో పెట్టాను. సీసీ కెమెరాలు పరిశీలించినా ఈ విషయం తెలుస్తుంది. ధరించిన దుస్తులతోనే నేను వెళ్లాను. తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఎవరెవరికి ఎంతెంత బకాయి ఉన్నానో నా ఫోన్‌లో వివరాలు ఉన్నాయి. రెండు రోజుల్లో వచ్చి నా వద్ద ఉన్నదంతా పంచుకోమని మీ ముందు పెడతాను. మీకు నచ్చిన పెద్దమనుషుల వద్ద కూర్చుని సెటిల్ చేస్తాను. ఈ వ్యాపారంలో ఎలాంటి భాగస్వాములు లేరు. వ్యాపారం మొత్తం నేను ఒకడినే చేస్తున్నాను. బంగారం చీటీల్లో కొంతమందికి చెల్లింపులు చేశాను. దీనికి సంబంధించిన వాట్సాప్ చాట్ వారి వద్ద, నా వద్ద ఉంది. నా ఫోన్‌ను ఇంట్లోనే వదిలేశాను. మీరు చెక్ చేసుకోవచ్చు. ఈ విషయాన్ని గమనించండి. ఎవరినీ ఇరికించి బద్నాం చేయాల్సిన అవసరం లేదు. అందరికి శిరస్సు వచ్చి పాదాభివందనం చేస్తున్నా. అప్పులు చేసిన మాట వాస్తవం. సెటిల్ చేసే ఉద్దేశం లేకపోతే వస్తువులు, భార్యను తీసుకుని వెళ్లిపోయేవాడ్ని. నేను వెళ్తున్నప్పుడు నా భార్యకు చెప్పలేదు.

భార్యాభర్తలపై దుండగుల దాడి

మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో శనివారం తెల్లవారుజామున భార్యాభర్తలపై దుండగులు దాడి చేశారు.

కాలేఖాన్‌పేటలోని శివగంగ గుడి సమీపం లో నివసిస్తున్న సాయిప్రసాద్, అతని భార్య ఉషారాణిలపై ముసుగులతో వచ్చిన దుండగులు కర్రలు, ఇనుపరాడ్‌లతో దాడి చేయడంతో వారు స్పృహ కోల్పోయారు. పక్కింటి వారు మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పగా, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సాయిప్రసాద్ పాలు అమ్ముతూ ఉంటాడు. వడ్డీ వ్యాపారం కూడా చేస్తుంటాడు. దాడి చేసిన వారెవరో తెలియరాలేదు. సీసీ టీవీ ఫుటేజ్‌లను ఎస్పై ఎస్‌ఐ సత్యనారాయణ పరిశీలిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ రాజా, ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌డ్యామ్‌లు కట్టలేరా?

(5వ పేజీ తరువాయి)

తాగునీరు సక్రమంగా అందని దుస్థితి ఏర్పడింది.

ప్రతిపాదనలకే పరిమితం అవుతున్న చెక్‌డ్యామ్‌లు

కోకిలంపాడు వద్ద కట్టలేరు వాగుపై గతంలో బెడ్‌డ్యామ్ నిర్మించారు. ఈ డ్యామ్ నుంచి సప్లయి చానల్ నిర్మించారు. ఈ కాల్వ ద్వారా కోకిలంపాడు సాగుభూములు, లక్ష్మీపురం, ఆంజనేయపురం, చిట్యాలకు చెందిన భూములతో పాటు చెరువులకు నీరు చేరుతుంది. చిట్యాల బ్రిడ్జి సమీపంలో బెడ్‌డ్యామ్ నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు 2017-18లో సుమారు రూ.4.88 కోట్ల అంచనాతో బెడ్‌డ్యామ్ నిర్మాణం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఈ బెడ్‌డ్యామ్ నిర్మాణం వల్ల చిట్యాల, జగన్నాథపురం చెరువుకు సాగునీరు చెరడంతో సుమారు 400 ఎకరాలతో పాటు డ్యామ్ ఎగువబాగంలో సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందుతుందనే అంచనా వేశారు. చిట్యాల బ్రిడ్జి వద్ద బెడ్‌డ్యామ్ నిర్మిస్తే అక్కడ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పాతతిరువూరు, సూరవరం, రోలుపడి ప్రాంతాల్లోని భూములకు సాగునీరు అందించే ప్రతిపాదన సైతం తెరపైకి వచ్చింది. వాగుపై చిట్యాల, కనుమూరు, వినగడప వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాగా, కట్టలేరు వాగు అక్రమార్కుల చెరలో చిక్కింది. ప్రస్తుతం మండల పరిధిలోని వాగులో ఎక్కడ ఇసుక కనిపించని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.

చెక్‌డ్యామ్‌లు నిర్మించండి

కట్టలేరు వాగులో ఇసుక అక్రమ తోలకాలు నిరోధించాలని, వాగులో అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించడం వల్ల గ్రామాలకు తాగునీటితో పాటు సాగుభూములకు నీటి ఎద్దడి లేకుండా నివారించవచ్చని, ప్రభుత్వ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు

తిరువూరు నుంచి గంపలగూడెం వరకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి 2019లోనే ప్రతిపాదనలు పంపాం. రూ.18 కోట్లతో కట్టలేరుపై చిట్యాల, చింతలపాడు, గానుగపాడు, గంపలగూడెం మండలం వినగడప, కనుమూరు, అనుముల్లంక వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, పడమటి వాగుపై ఒక చెక్‌డ్యామ్ నిర్మాణానికి పంపిన ప్రతిపాదనలకు అనుమతి రాలేదు.

\- కిషోర్, ఏఈ-ఇరిగేషన్, తిరువూరు

మత్తు వదిలిస్తారు

(5వ పేజీ తరువాయి)

ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే నగరంలో కరుడుగట్టిన గంజాయి స్మగ్లర్లుగా ఉన్న ఏడెనిమిది మందిపై ఈ చట్టాన్ని ప్రయోగించారు. వారంతా ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్నారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఇటీవలే అద్దంకి రమేశ్ అనే గంజాయి స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి గంజాయి కోసం దొంగిలించిన 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, నగరానికి చెందిన రమేశ్ గంజాయి కోసం మకాం మార్చాడు. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఒక మహిళతో సహజీవనం చేస్తున్నట్టు సమాచారం తెలుసుకుని సంకెళ్లు వేశారు. ఏలేశ్వరం, సీలేరు, డొంకరాయి ప్రాంతాలకు సెంటర్ పాయింట్‌గా ఉండటంతో ఈ ప్రాంతంలో స్థావరం ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడి నుంచి గంజాయిని తీసుకొచ్చి, ఇక్కడి అనుచరులకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నాడని సమాచారం రావడంతో పిట్ ఎన్డీపీఎస్ ప్రయోగించారు. గంజాయి వాసన రాకుండా చేయాలంటే కొనుగోలు చేసిన వారిపైనే కాకుండా, అందుకు సహకరిస్తున్న, విక్రయించిన వారిపైనా ఈ చట్టాన్ని ప్రయోగించాలని నిర్ణయించారు. పిట్ ఎన్డీపీఎస్ ప్రయోగించాల్సిన వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు.

బాలికకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరామర్శ

మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో లైంగిక వేధింపులకు గురైన బాలికను, కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఫోనులో పరామర్శించారు. బాధిత బాలికతో వీడియోకాల్‌లో మాట్లాడి శైలజ ధైర్యం నిం పారు. ఎస్పీతో మాట్లాడి నిందితులకు శిక్షపడేలా చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

పశ్చిమ బైపాస్ మరింత ఆలస్యం

(5వ పేజీ తరువాయి)

యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందం, అది మూతపడిన తర్వాత రాధ వాసవితో ఎలా ముడిపడిందన్నది కీలకంగా మారుతోంది. ల్యాంకో లేకపోతే.. దానిని ఆధీనంలోకి తీసుకున్న లిక్విడేటర్‌తో కాకుండా రాధాతో సంప్రదింపుల వ్యవహారం నడపటం వల్లే రైతుల వివాదం తలెత్తింది. ల్యాంకోలైన్ విద్యుత్ అంతరాయం కోసం గతంలో రాధా సంస్థకు ఎన్‌హెచ్ అధికారులు లేఖ రాయడంతో ఆ సంస్థ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంది. తనది కాని లైన్‌కు సంబంధించి రాధా సంస్థ ఏకంగా హైకోర్టుకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన రైతులతో నిర్వహించిన సమావేశంలో ఈ వివాదాన్ని పక్కనపెట్టి అలైన్‌మెంట్‌ను రైతుల పొలాల మీదుగా కాకుండా, ఇప్పుడున్న ప్రాంతంలోనే టవర్ల ఎత్తు పెంపుదలకు సంబంధించిన నిర్ణయం జరిగింది. తమకు అభ్యంతరం లేదని, సహకరిస్తామని రైతులు కూడా చెప్పారు. జిల్లా యంత్రాంగం స్థాయిలో ఓ అంగీకారం కుదిరినప్పటికీ మోర్తు స్థాయిలో ఇంకా స్పష్టత రాలేదు. అలైన్‌మెంట్‌ను మార్చే ఉద్దేశం మోర్తుకు లేదని తెలుస్తోంది. టవర్ల ఎత్తును పెంచాలా? టవర్ల వైర్లను తొలగించాలా? అనే ఆలోచన కూడా చేస్తున్నట్టు తెలుస్తోంది. టవర్ల లైన్లను బ్రేక్ చేస్తే కనుక రాధా సంస్థతో సమస్య వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఆ సంస్థ ఈ లైన్‌కు సంబంధించి స్టే తెచ్చుకుంది. కోర్టు ఆదేశాలకు విరుద్ధం గా వెళ్లినట్టే అవుతుంది. రాధా తనది అని వాదిస్తున్న వైర్లను కాకుండా కింది వైర్లను బ్రేక్ చేస్తే.. విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు పనులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. హైటెన్షన్ టవర్‌లో మూడు లేయ ర్లుగా విద్యుత్ లైన్లు ఉంటాయి. కింది వరసలోని లైన్లను తొలగించినా, ఇప్పుడున్న టవర్ల ఎత్తు పెంచకపోయినా సరిపోతుందని తెలుస్తోంది. ఇలాంటపుడు సమస్యను తేలిగ్గా పరిష్కరించే అవకాశాలు ఉన్నాయి. ఏది మంచి విధానం అనే దానిపై మోర్తు అంచనాకు రాలేకపోతోంది. దీని వల్ల పశ్చిమ బైపాస్ అందుబాటులోకి రావటానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.

పింఛన్ల పంపిణీ

పటమట, మే 31 (ఆంధ్రజ్యోతి): 12వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శాయన సత్యనారాయణ (బుజ్జి) ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించారు. అర్హులైన వారందరికీ పథకాలు అందుతాయన్నారు. కొండవీటి ప్రసాద్, బాలు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



'నేను పొగాకు వ్యతిరేకిని' సంతకాల సేకరణ



పీవీపీ మాల్‌లో నో టొబాకో డే పోస్టర్ ఆవిష్కరిస్తున్న నవజీవన్ బాలభవన్ సిబ్బంది



బెజవాడ బార్ అసోసియేషన్‌లో ..

లబ్బీపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): ధూమపానం ఆరోగ్యానికి హానికరం అని, స్మోకింగ్ సెస్సేషన్ థెరపీ ద్వారా ధూమపాన అలవాటును మాన్పించవచ్చని నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ తంబీ జోసెఫ్ పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పీవీపీ మాల్‌లో శనివారం నేను పొగాకుకు వ్యతిరేకిని అని సంతకాల సేకరణ, నో టొబాకో డే పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మోకింగ్‌ను మానిపించడానికి నూజివీడులోని నవజీవన్ సంస్థ బాస్కో డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఈ సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవీపీ మాల్ అసిస్టెంట్ మేనేజర్ నాగబాబు, జిల్లా ఈగల్ టీం సబ్‌ఇన్‌స్పెక్టర్ వీరాంజనేయులు, నవజీవన్ బాలభవన్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ మరిరెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు, జోనల్ కోఆర్డినేటర్స్ ఎస్‌కే.నజ్మా, ఎస్.జాకబ్ రాజు, ఎన్.ప్రియాంక, ఎన్. దేవమణి, డి.వెంకటేశ్వరరావు, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బార్‌లో...

విజయవాడ లీగల్ : బెజవాడ బార్ అసోసియేషన్‌లో నవజీవన్ బాల భవన్ వారితో కలిసి కోర్టుల ఆవరణలో 'నేను పొగాకు వ్యతిరేకిని' అనే కార్యక్రమం నిర్వహించి దానిని అందరూ బలపరుస్తూ అందరి వద్ద సంతకాలు తీసుకొన్నారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు ఏకే భాషా మాట్లాడుతూ పొగాకు నివారణకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నవజీవన్ బాలభవన్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ ఫాదర్ అంతయ్య మాట్లాడుతూ పొగాకు వ్యతిరేకతకు ముందుకు వచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచినందుకు న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, న్యాయవాదులు, బార్ కార్యవర్గ సభ్యులు, నవజీవన్ బాలభవన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ సిబ్బందికి వీడ్కోలు చెబుతున్న నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు

శేషజీవితం ఆనందంగా గడపండి

● పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సీపీ రాజశేఖర బాబు సూచన

గుణదల, మే 31 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో పనిచేసి పదవీ విరమణ చేసిన వారు శేషజీవితం ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్లో పనిచేసి పదవీవిరమణ చేసిన సిబ్బందికి వీడ్కోలు కార్యక్రమం కమిషనర్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా పదవీవిరమణ చేసిన సిబ్బందికి దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసిన వారి సేవలు ఎప్పటికీ మరువలేమని చెప్పారు. పదవీ విరమణ చేసిన వారికి పోలీసుశాఖ ఎప్పటికీ అండగా నిలుస్తుందని తెలిపారు. అడ్మిన్ డీసీపీ కె.జె.వి.సరిత, ఏవో సునీత, ఎఆర్ ఏడీసీపీ డి.ప్రసాదరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల ప్రారంభం నేడు



చెస్ పోటీలు, చెస్ ట్రైనింగ్ క్యాంప్‌ల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ తదితరులు

విజయవాడస్పోర్ట్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): కానూరులోని స్కాట్స్‌పైన్ స్కూల్ ఆవరణలో జూన్ ఒకటి(ఆదివారం) నుంచి 6 వరకు నిర్వహించనున్న చెస్ పోటీలు, కోచింగ్ క్యాంపు, ట్రైనింగ్ క్యాంప్‌ల బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ మాట్లాడుతూ ఆదివారం రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని, 2 నుంచి 6 వరకు గ్రాండ్ మాస్టర్ ఉచిత కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ, అంతర్జాతీయ చెస్ పోటీలకు అర్హత సాధించిన 100మంది రాష్ట్ర క్రీడాకారులకు ఈ క్యాంపులో శిక్షణ ఇస్తారని, క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు అందిస్తున్నామని, జూన్ 3,4 తేదీల్లో చెస్ స్కూల్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలోనే టాప్ రేటింగ్ ఫిడే గ్రాండ్ మాస్టర్ తేజస్ బక్రి(గుజరాత్) చెస్ క్రీడాకారులకు మెలకువలను నేర్పిస్తారని తెలిపారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.ఎం.ఎఫ్.ఫణికుమార్, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.శివ, ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక, కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ మేనేజర్‌లు పాల్గొన్నారు.



అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన గంధం వెంకటేశ్వరరావు, చిత్రంలో ఎన్నికల అధికారులు వెంకటరమణారావు, శ్రీనివాసదివాకర్ తదితరులు

ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఆటోనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గంధం వెంకటేశ్వరరావు(కొండ) అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో 21 స్థానాలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు పంచకర్ల వెంకటరమణారావు, తాడేపల్లి శ్రీనివాసదివాకర్‌లు సంయుక్తంగా ప్రకటించారు. కార్యదర్శిగా షేక్‌దస్తగిర్, కోశాధికారిగా షైలు రామ్మోహనరావు, ఉపాధ్యక్షులుగా ఐనాల ఉమామహేశ్వరరావు, సయ్యద్ రియాజ్‌లు, జాయింట్ సెక్రటరీలుగా రేకపల్లి రామకృష్ణ ప్రసాద్, తోట శకంర్రావు, వేమూరి చంద్రమోహన్, లక్కింశెట్టి కనకారావు, కార్యవర్గ సభ్యులుగా వడ్లాని రాఘవరావు, మిగిలిన సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఆటోమొబైల్ మెకానిక్స్ కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై 3న పోటీలు

కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్యమండలి, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతికశాస్త్రం విభాగం సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు జూన్ 3న చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ 3న ఉదయం 10 గంటలకు మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో జరిగే పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాల కోసం జె.పాండురంగారావు, ఫ్యాకల్టీ, 94411 76794కి ఫోన్ చేయాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకం అంతం చేద్దాం అనే శీర్షికతో ఈ దఫా పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. చిత్రలేఖనం పోటీ అంశం - ప్లాస్టిక్ కాలుష్యం, దాని నివారణ, వ్యాసరచన - పర్యావరణ విధ్వంసంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, క్విజ్ పోటీలు - పర్యావరణ సంబంధిత ప్రశ్నలపై పోటీలుంటాయి.

ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4 నుంచి యోగా

లబ్బీపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నర్ ఇంజనీరింగ్ యోగా కార్యక్రమాన్ని తెలుగులో జూన్ 4 నుంచి 10 వరకు విజయవాడలో నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఎం.హేమలత తెలిపారు. ఈ కోర్సు పూర్తిగా శాస్త్రీయమైందని, ఎటు వంటి మతవిశ్వాసాలతో సంబంధం లేకుండా అందరూ చేయదగిందని, మనిషి సంపూర్ణ శ్రేయస్సుకి, ఆనందకర జీవితానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం బందర్ రోడ్డులోని తనిష్క్ జ్యుయలర్స్ బిల్డింగ్ సెకండ్ ఫ్లోర్‌లోని ఈశా యోగా సెంటర్‌లో జరుగు తుందని తెలిపారు. తరగతులు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో 6గంటల నుంచి 9గంటల వరకు, ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటాయని తెలిపారు. జూన్ 4న ఉదయం, సాయంత్రం 6గంటల నుంచి 7 వరకు ఉచిత పరిచయ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి అంద రూ ఆహ్వాని తులేనని, వివరాలకు 91664 94989, 94407 75665 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జనసేన వీరమహిళ రావి సౌజన్య జన్మదిన వేడుకలు



విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): జనసేన వీర మహిళ, సినీ నిర్మాత రావి సౌజన్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలో పటమటలంకలో రావి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో హీరో రావి రామ్‌చరణ్, హీరోయిన్ మహి, సత్య, విష్ణుశ్రీ, దర్శకుడు కాకర్ల ఎంఆర్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ పీఎల్‌కె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు



సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి నివాళులర్పించిన చంటి, వీఎల్ రెడ్డి తదితరులు

భారతీనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): గురునానక్ రోడ్డులోని కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో సూపర్ స్టార్ కృష్ణ 82వ జయంతి వేడుకలు శనివారం సూపర్‌స్టార్ కృష్ణ అభిమానులు ఎస్ చంటి, వీఎల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తొలుత పార్కులోని కృష్ణ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నవజీవన్ బాల భవన్‌లో చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెరుగైన డిజిటల్ సేవలు అందించేందుకు చర్యలు

దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, మే 31 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన డిజిటల్ సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఈవో వి.కె.శీనా నాయక్ వివిధ విభాగాల అధికారులకు సూచించారు. ఇంద్రకీలాద్రిపై శనివారం తన చాంబర్‌లో దేవదాయశాఖ ఐటీ మేనేజర్ ప్రసాద్, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు.

దేవస్థానంలో భక్తులకు దాదాపుగా నగదు రహిత సేవలు అందించేందుకు సాంకేతికత ఏవిధంగా ఉపయోగించాలనే విషయమై చర్చించారు. భక్తులకు మెరుగైన సదుపాయాలు అందించటంలో ఉన్న వెనులుబాటులపై మాట్లాడారు. డిజిటల్ సేవల ద్వారా విరాళాల సమర్పణ, దర్శనం టికెట్ల కొనుగోలు, ఆర్జిత సేవల బుకింగ్, ప్రసాదాల కొనుగోలు, తదితరాలకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

ఆన్‌లైన్ పూజలు, సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావాలని, పూజ అనంతరం అమ్మవారి కుంకుమ ప్రసాదం వెంటనే పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఈ కోటేశ్వరరావు, గణాంక విభాగం, అన్నదాన విభాగం, ఐటీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

వర్షాల వెంట.. ఆశల పంట.!

ముందస్తు వర్షాలతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు

- ఖరీఫ్ ప్రణాళికతో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు
- పొలాలు సిద్ధం చేస్తున్న అన్నదాతలు

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కేరళను త్వరగా తాకడంతో వర్షాలు విస్తారంగా పడి వాతావరణం చల్లబడింది. ఈ ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మరికొద్ది రోజుల్లో సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్నదాతలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోజు మార్చి రోజు వర్షాలు పడుతుండటంతో ఈఏడాది సాగుకు వర్షాలు బాగా ఉపయోగపడతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా జూన్ రెండో వారం నుంచి జూలై నెలాఖరు వరకు పడే వర్షాలతో వాగులు కదిలి వరదలు వచ్చి చెరువులు నిండటం ముమ్మరంగా వ్యవసాయ పనులు ప్రారంభమవ్వడం జరుగుతుంది. కానీ ఈఏడాది ముందస్తుగా తొలకరి పలకరించడంతో ముందుగానే సాగు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఏప్రిల్, మే మాసాల్లో అకాల వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో ఇప్పటికే పొలాలు నీరు తాగి ఉన్నాయి. ఎక్కడ చూసినా పచ్చని ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. పటమట వేడిగాలుల సెగ ఈ ఏడాదికి ఇక లేనట్టేనంటున్నారు. మొత్తానికి తొలకరి పలుకరింపుతో ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం లాంటి మెట్ట ప్రాంతాల్లో ఇప్పటికే పత్తి సాగుకు పొలాలను సిద్ధం చేసి ఉంచారు అన్నదాతలు. భూముల్లో పదునుండటంతో పత్తిని నేరుగా నాటేందుకు రైతులు విత్తనాలు కొనుగోలు చేసి పెట్టుకున్నారు. జి.కొండూరు మండలం వెంకటాపురం, చెవుటూరు గ్రామాల్లో కొందరు రైతులు పత్తి విత్తనాలు నాటారు. వర్షాలు కాస్త తెరిపిచ్చి భూములు ఆరితే అచ్చులు తోలి పత్తి విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు.


పత్తి విత్తనాలు నాటేందుకు అచ్చులు తోలి సిద్ధం చేసిన పొలం

నాలుగు దశాబ్దాల తర్వాత

సుమారు 4 దశాబ్దాల క్రితం రోహిణి కార్తెలో విస్తారంగా వర్షాలు కురిసి వాతావరణం చల్లబడింది. మళ్లీ ఇప్పుడు రోహిణి కార్తె ప్రారంభానికి ముందే వాతావరణం చల్లబడింది. ఇది శుభ పరిణామమే అంటున్నారు రైతులు.

మాగాణి సాగుకు అనుకూలం

ఇప్పుడు పడుతున్న వర్షాలు మాగాణి సాగుకు అనుకూలమంటున్నారు అన్నదాతలు. ఇప్పటికే కాలువలు, సప్లై చానెల్స్, భూములు నీరు తాగి ఉన్నాయి. ఇకపై పడే వర్షాలు నేరుగా భూమిపై పారి వాగులు కదిలి చెరువులు నిండేందుకు దోహదం చేస్తాయంటున్నారు.

ఎరువులు, విత్తనాలు సిద్ధం

ఖరీఫ్‌లో రైతులు విత్తనాలకు, ఎరువులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. అవసరాన్ని బట్టి విత్తనాలను ఇప్పటికే స్టాక్ పెట్టించారు. భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లి పెసర, పెసర విత్తనాలు 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేసేందుకు ఏవో కార్యాలయాలకు రప్పించి ఉంచారు. కొన్నిచోట్ల సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో సాగయ్యే పంటల వివరాలు		
వరి	:	48,167 హెక్టార్లు
మొక్కజొన్న	:	3,668 హెక్టార్లు
పెసర	:	3,622 హెక్టార్లు
మినుము	:	2,250 హెక్టార్లు
చెరకు	:	438 హెక్టార్లు
పత్తి	:	36,254 హెక్టార్లు
కృష్ణా జిల్లాలో..		
వరి	:	1.62 లక్షల హెక్టార్లు
చెరకు	:	3 వేల హెక్టార్లు
మినుము	:	1,300 హెక్టార్లు
పత్తి	:	300 హెక్టార్లు
మొక్కజొన్న	:	100



ముందస్తు తొలకరి మంచిదే
వేములకొండ వేణు గోపాలరావు



ముందస్తుగా తొలకరి రావడం మంచిదే. అదును, పదును బట్టి వ్యవసాయం సాగుతుంది. ఈఏడాది అదును, పదును బా గానే ఉండేలా ఉంది. వర్షాలతో పొలాలు నీరు తాగేసి ఉన్నాయి. పంటల సాగుకు అనుకూలంగా ఉంది. సకాలంలో సాగు చేస్తే దిగుబడులు బాగుంటాయి.

రైతులకు ఎంతో మేలు: ఏడీఏ కే శశికళ



ఖరీఫ్ 18 రోజులు ముందుగానే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. సకాలంలో పంటల సాగుతో చీడపీడల దాడి తగ్గుతుంది. ఎరువులు, మందులు సకాలంలో వాడుకునే అవకాశం ఉంది. నవంబరు నెలాఖరు కల్లా పంటలు చేతికి వస్తుంది. డిసెంబరులో వచ్చే చెడువానల నుంచి పంటను కాపాడుకునే అవకాశం ఉంది.


అంబాపురంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ
- రూ.95.24 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం

విజయవాడ రూరల్ మే 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, మారుమూల ప్రాంతాల్లో సైతం రోడ్లు అభివృద్ధి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుం డా చూస్తామని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పూర్తి చేసుకు న్న సీసీ రోడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత పీ నైనవరం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మం డల పరిషత్ నిధులతో విజయవాడ రూరల్ మండలం అంబాపురం లో రూ.50లక్షలతో సీసీ రోడ్డు, పీ నైనవరం గ్రామ పరిధిలో రూ.25 లక్షలు, రూ.20.25లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఇప్పటికే పలుచోట్ల రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, సాధ్యమైనంత త్వరలో ప్రతి రోడ్డును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు గొడ్డల్ల చిన రామారావు, గ్రామ సర్పంచులు గండికోట సీతయ్య, బట్టా సోమయ్య, టీడీపీ నేతలు రామకృష్ణ, దేవేంద్ర పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యార్థులకు బస్‌పాస్‌లు

బస్టేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు అనంతరం వి ద్యా సంస్థలు పునః ప్రారంభం కానున్నందున విద్యార్థులకు బస్ పాస్‌ల జారీకి ఏపీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. జూన్ 2 న సోమవారం నుంచి బస్ పాస్‌ల జారీ ప్రక్రియ ప్రారంభం కానుం ది. విజయవాడ సిటీకి సంబంధించి పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని కౌంటర్ల నుంచి తమ పాస్‌లను పొందవచ్చు. ఆటోనగర్, కంకిపాడు, ఇబ్రహీంపట్నం కౌంటర్లలో రెన్యువల్స్ మాత్రమే చేస్తారు. ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, జగ్గయ్యపేట బస్టేషన్లలో కొత్త బస్ పాస్‌లు జారీ చేస్తారు. ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కౌంటర్లను తెరచి ఉంచుతారు. ఆదివారాలు మాత్రం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాస్‌లు జారీ చేస్తారు. ఆదివారం మి నహా ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బస్‌పాస్ దరఖాస్తులను పరిశీలిస్తారు. 12ఏళ్లలోపు బాలురకు (7వ తరగతి), 18 ఏళ్లలోపు బాలికలకు (10వ తరగతి వరకు) ఉచిత బ స్సు పాస్‌లను జారీ చేస్తారు. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని పూర్తిచేసి ఫొటో అంటించి, బోనఫైడ్ సర్టిఫికెట్‌లో ప్రిన్సిపాల్ గానీ, హెడ్‌మాస్టర్ గానీ సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ ఫారాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీపాస్.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉం టుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తిచేసి ఫొటోపై బోనఫైడ్ సర్టిఫికెట్ నందు ప్రిన్సిపాల్, హెడ్‌మాస్టర్‌తో సంతకం చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల జాబితాలు అందిన ఆరువాతే కొత్త బస్ పాస్‌లు జారీ చేస్తారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా కళాశాల యాజమాన్యాలు ముందస్తు చర్యలు తీసుకొని జాబితాలు పంపాల్సిందిగా ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు సిద్ధం చేశామని జిల్లా ప్రజా రవాణ అధికారి ఎం.వై.దానం తెలిపారు.

జడ్పీ ఉద్యోగులకు బదిలీలు రేపు

మచిలీపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఈనెల 2న ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది కి సంబంధించిన బదిలీలు జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో కన్నమనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవోలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, టై పిస్టులు, వివిధస్థాయిల్లో ఉద్యోగులకు ప్రభుత్వ ఆదేశాలతో కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

116 బృందాలు.. 1008 మంది కళాకారులతో

నృత్య ప్రదర్శనలు అమోఘం

అతిథులుగా నటుడు రాజేంద్రప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ తెలుగు అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విజయ నర్తనంతో శ్రీ కృష్ణవేణి-విజయనర్తన బిరుదు పురస్కార ప్రదాన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు నాట్య విద్యార్థులకు నృత్య కృష్ణవేణి బిరుదు పురస్కార నాట్య గురువులకు విజయవర్తన బిరుదు పురస్కార ప్రదాన సత్కారాలు ఘనంగా నిర్వహించారు. శాస్త్రీయ-బృంద నృత్యాలు 116 బృందాలు, 1008 మంది నాట్యకళాకారులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ కళా ప్రదర్శనలో సినీ నటుడు రాజేంద్రప్రసాద్ విశిష్ట అతిథిగా పాల్గొని సభలో తన అనుభూతులను పంచుకున్నారు. కామెడీని హీరో స్థాయికి తీసుకెళ్లిన ఘనత తనదేనని, ఆ అవకాశం తనకు దక్కినందుకు గర్వంగా ఉందన్నారు. అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు తనను చూసి ప్రసాద్ బాగా నవ్విస్తావయ్యా అన్న మాటలు చెబుతూ పీవీ శైలిలో మిమిక్రీ చేయడం అందరినీ అలరించింది. ఈ వేడుకలో ఎన్నో రంగాల్లో విశిష్టంగా సేవలందిస్తున్న ప్రముఖులు పాల్గొన్నారు. వీరిలో అడ్మిన్ ఏఏజీ జీ శ్రీకాంత్, ఇటలీ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జి.కిషోర్, యూపీఎస్సీ పబ్లిక్ కమిషన్ జేడీ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం, అంబేద్కర్ వర్సిటీ స్పెషల్ ఆఫీసర్ వెలగా జోషి, దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపల్ ఎస్.పద్మజ, ఎస్.మూర్తి, అనుహ్య రెడ్డి ఉన్నారు. ఈ వేడుకలో కలెక్టర్ నాలుగున్నర గంటల పాటు కళా ప్రదర్శనలను ఆసక్తితో వీక్షించారు. 1000కి పైగా విద్యార్థులు ఒకే వేదికపై తమ నాట్యప్రదర్శనలతో అలరించారు. కళాకారులకు జ్ఞాపికలు, బిరుదులు ప్రదానం చేస్తూ వారిని సత్కరించారు. వేదికను నాట్యాచార్య ఘంటసాల పవన్ కుమార్, హవిషా, పావని, నరేంద్రలు నిక్షిప్తంగా నడిపారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ఇందిరాపార్కు వద్ద తెలంగాణ, ఏపీ జేఏసీల ఆధ్వర్యంలో నిరసన


ధర్నాలో మద్దతు తెలియజేస్తున్న షబ్బీర్ అలీ

కవాడిగూడ, మే 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం-2025ను రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. వక్ఫ్ సవరణ చట్టం-2025ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరాపార్కు వద్ద తెలంగాణ, ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీల ఆధ్వర్యంలో పలు ముస్లిం సంఘాలు చలో ధర్నా చౌక్ కార్యక్రమం నిర్వహించి అనంతరం భారీ బహిరంగ సభను నిర్వహించాయి. ఈ సభకు జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మహ్మద్ ముస్తాక్ మాలిక్, ఎంబీటీ అధ్యక్షుడు మాజిదుల్లాఖాన్ ఫరహత్, కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారు మాజీమంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎంపీలు వి. హనుమంతరావు, అజీజ్ పాషా, కాంగ్రెస్ నేత ఒసామా మహ్మద్, ఎంపీజే నేత మహ్మద్ అజీజ్, బీఆర్ఎస్ నేత రహముల్లా నియాజీ, ఆమ్ ఆద్మీ పార్టీ నేత మాజిద్ ఖాన్ తదితరులతోపాటు వివిధ ప్రజా సంఘాలు, ముస్లిం సంఘాల నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ చట్టాన్ని సవరించి కార్పొరేట్ శక్తులకు లక్షలాది ఎకరాల భూములను కట్టబెట్టడానికి కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఈ ధర్నాలో జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'బంగారం శ్రీను' కోసం గాలింపు

ఇతర రాష్ట్రాలకు బృందాలు ● కుటుంబ సభ్యులపై ఎల్‌వోసీ జారీ
● ఆడియో రాయబారం పంపిన శ్రీనివాసరావు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: బంగారం, నగదు చిట్టీలు నిర్వహించి కోట్లాది రూపాయలకు టోకరా వేసిన ముచ్చెర్ల శ్రీనివాసరావు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. విజయవాడ అయోధ్యనగర్ లోటస్‌కు చెందిన శ్రీనివాసరావుపై అజిత్‌సింగ్ నగర్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు ఇప్పటి వరకు 40 మంది బాధితుల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. శ్రీనివాసరావు కోసం పోలీసులు సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్నారు. లోటస్‌లో ఉన్న శ్రీనివాసరావు భార్యను పోలీసులు విచారిస్తున్నారు. ఆయన కుమారుడు నిఖిల్, హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె సాయి అమృత, అల్లుడు అభిలాష్‌పై పోలీసులు లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు. శ్రీనివాసరావు బ్యాంక్ ఖాతాలపై పోలీసులు దృష్టి సారించారు. శ్రీనివాసరావు ఇతర రాష్ట్రాలకు పారిపోయినట్టు అనుమానిస్తున్నారు. ప్రత్యేక బృందాలు అక్కడికి వెళ్లాయి. ఇన్ని రోజులూ అజ్ఞాతంలో ఉన్న శ్రీనివాసరావు శనివారం ఖాతాదారులకు ఆడియో రాయబారం పంపాడు. రెండు రోజుల్లో వచ్చి ఖాతాదారులకున్న బకాయిలను సెటిల్ చేస్తానని వాయిస్ మెసేజ్‌ను పంపాడు. ఏడీసీపీ జి.రామకృష్ణ శనివారం రాత్రి అజిత్‌సింగ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. దర్యాప్తు ఎంత వరకు వచ్చిందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

రెండు రోజుల్లో వస్తా: ముచ్చెర్ల

త్వరలో వచ్చి ఖాతాదారులకు బకాయిలు సెటిల్ చేస్తా. ఎవరూ అన్యథా భావించవద్దు. దొరికితే కొడతారు, చంపుతారని ఊరి వదిలి పెట్టి వెళ్లా. నాకు చెల్లింపులు చేసే ఉద్దేశం ఉంది కాబట్టి కుటుంబ సభ్యులను, బంగారం ఇంట్లో పెట్టాను. సీసీ కెమెరాలు పరిశీలించినా తెలుస్తుంది. ధరించిన దుస్తులతోనే వెళ్లా. పరిస్థితులు మారిపోయాయి. రెండు రోజుల్లో వచ్చి సెటిల్ చేస్తాను.

ఎన్టీఆర్ అవార్డుతో మరింత పెరిగిన బాధ్యత: రాజేంద్రప్రసాద్

విజయవాడ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పురస్కారం ఒక గుర్తింపు మాత్రమే కాదు. అది మరింత బాధ్యతను కలిగించే ప్రతిబింబమని ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకొని ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన వేడుకలో ఆయన్ను ఎన్టీఆర్ అవార్డుతో సత్కరించారు. సినీ, సాహిత్య, విద్య, సామాజిక రంగాలకు చెందిన 30 మందికి పైగా వ్యక్తులకు ఎన్టీఆర్ స్మారక పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నందమూరి ఇంటిలోనే నా బాల్యం గడిచిందని, తన కళా ప్రస్థానాన్ని అక్కడే ప్రారంభించానన్నారు. ఎన్టీఆర్ నుంచి క్రమశిక్షణ నేర్చుకొన్నానని, ఆయన నడకే ఒక గ్రంథం లాంటిదనిని భావోద్వేగంగా చెప్పారు. ఎక్స్‌రే సంస్థ వ్యవస్థాపకుడు కొల్లూరి సంస్థ ధృక్పథం, లక్ష్యాలపై మాట్లాడారు. వేదికపై మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, మండలి బుద్ధప్రసాద్, సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిరిపురపు పద్మజ, ఎక్స్‌రే సంస్థ సభ్యులు బోడి ఆంజనేయరాజు, సీహెచ్‌పీ సుబ్బయ్య, రవికిరణ్ పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న రాజేంద్రప్రసాద్

నేటి నుంచి రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ

మొగల్రాజపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపుల నుంచే కార్డుదారులకు రేషన్ అందించే పాతవిధానాన్ని కూటమి ప్రభుత్వం ఆదివారం నుంచి ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 2016 రేషన్ షాపుల ద్వారా 11 లక్షల 12 వేల 832 కార్డుదారులకు బియ్యం, పంచదార అందించడానికి అధికారులను, డీలర్‌లను సన్నద్ధం చేసింది. ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌వో ఏ పాపారావు మాట్లాడుతూ 1 నుంచి 15 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాల్లోనే సరుకులు పంపిణీ జరుగుతుంది. ఈ 15 రోజుల్లో ఆదివారాల్లో కూడా రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయి. కార్డుదారులు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో ఎప్పుడు కావలిస్తే అపుడు వెళ్లి రేషన్ తీసుకోవచ్చు.

మామ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది?

పెన్షన్ దారులకు అధికారుల పలకరింపు


పెన్షన్ ఇస్తున్న సీసీఎల్ఏ అధికారి జయలక్ష్మి

కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): 'మామ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది? పెన్షన్ నెల నెలా సక్రమంగా అందుతోందా, ఇబ్బందులేమైనా ఉన్నాయా? అంటూ రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ పెన్షన్‌దారులను కుశల ప్రశ్నలడిగి శనివారం పెన్షన్లు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రణాళికతో పీ-4 వంటి వినూత్న విధానాలను ప్రభుత్వం అమలుచేస్తున్నట్టు తెలిపారు. పెన్షన్ల పంపిణీలో భాగంగా జయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ, ఇతర అధికారులతో కలిసి అర్బన్ పరిధిలోని బృందావన్ కాలనీలో పెన్షన్‌ల పంపిణీలో పాల్గొన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జి.జయలక్ష్మి మాట్లాడుతూ జూన్ 1న ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే మే 31న శనివారమే పెన్షన్లు అందిస్తున్నామని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందిస్తున్నట్టు తెలిపారు.

పెన్షన్ల పంపిణీపై నిరంతర పర్యవేక్షణ

ఎన్టీఆర్ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 2,27,786 పెన్షన్లకు దాదాపు రూ.98.11 కోట్లు పంపిణీ జరుగుతోందని, కలెక్టర్ అన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి ఆయన శనివారం విజయవాడ అర్బన్, సత్యనారాయణపురంలో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. లబ్ధిదారులను కుశల ప్రశ్నలడిగి వారి అభిప్రాయాలు తెలుసుకుని పెన్షన్లను పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్ష రేపటి నుంచి

- పరీక్షకు హాజరుకానున్న 660 మంది అభ్యర్థులు
- నలందా విద్యా నికేతన్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు: డీఆర్‌వో నరసింహం

కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మెయిన్స్ పరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాలులో డీఆర్‌వో నరసింహ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పరీక్షను జూన్ 2 నుంచి 4 వరకు ఆఫ్‌లైన్ ఓఎంఆర్ ఆధారిత పరీక్షలు జరుగుతుందన్నారు. నగరంలోని నలంద విద్యా నికేతన్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. 660 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. జూన్ 2న క్వాలిఫైయింగ్ టెస్ట్ జనరల్ ఇంగ్లీష్, జనరల్ తెలుగు పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 4.10 గంటల వరకు, 3న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ (పేపర్-1), మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మ్యాథమెటిక్స్ (పేపర్-2) పరీక్ష, 4న జనరల్ ఫారెస్ట్రీ-1 (పేపర్-3), ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, జనరల్ ఫారెస్ట్రీ-2 (పేపర్-4) మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు గుర్తింపు కార్డు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసి పరీక్షా కేంద్రాన్ని సిద్ధంగా ఉంచాలని డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహ అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ టి.ఎస్.ఆర్.రాజగోపాల్, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్.సలీం, లైజన్ ఆఫీసర్ పి.వైకుంఠ రావు, నలంద విద్యానికేతన్ చీఫ్ సూపరింటెండెంట్ డి.రజని పాల్గొన్నారు.

జిల్లాను పొగాకు రహితంగా తీర్చిదిద్దుదాం: కలెక్టర్

కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తులు, కేన్సర్ వ్యాధులకు కారణమైన పొగాకు, గుట్కా, ఖైనీ వంటి మత్తుపదార్థాల నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకొనేలా ప్రతి ఒక్కరినీ చైతన్యవంతుల్ని చేసి పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పొగాకు వల్ల కలిగే నష్టాలపై ముద్రించిన అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పొగాకు వినియోగంతో మన శరీరంలోని అన్ని అవయవాలకు నష్టం జరుగుతుందన్నారు. నెలరోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర క్యాంపెయిన్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యం సాధనలో భాగంగా ఆరోగ్యకర సమాజన నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరపకూడదనే నిబంధనను జిల్లావ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పొగాకు ఉత్పత్తుల అలవాటు పడిన వారు మానుకొనేందుకు జిల్లా ఆసుపత్రిలోని డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కోట్పా యాక్ట్‌లో జిల్లాలో కట్టుదిట్టంగా అమలుచేసేలా ప్రత్యేకచర్యలు తీసుకొంటున్నామన్నారు. అనంతరం నేను సైతం ఎన్టీఆర్ జిల్లాను పొగాకు రహిత జిల్లాగా మారుస్తానని, సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో సంతకం చేసి సంచార అవగాహన వాహనాన్ని ప్రారంభించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ అరవ రమేష్, నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ తంబి, ప్రోగ్రాం మేనేజర్ శేఖర్, కో-ఆర్డినేటర్ జాకబ్ రాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పొగాకు వల్ల కలిగే నష్టాలపై ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఈ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి

సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర-2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను చేరుకొనేలా జిల్లాస్థాయిలో కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం ఇగ్నైట్ ప్రత్యేక సెల్‌లో ఏర్పాటు చేసిన కార్మిక శాఖ స్టాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త సాకారం దిశగా ఔత్సాహికులను సరికొత్త ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ సెల్ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని, కేంద్ర రాష్ట్ర కార్మిక శాఖలు, సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులతో పాటు ఓలా, బ్లింకిట్, స్విగ్గీ, జొమోటో వంటి ఆన్‌లైన్ ప్లాట్ ఫాం కార్మికులు, గిగ్ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వీరికి సామాజిక భద్రతతో పాటు ప్రభుత్వ పథకాలను చేరువ చేసేందుకు కేంద్రం ఈ పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్ నమోదులో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు జిల్లా కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొన్న ఎం.పావనికి యూనిక్ ఐడీ కార్డును కలెక్టర్ అందజేశారు. స్టాల్స్ పరిశీలనలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, ఉప కార్మిక కమిషనర్ సీహెచ్ ఆషారాణి, అసిస్టెంట్ కమిషనర్ మహేష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు ఉన్నారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి.

సత్యనారాయణపురం: అన్నదాతలు ఆరోగ్య సిరుల పంటను పొందేందుకు యోగా ధ్యానసాధనను జీవితంలో భాగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు, కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆయుష్ శాఖ, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో శనివారం బీఆర్‌టీఎస్ యోగా వీధిలో నిర్వహించిన రైతన్నల థీమ్ యోగాలో వారు పాల్గొని రైతులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ రైతన్నలు యోగా, ధ్యానంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం పొందవచ్చునన్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఇచ్చిన అమూల్యమైన బహుమతి యోగా అన్నారు. యోగాను నేర్చుకొని జీవితాంతం ఆచరించాలన్నారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ వి.రాణి, డాక్టర్ రామత్లేహి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న ఢిల్లీరావు, లక్ష్మీశ, ధ్యానచంద్ర



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఒన్ ఆఫ్ దెమ్ డేస్	హాలీవుడ్ మూవీ	జూన్ 04
జాట్	హిందీ చిత్రం	జూన్ 05
అమెజాన్ ప్రైమ్		
స్టోలెన్	హిందీ చిత్రం	జూన్ 04
జియో హాట్‌స్టార్		
మౌంటెన్ హెడ్	హాలీవుడ్ మూవీ	జూన్ 01
టూరిస్ట్ ఫ్యామిలీ	తమిళ చిత్రం	జూన్ 02
గజానా	హిందీ చిత్రం	జూన్ 02
దేవికా అండ్ డానీ	తెలుగు సిరీస్	జూన్ 06

వ్యాపార నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి నటుడిగా కొనసాగుతున్నారు శివబాలాజీ. రెండు దశాబ్దాలకు పైగా ఉన్న ఆయన కెరీర్‌లో చేసిన చిత్రాల సంఖ్య స్వల్పమే అయినా నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్'లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న శివబాలాజీ 'నవ్య'తో ముచ్చటించారు.

ఆ విషయంలో నేను లక్కీ

పాత్రల ఎంపికలో చాలా సెలెక్టివ్‌గా ఉంటున్న మీరు 'కన్నప్ప' చిత్రం చేయడానికి ప్రత్యేక కారణం?

అనుకోకుండా దొరికిన అవకాశం అది. నా క్యారెక్టర్ మొదట స్క్రిప్ట్‌లో లేదు. ఒకరోజు మోహన్‌బాబుగారు, విష్ణు, నేను భోజనం చేస్తుండగా సడన్‌గా 'శివ మన సినిమాలో ఎందుకు నటించడంలేదు?' అని మోహన్‌బాబు గారు అడిగితే 'శివ చేయతగ్గ పాత్ర ఇందులో లేదు నాన్నా' అని విష్ణు చెప్పారు. 'లేదు.. అతను మన సినిమాలో ఉండాలి' అన్నారు. ఆ టాపిక్ అంతటితో ఆగిపోయింది. మోహన్‌బాబు గారు 'కన్నప్ప'లో మహదేవశాస్త్రి పాత్ర పోషిస్తున్నారు. రెండు రోజుల్లో తన కొడుకు కుమారదేవ శాస్త్రి పాత్ర క్రియేట్ చేసి 'ప్రతి సీన్‌లో నువ్వు నా పక్కన ఉంటావు.. చెయ్యి' అని ఆదేశించారు. అటువంటి గొప్ప నటుడితో నటించే అవకాశం వచ్చింది. అందుకే ఇంకా ఏమీ ఆలోచించకుండా ఒప్పేసుకొన్నా.

మీరు పరిశ్రమలోకి వచ్చి 22 ఏళ్లయింది. కానీ నటించిన చిత్రాల సంఖ్య చాలా తక్కువ. ఎందుకలా?

నాకు ఇప్పటికీ ఏడాదికి ఐదారు చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయి. పారితోషికం బాగానే ఆఫర్ చేస్తున్నారు. కానీ డబ్బు కోసం మాత్రమే ఆలోచించి నిర్మాతకు నష్టం కలిగించలేను కదా! కథ నచ్చకపోతే నిర్మొహమాటంగా చెప్పేస్తాను. అలా నేను రిజెక్ట్ చేసిన కథలను వేరే వాళ్లతో తీస్తే అవి ఫెయిల్ అయ్యాయి. నేను రెండేళ్లకు ఒక సినిమా చేసినా, మంచి పారితోషికం, మంచి క్యారెక్టర్ దొరుకుతున్నాయి. సాధారణంగా ఇలా రెండేళ్లకో సినిమా చేస్తే జనం మరిచిపోతారని అంటుంటారు. కానీ నా విషయంలో అలా జరగడం లేదు. ఆ విషయంలో నేను లక్కీ.

కానీ సినిమాల సంఖ్య కూడా ముఖ్యమే కదా!

యాభై ఏళ్ల తర్వాత ఆ సంఖ్యను ఎవరు గుర్తు పెట్టుకుంటారు చెప్పండి! ప్రస్తుతం మనం హ్యాపీగా, కంఫర్ట్‌గా ఉన్నామా లేదా అనేది నాకు ముఖ్యం. చాలామంది సక్సెస్ సక్సెస్ అంటుంటారు కదా. నా దృష్టిలో సక్సెస్ అంటే హ్యాపీనెస్. మనం దేని కోసం పరిగెడుతుంటాం.. డబ్బు కోసం. డబ్బు దేనికి? హ్యాపీగా ఉండడానికి. నేను ప్రస్తుతం హ్యాపీగానే ఉన్నాను కదా. సంతోషాన్ని ఎలా వెదుక్కుంటామనేది మన చేతుల్లో ఉంది. దానికి గురించి ఎవరూ క్లాసెస్ చెప్పరు. మన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలిస్తూ మన జీవన విధానాన్ని మార్చుకుంటు ముందుకు వెళ్లాలి. హ్యాపీగా ఉండాలి. అదంత ఈజీ కాదు, అలాగని కష్టమూ కాదు. ప్రతి రోజూ ఎందుకు టెన్షన్‌తో పరుగులు తీయడం? ఏముంది నీ చేతిలో.. అన్ని ఇతరుల చేతుల్లో ఉంటాయి. రోజూ ఎవరో ఒకరిని కలవాలి.. తెలియని వాళ్ల దగ్గరకు వెళ్లి పరిచయం చేసుకోవాలి. కాకా పట్టాలి.. కబుర్లు చెప్పాలి... ఇవన్నీ నిజంగా నాకు తెలీదు. నా ఐడెంటిటీని చంపుకోవడం నాకు ఇష్టం లేదు. మరి నేను నేనుగా బతకాలి, హ్యాపీగా ఉండాలని ఆలోచించి నా మార్గాన్ని నేను వెదుక్కున్నా. మనం, ఫ్యామిలీ కంఫర్ట్‌గా ఉండాలంటే సొంత ఇల్లు, వీలైతే ఓ ఫామ్‌హౌస్, మంచి కారు.. ఇవన్నీ చాలు అనుకున్నా. సంపాదించుకున్నా. సంతోషంగా గడిపేస్తున్నా.



మీకు చాలా పొగరు.. అందుకే అవకాశాలు రావడం లేదని అంటారు!

'ఆర్య' చిత్రం చేసిన తర్వాత ఆ క్యారెక్టర్ నుంచి బయటకు రావడానికి చాలా టైమ్ పట్టింది. ఆ స్పీడ్, ఆ పొగరు లోపల అలాగే ఉండిపోయాయి. నేను ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడను. అందుకే పొగరు అనుకుంటారు. కానీ అది నిజం కాదు. నాకు సిగ్గు ఎక్కువ. కొత్తవాళ్లతో తొందరగా కలవలేను. దాన్ని కరెక్ట్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా.

పరిశ్రమలో మీకు స్నేహితులు ఎవరు?

చాలా మంది ఉన్నారు కానీ మొదటి నుంచీ రాజీవ్ కనకాలతో అనుబంధం ఉంది. అలాగే సీనియర్ నరేశ్ చాలా క్లోజ్. మంచు విష్ణు మంచి స్నేహితుడు. మోహన్‌బాబుగారు గొప్ప స్నేహితుడు. హైదరాబాద్‌లో ఉంటే ప్రతి రోజూ ఆయన్ని కలుస్తా.

మీ పిల్లల గురించి చెప్పండి

మా పెద్దబ్బాయి ఇటీవల టెన్త్ పాస్ అయ్యాడు. 81 పర్సంట్ వచ్చింది. కానీ వాడికి అది చాల్లేదు. వచ్చే ఏడాది మరిన్ని మార్కులు సంపాదించుకుందాం అని నచ్చజెప్పా.. చదువు విషయంలో తనకు ఎవరెవరు హెల్ప్ చేశారో వారందరితో ఇటీవల ఓ గెట్ టు గెదర్ నిర్వహించాం. చిన్నోడు సిక్స్త్ క్లాస్ చదువుతున్నాడు.

మీ కొత్త సినిమాలు ఏమిటి?

ఆగస్టు నుంచి మోహన్‌బాబుగారు నిర్మించే చిత్రం మొదలవుతుంది. లీడ్ రోల్ నాదే. అద్భుతమైన సబ్జెక్ట్. అది కాకుండా మరో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. రెక్కీ 2 వెబ్ సిరీస్ త్వరలో మొదలవుతుంది. ఇంకో థ్రిల్లర్ సబ్జెక్ట్ రెడీ అవుతోంది.

• వినాయకరావు





సుమారు 300 ఏళ్ల క్రితం సాధారణ మనుషులు ఎలాంటి దుస్తులు ధరించేవారు? అవి ఏ రంగులో ఉండేవి? వాటిని ఎలా కుట్టేవారు? ఇలాంటివన్నీ ఆసక్తికరమైన ప్రశ్నలు. చారిత్రాత్మక సినిమాలు చూసినప్పుడు వాటికి సంబంధించిన కొన్ని సమాధానాలు లభిస్తాయి. ఈ నెల 12న విడుదల కాబోతున్న పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' సినిమా కూడా ఈ కోవకు చెందినదే! ఈ సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరించిన ఐశ్వర్యను 'నవ్య' పలకరించినప్పుడు ఆమె అనేక అంశాలను వెల్లడించారు.

చిన్న తేడానైనా పసిగట్టేస్తున్నారు...

చారిత్రాత్మక సినిమాలకు దుస్తులను డిజైన్ చేయటం ఒక సవాలు కదా... మీరు ఈ ప్రాజెక్టును ఎలా చేపట్టారు?

గతంలో 'కంచె', 'గౌతమీపుత్ర శాతకర్ణి' మొదలైన చారిత్రాత్మక సినిమాలకు కూడా నేను డిజైనర్‌గా పనిచేశాను. వీటితో పాటుగా కొన్ని సీరియల్స్‌లోని పాత్రలకు కూడా దుస్తులు డిజైన్ చేశాను. అందువల్ల చరిత్రకు సంబంధించిన అంశాలపై నాకు అవగాహన ఉంది. చరిత్రను జాగ్రత్తగా గమనిస్తే... ఆ సమయంలో ప్రజలు వేసుకొనే దుస్తులకు సంబంధించిన అనేక విషయాలు తెలుస్తాయి. ఇక ఈ ప్రాజెక్టు విషయానికి వస్తే- డైరెక్టర్ క్రిష్ నాకు సినిమా కథ వివరించారు. ఆ తర్వాత కళ్యాణ్‌గారికి దుస్తులు డిజైన్ చేయాలని చెప్పారు. నాకు చాలా భయం వేసింది. ఎందుకంటే కళ్యాణ్‌గారు ఒక ట్రెండ్ సెట్టర్. అభిమానులు చాలా ఎక్కువ. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని దుస్తులు డిజైన్ చేయాలి. 16, 17 శతాబ్దాలలో దక్షిణ భారత దేశంలో వీరులు ఎలాంటి దుస్తులు వేసుకొనేవారనే విషయంపై కొంత అధ్యయనం చేశాం. వారు మామూలు సమయంలో ఎలా ఉండేవారు? యుద్ధాలకు వెళ్లేటప్పుడు ఎలాంటి దుస్తులు వేసుకొనేవారు? వాటిపై ఎలాంటి ఆభరణాలు పెట్టుకొనేవారు?లాంటి అనేక కోణాలలో ఆలోచించి కొన్ని స్కెచ్‌లు వేసుకున్నాం. వాటి ఆధారంగా దుస్తులు కుట్టించి కళ్యాణ్‌గారిపై ట్రయల్ వేశాం. మొదటి రోజు చిన్న చిన్న మార్పులతో అన్నింటికీ ఆయన ఓకే చెప్పేశారు. ఆ తర్వాత షూటింగ్‌కు వెళ్లాం.



> 17వ శతాబ్దంలో ఎలాంటి దుస్తులు వేసుకొనేవారనే విషయంలో మనకు అనేక రిఫరెన్స్‌లు ఉన్నాయి. ఔరంగజేబు ఎలా ఉండేవాడు? ఎలాంటి దుస్తులు వేసుకొనేవాడనే విషయం కూడా మనకు తెలుసు. కానీ ఈ సినిమాలో వీరమల్లు ఒక ఊహాజనితమైన పాత్ర. అతను దక్షిణాదికి చెందిన ఒక వీరుడు. దాన్ని దృష్టిలో పెట్టుకొని అతనికి జుబ్బా, ధోవతితో ప్రత్యేక డ్రస్సు తయారుచేశాం. జుబ్బా మీద ఒక కోటులాంటిది కూడా వేశాం. దానితో పాటుగా ఊళ్లలో సాధారణంగా ఒక గుడ్డను తలకు చుట్టుకుంటారు. దాన్ని అవసరమైతే నడుముకు కట్టుకుంటారు. మేము ఈ గుడ్డను మెడలో వేశాం. నడుముకు కూడా కట్టాం. ఇక ఆభరణాల విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకున్నాం. కళ్యాణ్‌గారి ఈ లుక్‌కు విపరీతమైన స్పందన లభించింది.

ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి ఐదేళ్లు దాటిపోయింది. ఇంతకాలం దుస్తుల్ని పరిరక్షించటం కష్టం కాలేదా?

2020 ఫిబ్రవరి 4వ తేదీన షూటింగ్ మొదలైంది. 'కొల్లగొట్టిన..' సాంగ్ 70 శాతం చిత్రీకరణ అయ్యేసరికి కొవిడ్ లాక్‌డౌన్ వచ్చింది. దాంతో షూటింగ్ ఆగిపోయింది. 2021లో మళ్లీ షూటింగ్ మొదలుపెట్టాం. రెండు, మూడు నెలలకే లాక్‌డౌన్ ప్రకటించారు. మళ్లీ షూటింగ్ ఆగిపోయింది. ఆ తర్వాత కళ్యాణ్‌గారు రాజకీయాలలో బిజీ అయిపోయారు. దీంతో షూటింగ్ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో దుస్తుల్ని జాగ్రత్త చేయటం చాలా కష్టమయింది. ఎందుకంటే- ఈ సినిమాలో కేవలం కాటన్ దుస్తులను వాడాం. ఇవన్నీ సహజమైన రంగులతో తయారుచేసినవి. ఎక్కువ కాలం వదిలేస్తే వాటి మెరుపు తగ్గిపోతుంది. ఉదాహరణకు 'కొల్లగొట్టిన...' పాట షూటింగ్ అర్ధాంతరంగా ఆగిపోయింది. మళ్లీ షూటింగ్ ప్రారంభించే సమయానికి కొన్ని దుస్తులు పాడైపోయాయి. వాటిని తిరిగి కుట్టాల్సి వచ్చింది. ఈ తరహా సందర్భాలు కొన్ని ఎదురయ్యాయి. ఇదంతా చాలా శ్రమతో కూడిన వ్యవహారం.

చారిత్రాత్మక సినిమా అంటే జూనియర్ ఆర్టిస్టుల సహా అందరికీ ప్రత్యేకమైన దుస్తులు కుట్టాలి కదా.. ఎన్ని వేల మీటర్ల వస్త్రం వాడి ఉంటారు?

కచ్చితమైన లెక్క చెప్పలేను కానీ 30 వేల మీటర్ల కన్నా ఎక్కువ వస్త్రం వాడి ఉంటాం. అన్ని వేల మీటర్లు వాడారా? అని చాలామంది ఆశ్చర్యపోతూ ఉంటారు. మీకు ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. ఈ సినిమాలో ఒక పాటలో 350 మంది డ్యాన్సర్లు ఉన్నారు. ఒక్కొక్కరికి ప్రత్యేకమైన డ్రస్సు కుట్టాలంటే 9 మీటర్లు పడుతుందనుకుందాం. అంటే 3150 మీటర్లు అవుతుంది. వీరితో పాటు కొందరు జూనియర్ ఆరిస్టులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు, ఇతరులు కూడా ఉంటారు. వీరికి కూడా ప్రత్యేకంగానే కుట్టాలి కదా! అంతా కలిపితే 3500 మీటర్లు అయిందనుకుందాం.. తలపాగాల లెక్క వేరు. ఒక తలపాగ చుట్టాలంటే 20 మీటర్ల వస్త్రం అవసరమవుతుంది. వీటితో పాటుగా రకరకాల సీన్లు, ఫైట్లు కూడా ఉంటాయి కదా! ఒక ఫైట్ సీక్వెన్స్‌ను తీసుకుంటే వాటిలో దుస్తులు పాడైపోయే అవకాశం ఎక్కువ ఉంటుంది. అందువల్ల హీరోకు, ఆయన బాడీ డబుల్ (డూప్)కు కలిపి ఆరేడు జతలు రెడీగా ఉంచుకుంటాం. మనకు అత్యాధునికమైన కెమేరాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఏ చిన్న తేడా వచ్చినా ప్రేక్షకులు పసికట్టేస్తున్నారు. అందువల్ల దుస్తుల విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోంది.

రంగుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

ఆ సమయంలో ప్రకృతిలో ఎలాంటి రంగులు ఉన్నాయో అలాంటి రంగులే ఎక్కువగా వేసుకొనేవారు. అయితే ఆ రంగులన్నీ కెమేరాలో ఎలా కనిపిస్తాయో తెలియదు. అందువల్ల ముందు కొన్ని నమూనాలు తీసుకొని వాటిని సినిమాటోగ్రాఫర్‌కు, ఆర్ట్ డైరక్టర్‌కు చూపించేవాళ్లం. వాళ్లతో చర్చించిన తర్వాత వేర్వేరు పాత్రలకు రంగులు నిర్ణయించాం. అలాగే అన్ని పాత్రలకు ఒకే విధమైన దుస్తులను కుట్టించలేం. ఉదాహరణకు గ్రామంలో నివసించే గ్రామీణులను తీసుకుందాం. వారు మెరిసే దుస్తులు వేసుకోరు. అవి ఎక్కువ మెరవకుండా ముతకగా కనిపించాలి. హీరో, హీరోయిన్, ముఖ్యమైన పాత్రల దుస్తులలో కొంత మెరుపు ఉండాలి. వారు పెట్టుకున్న ఆభరణాలకు తగినట్లు ఉండాలి. అందువల్ల మేము తెల్ల వస్త్రాన్ని తీసుకొని, దానికి మాకు అవసరమైన రంగులను వేయించుకొని వాటితో దుస్తులు కుట్టేవాళ్లం. ఈ సినిమాలో కళ్యాణ్‌గారి కోసం చేసిన డిజైన్లను చేతితోను కుట్టాం. ఒకో డ్రస్సు కుట్టడానికి ఆరు నుంచి ఎనిమిది రోజులు పట్టేది.

> సాధారణంగా సినిమా పూర్తయిన వెంటనే దుస్తులన్నీ ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లిపోతాయి. వారు మంచి దుస్తులను వేరు చేసి, ఉతికించి జాగ్రత్తగా భద్రపరుస్తారు. భవిష్యత్తులో అవసరమైనప్పుడు తిరిగి వాడతారు. చారిత్రాత్మక సినిమాల్లో దుస్తులను బయట ఎవరు వాడలేరు కాబట్టి జాగ్రత్తగా భద్రపరుస్తూ ఉంటాం. కొన్నిసార్లు 'సురభి' వంటి సంస్థలకు ఉచితంగా ఇచ్చేస్తాం. 'గౌతమీపుత్ర శాతకర్ణి' సినిమాలో వాడిన దుస్తులను 'సురభి' వారికే ఇచ్చేశాం. వాటిని వారు తమ నాటకాలలో వాడారు.

> మొత్తం సినిమా బడ్జెట్‌లో రెండు నుంచి మూడు శాతం దుస్తులకు పెడితే మంచి క్వాలిటీ అవుట్‌పుట్ వస్తుంది. ఒక కోటి రూపాయలు పెడితే పది కోట్ల రూపాయల విలువ ఉన్న దుస్తులు వేసుకున్న అనుభూతి కలగాలి. అప్పుడే కాస్ట్యూమ్ డిజైనర్ విజయవంతం అయినట్లు లెక్క.

షూటింగ్‌లో మీరు మరచిపోలేని అనుభవం?

కళ్యాణ్‌గారు చాలా మితభాషి. ఎవరితోను ఎక్కువగా మాట్లాడరు. మొదట్లో నాతో కూడా ఏమి మాట్లాడేవారు కాదు. నేను ప్రతిరోజూ లొకేషన్‌లో ఉండి అందరిని సరైన దుస్తులు, ఇతర ఆభరణాలు అందాయా? లేదా? అని చూసుకుంటూ ఉండేదాన్ని. ఒక రోజు పని అయిపోయిన తర్వాత కళ్యాణ్‌గారి టెంట్ దగ్గరకు వచ్చి నిలబడ్డా. కళ్యాణ్ గారు వచ్చి- "ఇంతకు ముందు మీరు ఏం చేశారు?" అని అడిగారు. "నేను ఇంజనీరింగ్ చదివాను సర్.. టీచింగ్ చేసేదాన్ని. కాస్ట్యూమ్ డిజైనింగ్ అంటే నాకు ఇష్టం. దాంతో ఉద్యోగం వదిలేసి వచ్చా. 'కంచె' సినిమాతో మొదలుపెట్టాను" అని చెప్పాను. "జూనియర్ ఆర్టిస్టులకు మీరు ఇస్తున్న దుస్తుల రిఫరెన్స్‌లు చూశా. వారి లుక్స్ చాలా బావున్నాయి. చారిత్రాత్మక సినిమాలకు పనిచేయటం అంత సులభం కాదు. మీరు అద్భుతంగా పనిచేస్తున్నారు" అని ప్రశంసించారు. నా జీవితంలో అతి పెద్ద ప్రశంస అది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

చిన్న సినిమాలకు పెద్ద గౌరవం

పద్నాలుగు సంవత్సరాల తరవాత తెలుగు చిత్ర పరిశ్రమలో అవార్డుల సందడి మళ్లీ మొదలైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'గద్దర్ సినిమా అవార్డు'లను ప్రకటించింది. ఏడాదికి మూడు చొప్పున పదేళ్ల అవార్డులను ఒకేసారి ప్రకటించారు. ఈ అవార్డులు పొందిన వాటిలో పెద్ద చిత్రాలతో పాటు చిన్న సినిమాలకు కూడా సముచిత ప్రాధాన్యం లభించింది.

ఈసారి గద్దర్ అవార్డులు పొందిన 'పొట్టేల్, బలగం, 35 చిన్న కథ కాదు, కమిటీ కుర్రోళ్లు, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, కలర్ ఫొటో' వంటి చిన్న చిత్రాలు బాక్స్ ఆఫీసు వద్ద కూడా విజయం సాధించాయి. పైగా ఈ చిత్రాలన్నీ గ్రామీణ నేపథ్యంలో తీసినవే! తెలుగు ప్రాంత సంస్కృతిని ప్రతిబింబిచేవే! ఉదాహరణకు 'కమిటీ కుర్రోళ్లు' పూర్తి గ్రామీణ నేపథ్యంలో తీసిన చిత్రం. పైగా ఈ సినిమాలో దర్శకుడు సహా అందరూ కొత్తవారే! ఈ చిత్రాన్ని తెరకెక్కించిన యదువంశీకి ఉత్తమ తొలి దర్శకుడి అవార్డు దక్కింది. ఇక '35 చిన్న కథ కాదు' ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికైంది. ఇందులో నటించిన నివేదా థామస్ ఉత్తమ నటిగా, మాస్టర్ అరుందేవ్ పోతుల, బేబీ హారిక ఉత్తమ బాల నటులుగా అవార్డులు కైవసం చేసుకున్నారు. ఈ సినిమాలో పిల్లలతోపాటు తల్లిదండ్రులు, సమాజం నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాలను చర్చించారు. తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో తెరకెక్కిన 'బలగం' ఇటు ప్రేక్షకులు, అటు విమర్శకుల ప్రశంసలు పొందింది. ఈ సినిమా కథ చావు చుట్టూ తిరుగుతుంది. పల్లెల్లో బంధాలు, అనుబంధాలు ఎంత గొప్పగా ఉంటాయో చాటి చెప్పింది. కంటెంట్ బావున్న సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఉంటుందనే విషయాన్ని ఈ చిత్రం చెప్పకనే చెప్పింది. సమాజంలోని అంతరాలు, పరువు, ప్రేమ నేపథ్యంలో వచ్చిన



'అంబాజీపేట మ్యారేజ్ బ్యూరో' పెద్ద విజయమే సాధించింది. కులాల మధ్య అంతరాన్ని, ఆర్థిక అసమానతలను ఈ చిత్రంలో దర్శకుడు చక్కగా ఆవిష్కరించారు. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఏటా మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేయడం సినీ అభిమానుల్లో ఆసక్తిని కలిగించింది. ఉత్తమ కేటగిరీ చిత్రంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలను ప్రకటించారు. ఇలా ఎంపిక చేసిన 30 సినిమాల్లో సింహ భాగం సూపర్ హిట్ అయినవే. మొదటి ఉత్తమ చిత్రాలుగా ఎంపికైన 'రన్ రాజా రన్, రుద్రమదేవి, శతమానం భవతి, బాహుబలి, మహానటి, మహర్షి, అల వైకుంఠపురములో, ఆర్ఆర్ఆర్, సీతా రామం' మొదలైనవి ప్రేక్షకుల ఆదరణతో పాటుగా బాక్స్‌ఆఫీసు విజయాలు కూడా సాధించాయి.

బాలయ్యకు 3 అవార్డులు

ఈ అవార్డుల్లో మరో గొప్ప విశేషం ఏమిటంటే.. 2021 సంవత్సరానికి గాను నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ' రెండో ఉత్తమ చిత్రంగా, 2023లో 'భగవంత్ కేసరి' మూడో ఉత్తమ చిత్రంగా ఎంపికయ్యాయి. వీటితోపాటు ఎన్టీఆర్ జాతీయ అవార్డు సైతం బాలకృష్ణను వరించింది. బాలయ్య నటుడిగా 50 ఏళ్ల స్వర్ణోత్సవం పూర్తి చేసుకున్న శుభతరుణాన ఒకేసారి మూడు అవార్డులు రావడం నిజంగా విశేషమే.



పదే పదే కడగకూడదా?

మన శరీరంలో కొన్ని భాగాలు చాలా సున్నితంగా ఉంటాయి. పరిశుభ్రత పేరుతో వాటిని పదేపదే కడిగితే అనారోగ్య సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు.

- కొంతమంది... జిడ్డుగా ఉందనో మొటిమలు వస్తున్నాయనో ముఖాన్ని పదే పదే సబ్బుతో రుద్ది కడుగుతూ ఉంటారు. దీనివల్ల ముఖం మీద ఉండే సహజ నూనెలు తొలగిపోయి చర్మం పొడిబారుతుంది. ముఖం మృదుత్వాన్ని కోల్పోతుంది. ముఖాన్ని రోజుకు మూడుసార్ల కంటే ఎక్కువగా కడగకూడదు.
- ముక్కులోపలి భాగాన్ని కూడా ఎక్కువగా శుభ్రం చేయకూడదు. ఇక్కడ... లోపలికి ప్రవేశించే గాలిని శుభ్రపరచి చుట్టూ తేమగా ఉంచే పొర ఉంటుంది. ముక్కును ఎక్కువగా నీళ్లతో శుభ్రం చేస్తూ ఉంటే ఈ పొర దెబ్బతింటుంది. దీంతో దుమ్ము కణాలు శ్వాస నాళాల్లోకి చేరి తుమ్ములు, దగ్గు లాంటి శ్వాసకోశ సమస్యలను కలిగిస్తాయి.
- కంటి చుట్టూ నల్లని వలయాలు వచ్చాయని, వేళ్ల మధ్య మురికి చేరిందని ఆ ప్రదేశాలను అతిగా రుద్దకూడదు. ఈ భాగాల్లో చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. శుభ్రత పేరుతో మాటిమాటికీ సబ్బుతో కడుగుతూ ఉంటే చర్మం పొరలు బలహీనమై ఇన్ఫెక్షన్లు సోకవచ్చు.
- జననేంద్రియాలను కూడా సబ్బు లేదా షాంపూతో పదేపదే శుభ్రం చేయకూడదు. అలా చేస్తే ఆ భాగాల్లోని పీహెచ్ స్థాయిలు దెబ్బతిని దురద, మంట లాంటి సమస్యలు ఏర్పడవచ్చు. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే చాలు.

సింగపూర్ ఓపెన్

సెమీస్‌లో సాత్విక్ జంటకు షాక్

సింగపూర్: సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి కథ ముగిసింది. శనివారం జరిగిన సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-19, 10-21, 18-21తో మలేసియాకు చెందిన ఆరన్ చియా-సో వు యిక్ చేతిలో ఓటమి పాలైంది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌లో సాత్విక్ జోడీ నెగ్గినా.. ఆ తర్వాతి గేమ్‌లో ధాటిగా ఆడిన ప్రత్యర్థి ద్వయం ఆ గేమ్‌ను గెలిచి స్కోరు సమం చేసింది. నిర్ణాయక ఆఖరి గేమ్‌లో 11-20తో వెనుకంజలో ఉన్నప్పుడు వరుసగా ఏడు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొన్న సాత్విక్ జంట సమం చేసేందుకు తీవ్రంగా పోరాడింది. కానీ, ఉత్కంఠ మధ్య ఆఖరి పాయింట్ సాధించిన మలేసియా జంట గేమ్‌తో పాటు మ్యాచ్‌ను నెగ్గి ఫైనల్‌కు దూసుకెళ్లింది.

రెజా @ రూ. 2.23 కోట్లు

- టాప్ లేపిన ఇరాన్ ఆల్‌రౌండర్
- దేవాంక్‌కు రూ. 2.20 కోట్లు

ప్రో కబడ్డీ వేలం


మహమ్మద్ రెజా

ముంబై: ప్రో కబడ్డీ సీజన్-12 వేలంలో ఇరాన్ ఆల్‌రౌండర్ మహమ్మద్ రెజా టాప్ లేపాడు. శనివారం జరిగిన తొలిరోజు వేలంలో గుజరాత్ జెయింట్స్ భారీ ధర రూ. 2.23 కోట్లకు రెజాను కొనుగోలు చేసింది. అతడు వేలంలో 2 కోట్ల మార్క్ దాటడం ఇది వరుసగా మూడోసారి. కాగా, గత సీజన్ బెస్ట్ రైడర్ దేవాంక్ దలాల్ అత్యధికంగా రూ. 2.20 కోట్లకు అమ్ముడైన భారత ఆటగాడిగా నిలిచాడు. దేవాంక్ కోసం పుణె తీవ్రంగా పోటీపడినా.. భారీ ధరకు బెంగాల్ వారియర్స్ దక్కించుకొంది. అషు మాలిక్‌ను దబాంగ్ ఢిల్లీ ఫైనల్ బిడ్ టు మ్యాచ్ కింద రూ. 1.90 కోట్లకు తిరిగి దక్కించుకోగా.. రెయిడ్ మెషీన్ అర్జున్ దేశ్వాల్‌ను తమిళ్ తలైవాస్ రూ. 1.40 కోట్లకు ఖరీదు చేసింది. మొత్తంగా మొదటి రోజు వేలంలో 10 మంది ఆటగాళ్లు కోటికిపైగా ధరపలికారు. కాగా, ఇరాన్ స్టార్ డిఫెండర్ ఫజల్ అత్రాచెలిని కనీస ధర రూ. 30 లక్షలకు ఢిల్లీ కొనుగోలు చేసింది. ఇక, భారత జట్టు కెప్టెన్ పవన్ కుమార్ షెహ్రావత్‌పై ఫ్రాంచైజీలు పెద్దగా ఆసక్తి చూపలేదు. అతడు అన్‌సోల్డ్‌గా మిగులుతాడనుకొన్న సమయంలో ఢిల్లీ, బెంగాల్ పోటీపడ్డాయి. కానీ, తమిళ్ తలైవాస్ రూ. 59.50 లక్షలకు సొంతం చేసుకొంది. డిఫెండర్ శుభం షిండేను తెలుగు టైటాన్స్ రూ. 80 లక్షలకు దక్కించుకొంది. కాగా, పట్నాకు మూడు వరుస టైటిళ్లు అందించిన పర్‌దీప్ నర్వాల్ అన్‌సోల్డ్‌గా మిగలడం గమనార్హం.

ఫైనల్‌కు ఇంటికి ఎవరు?

- ముంబైతో పంజాబ్ అమీతుమీ
- నేడు క్వాలిఫయర్-2 పోరు

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

అహ్మదాబాద్: తాజా ఐపీఎల్ సీజన్ ముగింపు దశకు చేరింది. ఆదివారం క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. గెలిచిన జట్టు ఈనెల 3న జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఎదుర్కొంటుంది. ఇక, ఇరుజట్లలోనూ బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా కనిపిస్తుండడంతో అభిమానులు హోరాహోరీ పోరును ఆశిస్తున్నారు. క్వాలిఫయర్1లో ఆర్‌సీబీ చేతిలో ఓడిన పంజాబ్‌కు ఫైనల్ చేరేందుకిది రెండో అవకాశం. ఐపీఎల్‌లో పంజాబ్ 2014లో తుది పోరుకు అర్హత సాధించింది. మళ్లీ 11 ఏళ్ల తర్వాత అదే ఫీట్ సాధించి తొలిసారి కప్‌ను ముద్దాడాలనే ఆశతో ఉంది. అటు ముంబై జట్టు ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి ఫైనల్ బెర్త్‌పై కన్నేసింది. ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన ముంబై.. చివరిసారి 2020లో విజేత కాగలిగింది. లీగ్ దశలో ఈ రెండు జట్ల మధ్య జరిగిన పోరులో పంజాబే నెగ్గడంతో తాజా పోరులో హార్దిక్ సేన ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది.


కెప్టెన్లు శ్రేయాస్, హార్దిక్

ఒత్తిడి లేకుండా ఆడితేనే..

టేబుల్ టాపర్‌గా ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టిన పంజాబ్.. క్వాలిఫయర్-1లో మాత్రం ఆర్‌సీబీ చేతిలో పూర్తిగా చిత్తయ్యింది. హార్డ్ హిట్టర్లతో కూడిన కింగ్స్ బ్యాటింగ్ ఆర్డర్ కనీసం 100 పరుగులు చేసేందుకే కష్టపడాల్సి వచ్చింది. అటు బెంగళూరు పది ఓవర్లలోనే ఛేదనను పూర్తి చేయడం పంజాబ్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసినట్టయ్యింది. ఇప్పుడు ముంబై రూపంలో వారి ముందు అతిపెద్ద గండం ఉంది. అయితే కెప్టెన్ శ్రేయాస్, కోచ్ పాంటింగ్ ఆధ్వర్యంలో వ్యూహాత్మకంగా ముందుకు సాగాలనే ఆలోచనలో ఉంది. ఈ సీజన్‌లో ఆడిన 15 మ్యాచ్‌ల్లో ఏడుసార్లు 200+ స్కోర్లు సాధించింది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ మెరుపు ఆరంభాన్నిస్తుండగా.. ఇన్‌గ్లిస్, శ్రేయాస్, స్టొయినిస్, నేహల్, శశాంక్ రూపంలో బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తోంది. కానీ ముంబై బౌలింగ్ బలం ముందు వీరి నిలకడ ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందే. పేసర్ జాన్సెన్ స్వదేశానికి వెళ్లడంతో అర్ష్‌దీప్‌పైనే భారం పడనుంది. గత మూడు మ్యాచ్‌లకు దూరమైన స్పిన్నర్ చాహల్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నాడు.

జోష్‌లో హార్దిక్ సేన

ఆరంభంలో అపజయాలు ఎదురైనా ఆ తర్వాత ముంబై ఇండియన్స్ చాంపియన్స్ ఆటతీరును ప్రదర్శించింది. వరుస విజయాలతో ప్లేఆఫ్స్‌కు దూసుకురాగలిగింది. ఇప్పుడు ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించిన జోష్‌లో పంజాబ్‌ను ఎదుర్కొనేందుకు ఉవ్విళ్లూరుతోంది. అటు బ్యాటింగ్ ఇటు బౌలింగ్‌లో ఈ జట్టు ఎదురులేకుండా ఉంది. రోహిత్‌తో పాటు బెయిర్‌స్టో చెలరేగడం జట్టుకు శుభసూచకం. మిడిలార్డర్‌లో సూర్యకుమార్, తిలక్, నమన్, హార్దిక్ ఎదురుదాడితో భారీ స్కోర్లు సాధించగలుగుతుంది. ఇక పేసర్ బుమ్రా జట్టు ప్రధాన ఆయుధంగా చెప్పవచ్చు. శుక్రవారం మ్యాచ్‌లో గుజరాత్‌ను సరైన సమయంలో దెబ్బతీసి తమ జట్టు విజయానికి బాట వేసిన సంగతి తెలిసిందే. పంజాబ్‌కు కూడా తనే ప్రమాదకారి అనడంలో సందేహం లేదు. ఇక బౌల్ట్ పవర్‌ప్లేలోనే ప్రత్యర్థి వెన్నువిరుస్తున్నాడు. కొత్త పేసర్ గ్లీసన్ కూడా ఆకట్టుకోవడం జట్టుకు సానుకూలాంశం కానుంది.

పిచ్, వాతావరణం

ఈ సీజన్‌లో ఇక్కడ ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఆరుసార్లు మొదట బ్యాటింగ్‌కు దిగిన జట్టే గెలిచింది. అలాగే తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 173గా ఉంది. పిచ్ పేసర్లతో పాటు స్పిన్నర్లకు కూడా అనుకూలించనుంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

తుది జట్లు (అంచనా)

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహల్ వధేరా, శశాంక్ సింగ్, స్టొయినిస్, ఒమర్జాయ్, హర్‌ప్రీత్, జేమిసన్, చాహల్.

ముంబై: రోహిత్, బెయిర్‌స్టో, సూర్యకుమార్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), నమన్ ధిర్, శాంట్నర్, అశ్వని, గ్లీసన్, బుమ్రా, బౌల్ట్.

నిత్య బృందానికి రజతం

- ఆఖరి రోజు ఆరు
- ఆసియా అథ్లెటిక్స్

24 పతకాలతో భారత్‌కు రెండోస్థానం


నిత్య గంధె

గుమి: ప్రతిష్ఠాత్మక ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి నిత్య గంధె రజత పతకంతో మురిసింది. అయితే మరో తెలుగు అథ్లెట్ జ్యోతి యర్రాజి 200 మీటర్ల పరుగులో నిరాశ పరిచింది. ఇక..శనివారం చివరి రోజు భారత్ 3 రజతాలు, 3 కాంస్యాలతో మొత్తం ఆరు పతకాలు సొంతం చేసుకుంది. మహిళల 4x100 మీటర్ల రిలేలో హైదరాబాద్‌కు చెందిన నిత్య గంధె, అభినయ, స్నేహ, సర్బాని నందతో కూడిన భారత జట్టు 43.86 సెకన్ల టైమింగ్‌తో రేస్‌ను పూర్తి చేసి రజత పతకం కైవసం చేసుకుంది. మహిళల 200 మీటర్ల పరుగు ఫైనల్లో జ్యోతి యర్రాజి 23.47 సెకన్ల టైమింగ్‌తో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. చాంపియన్‌షిప్‌లో ఇంతకుముందు మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి స్వర్ణ పతకం గెలిచిన సంగతి తెలిసిందే. అయితే 200 మీటర్లలోనూ పోటీపడిన నిత్య 23.90 సెకన్లతో రేస్‌ను ముగించి ఏడో స్థానంలో నిలిచింది. మహిళల ఐదు వేల మీటర్ల పరుగులో పారుల్ చౌధురి 15 నిమిషాల 15.53 సెకన్ల టైమింగ్‌తో రజత పతకం చేజిక్కించుకుంది. ఇప్పటికే 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లోనూ పారుల్ రజతం నెగ్గింది. పురుషుల 200 మీటర్ల పరుగులో అనిమేష్, మహిళల 800 మీటర్ల రేసులో పూజ, మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విద్య రామ్‌రాజ్ కాంస్య పతకాలను భారత్ ఖాతాలో చేర్చారు. జావెలిన్ త్రోలో సచిన్ యాదవ్ 85.16 మీటర్ల దూరంతో రజత పతకం సాధించాడు. పాకిస్థాన్‌కు చెందిన పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ అర్షద్ నదీమ్ (86.40 మీ.) స్వర్ణం నెగ్గాడు. ఇక..ఈ చాంపియన్‌షిప్‌ను భారత్ మొత్తం 24 పతకాలతో (8 స్వర్ణాలు, 10 రజతాలు, 6 కాంస్యాలు) ఓవరాల్‌గా రెండో స్థానంతో ముగించింది. 19 పసిడి, 9 రజత, 4 కాంస్యాలతో కలిపి మొత్తం 32 పతకాలతో చైనా అగ్రస్థానంలో నిలిచింది. 5 స్వర్ణ, 11 రజత, 12 కాంస్యాలతో ఓవరాల్‌గా 28 పతకాలు సాధించిన జపాన్‌కు రెండోస్థానం దక్కింది.

కరుణ్ డబుల్ సెంచరీ

భారత్ 'ఎ' 557

కాంటర్‌బరీ: కరుణ్ నాయర్ (204) తన సూపర్ ఫామ్‌ను డబుల్ సెంచరీతో చాటుకున్నాడు. దీంతో ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న తొలి అనధికార టెస్టులో భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 557 పరుగులకు ఆలౌటైంది. అయితే ధ్రువ్ జురెల్ (94) తృటిలో శతకం కోల్పోయాడు. హర్ష్ దూబే (32), శార్దూల్ (27) పర్వాలేదనిపించారు. ఆ తర్వాత బరిలోకి దిగిన ఇంగ్లండ్ లయన్స్ రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 52 ఓవర్లలో 2 వికెట్లకు 237 పరుగులు చేసింది. ఓపెనర్ టామ్ హైనెస్ (103 బ్యాటింగ్) సెంచరీ, మాక్స్ హోల్డెన్ (64 బ్యాటింగ్) హాఫ్ సెంచరీ సాధించారు.

ముంబైలో ఇళ్ల ధరల్లాగే.. బుమ్రా కూడా!



ముల్లాన్‌పూర్: బ్యాట్‌తో రోహిత్ శర్మ.. బంతితో బుమ్రా అదరగొట్టడంతో ముంబై ఇండియన్స్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్‌పై గెలిచింది. ఈ నేపథ్యంలో మ్యాచ్ ముగిసిన తర్వాత వీరిద్దరిపై ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా ప్రశంసలు కురిపించాడు. 'ముంబైలోని ఇళ్ల ధరల తరహాలో.. బుమ్రా కూడా ఎంతో విలువైన వాడు' అని హార్దిక్ కొనియాడాడు. మ్యాచ్ చేజారుతుందనే అనుమానం కలిగితే.. వెంటనే బుమ్రాను రంగంలోకి దించుతానన్నాడు. ఆ మ్యాచ్‌లో సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ ధాటిగా ఆడతూ గుజరాత్ విజయంపై ఆశలు రేపారు. ఈ దశలో బౌలింగ్‌కు దిగిన బుమ్రా.. కళ్లుచెదిరే యార్కర్‌తో సుందర్‌ను బౌల్డ్ చేయడంతో మ్యాచ్‌పై ముంబై పట్టు బిగించిన సంగతి తెలిసిందే.


ఆండ్రీవా

ప్రీక్వార్టర్స్‌కు సినర్, గాఫ్

అల్కారజ్, జ్వెరెవ్, ఆండ్రీవా, పెగులా కూడా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో సీడెడ్ల పయనం సాఫీగా సాగుతోంది. పురుషుల టాప్‌సీడ్ సినర్, రెండోసీడ్ అల్కారజ్, మూడోసీడ్ జ్వెరెవ్, ఐదోసీడ్ డ్రేపర్, మహిళల రెండోసీడ్ కొకొ గాఫ్, మూడోసీడ్ పెగులా, ఆరోసీడ్ మిర్రా ఆండ్రీవా ప్రీక్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. శనివారం జరిగిన సింగిల్స్ మూడో రౌండ్‌లో సినర్ 6-0, 6-1, 6-2తో లెహకాపై, జ్వెరెవ్ 6-2, 7-6 (4), 6-1తో కొబోలీపై, డ్రేపర్ 6-2, 6-4, 6-2తో ఫొనెస్కాపై, అల్కారజ్ 6-1, 6-3, 4-6, 6-4తో జుముర్‌పై నెగ్గారు. మహిళల సింగిల్స్‌లో గాఫ్ 6-1, 7-6(3)తో బౌస్కోవాను, పెగులా 3-6 6-4, 6-2తో వోండ్రొసోవాని, ఆండ్రీవా 6-3, 6-1తో పుటింట్సేవాని ఓడించారు. 10వ సీడ్ బడొసాకు 6-1, 7-5తో 17వ సీడ్ కసట్కినా షాకిచ్చింది.

బాలాజీ జోడీ అవుట్: పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో శ్రీరామ్ బాలాజీ/మిగ్వెల్ రేయస్ (కెనడా) ద్వయం 3-6, 4-6తో ఇటలీ జంట సిమోన్/ఆండ్రియా చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

బిజినెస్ ప్లస్

కెనరా బ్యాంక్ పొదుపు ఖాతాలకు

'మినిమం బ్యాలెన్స్' రుసుము రద్దు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగానికి చెందిన కెనరా బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. పొదుపు ఖాతాలు, శాలరీ అకౌంట్లు, ఎన్‌ఆర్‌ఐ సేవింగ్స్ అకౌంట్లకు మినిమం బ్యాలెన్స్ చార్జీని రద్దు చేస్తున్నట్లు, జూన్ ఒకటి నుంచి ఇది అమలులోకి వస్తుందని బ్యాంక్ తెలిపింది. దీంతో బ్యాంక్ ఖాతాదారులు తమ సేవింగ్స్ అకౌంట్లో కనీస నగదును నిర్వహించకపోయినప్పటికీ ఎలాంటి జరిమానా లేదా రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదని కెనరా బ్యాంక్ స్పష్టం చేసింది. ఇంతక్రితం బ్యాంక్ ఖాతాదారులు తమ పొదుపు ఖాతాల్లో కనీస నిల్వను ఉంచాల్సి వచ్చేది. ఖాతాలోని కనీస నిల్వ నెల రోజుల సగటు బ్యాంక్ నిర్దేశిత పరిమితి కంటే తగ్గితే పెనాల్టీ చెల్లించాల్సి వచ్చేది.

సంగీత 51వ వార్షికోత్సవ ఆఫర్లు



సంగీత వ్యవస్థాపకులు నారాయణ రెడ్డితో ఎండీ సుభాష్ చంద్ర, డైరెక్టర్ చందు రెడ్డి

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): రిటైల్ మొబైల్ వ్యాపారంలో కీలకంగా ఉన్న 'సంగీత' మొబైల్స్ 51వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ సందర్భంగా సంగీత వ్యవస్థాపకులు ఎల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. సంగీత వార్షికోత్సవం కోసం ఏటా వినియోగదారులు ఎదురు చూసేలా పలు ఆఫర్లు ప్రకటిస్తున్నామన్నారు. 51వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంగీత మొబైల్ స్టోర్‌ను సందర్శించే ప్రతి ఒక్కరికి వ్యాలెట్ ద్వారా రూ.5,001 మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేయనున్నట్లు తెలిపారు. మొబైల్‌తో పాటు ఏ వస్తువు కొనుగోలు చేసినా ఆఫర్ కింద రూ.2,500 వరకు వ్యాలెట్ నుంచి జమ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా మారుతున్న కాలానికి అనుగుణంగా మొబైల్స్‌తో పాటు అన్ని రకాలైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు అందుబాటులోకి తెచ్చినట్లు సంగీత డైరెక్టర్ చందు రెడ్డి తెలిపారు. ఢిల్లీ, ముంబైలతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోని తమ షోరూమ్స్‌ల్లో మొబైల్ కొనుగోలు చేస్తే 30 నిమిషాల్లో డోర్ డెలివరీ చేస్తున్నట్లు చందు తెలిపారు.

జూన్‌లో వచ్చే ఆర్థిక మార్పులివే..

జూన్‌లో ఫైనాన్షియల్ మార్కెట్లో పలు మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సొమ్ము ఉపసంహరణ, ఆధార్ ఉచిత అప్‌డేట్స్, క్రెడిట్ కార్డు విధానాలు సహా మరికొన్నింటిలోనూ మార్పులు చేర్పులు అమల్లోకి రానున్నాయి. అవేమిటంటే..



క్రెడిట్ కార్డులు

క్రెడిట్ కార్డుల ద్వారా విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలోని లాంజ్ సదుపాయాల్ని వినియోగించుకునే విధానాలు ఈ నెల నుంచి మారనున్నాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్: టాటా న్యూ ఇన్ఫినిటీ, టాటా న్యూ ప్లస్ క్రెడిట్ కార్డు వినియోగదారులు విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలో లాంజ్ (విశ్రమించే చోటు) సదుపాయాల్ని వినియోగించుకునే విధానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్పులు చేసింది. ఇక నుంచి ఇలా వెళ్లి అలా కార్డు స్వైప్ చేసి లాంజ్ సదుపాయాలు ఉపయోగించుకోవడం కుదరదు. తమ క్రెడిట్ కార్డు ద్వారా గత మూడు నెలల్లో చేసిన ఖర్చుల ఆధారంగా బ్యాంకులు ఇక వోచర్లు ఇస్తాయి. ఆ వోచర్ల ఆధారంగానే ఈ లాంజ్‌ల్లో ప్రవేశం లభిస్తుంది. క్రెడిట్ కార్డుల వినియోగాన్ని పెంచడంతో పాటు ప్రయోజనాల్ని క్రమబద్ధం చేసేందుకు ఈ నెల 10 నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ విధానం అమలు చేయనుంది.

యాక్సిస్ బ్యాంక్: యాక్సిస్ బ్యాంక్ ఈ నెల 20 నుంచి తన రివార్డ్ క్రెడిట్ కార్డుపై రివార్డులు, ఫీజు మినహాయింపు విధానంలో మార్పులు చేస్తోంది. ఈ కార్డులపై ఇక ఈ ప్రయోజనాలను వివిధ (రెంట్, వ్యాలెట్, ఇంధన ఖర్చులు వంటివి) ఖర్చుల ఆధారంగా నిర్ణయిస్తారు. ఇప్పటి వరకు వీటిని నాలుగు అంకెల మర్చంట్ కోడ్స్ ఆధారంగా నిర్ణయించేవారు.

కోటక్ మహీంద్రా బ్యాంక్: ఈ నెల 1 నుంచే కోటక్ మహీంద్రా బ్యాంక్ తన క్రెడిట్ కార్డుల ఫీజు విధి విధానాలను సవరించింది. స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్స్ పాటించడంలో వైఫల్యం, డైనమిక్ కరెన్సీ కన్వర్షన్ (ఇతర దేశాల్లో ప్రయాణించేటప్పుడు కార్డు ద్వారా మన దేశ కరెన్సీలోనే చెల్లించడం), కరెంట్, డీటీహెచ్, గ్యాస్ వంటి యుటిలిటీ బిల్లుల చెల్లింపులు, విద్యకు సంబంధించి చేసే లావాదేవీల చెల్లింపులు, వ్యాలెట్ టాప్ అప్స్, పెట్రోల్, డీజిల్ చెల్లింపులు, నైపుణ్యాల ఆధారిత ఆన్‌లైన్ గేమ్స్ కోసం చేసే చెల్లింపులకు సవరించిన ఈ ఫీజు విధానం వర్తిస్తుంది. దీనికి తోడు కనీస బాకీ మొత్తాన్ని (ఎంఏడీ) లెక్కించే విధానాన్నీ బ్యాంక్ మార్చివేసింది.

ఈపీఎఫ్‌ఓ 3.0

పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేయడం, నో యువర్ కస్టమర్ (కేవైసీ) అప్‌డేట్ చేయడం ఇప్పుడో పెద్ద ప్రహసనం. ఈ కష్టాలకు చెక్ పెట్టేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ).. ఈపీఎఫ్‌ఓ 3.0 పేరుతో ఈ నెల కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకురాబోతోంది. దీని ద్వారా క్లెయిమ్స్‌ను త్వరగా ప్రాసెస్ చేసే అవకాశం కల్పించనుంది. వీటికి తోడు డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బ్యాంకు ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రా చేసుకున్నట్టుగా పీఎఫ్ విత్‌డ్రాయల్స్ కోసం కూడా ప్రత్యేక కార్డులు తీసుకురానుంది.

టీడీఎస్ సర్టిఫికెట్

మీరు ఉద్యోగి అయితే ఈ నెల 15లోగా మీరు పని చేస్తున్న ఆఫీస్ నుంచి ఫారమ్-16, ఫారమ్-16ఏతో పాటు టీడీఎస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. తప్పులు లేకుండా ఐటీ రిటర్న్ ఫైల్ చేసేందుకు ఇవి తప్పనిసరి అనే విషయం మర్చిపోకూడదు.

అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపు

అడ్వాన్స్ ట్యాక్స్ తొలి కిస్తీని కూడా ఈ నెల 15లోగా చెల్లించాలి. జీతంతో పాటు డిపాజిట్లపై వడ్డీ, అద్దెలు, మూలధన లాభాలు ఉండి టీడీఎస్, టీసీఎస్ పోను రూ.10,000 లేదా అంతకంటే ఎక్కువ ఆదాయ పన్ను చెల్లించాల్సిన వ్యక్తులకు ఇది వర్తిస్తుంది. మొత్తం చెల్లించాల్సిన ఆదాయ పన్నులో తొలి కిస్తీ కింద 15 శాతం అడ్వాన్స్ ట్యాక్స్‌గా చెల్లించాలి. ఈ ట్యాక్స్ చెల్లించకపోయినా, ఆలస్యం చేసినా నెలకు ఒక శాతం చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

ఆధార్ అప్‌డేట్

ఆధార్ వివరాల ఉచిత అప్‌డేట్ గడువు కూడా ఈ నెల 14తో ముగుస్తోంది. మై ఆధార్ పోర్టల్ ద్వారా ఈ అప్‌డేట్ పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత ఆఫ్‌లైన్‌లో ఆధార్ కేంద్రాల వద్ద అప్‌డేట్ చేయించుకోవాలంటే ఫీజు చెల్లించక తప్పదు.

ఓవర్ నైట్ ఫండ్స్ కటాఫ్ టైమ్

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)కు చెందిన ఓవర్ నైట్ ఫండ్స్ యూనిట్ల రిడంప్షన్, కేటాయింపుల విధానం ఈ నెల 1 నుంచి మారుతోంది. ట్రేడింగ్ రోజుల్లో మధ్యాహ్నం మూడు గంటల వరకు వచ్చిన అప్లికేషన్లకు అంతకు ముందు రోజు ఉన్న ఎన్‌ఏవీ ఆధారంగా, ఆ తర్వాత వచ్చిన అప్లికేషన్లకు ఆ తర్వాతి రోజు ఎన్‌ఏవీ ఆధారంగా యూనిట్ల కేటాయింపు లేదా రిడంప్షన్స్ ఉంటాయి.

క్యాపిటల్ గూడ్స్ అమ్ముతుంటే?

ఇదీ GST


రాంబాబు గొండాల

చాలా రకాల పరిశ్రమల్లో యంత్ర సామాగ్రిని తరచుగా మార్చాల్సిన అవసరం వస్తుంది. దీనికి కారణాలు అనేకం. ఉదాహరణకు టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలో వాడే మగ్గాలు, రంగులు అద్దె ఇతర సామాగ్రి తొందరగా అరిగిపోవటంతో వాటిని మార్చాల్సిన అవసరం వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో పాత యంత్రాలను అమ్ముతుంటారు. మరి వీటి మీద జీఎస్‌టీ ఎలా చెల్లించాలి?

ఈ యంత్రాలను లేదా యంత్ర పరికరాలను అంటే మెషిన్ లేదా మిషనరీ మొదలైన వాటిని జీఎస్‌టీ పరిభాషలో క్యాపిటల్ గూడ్స్ అంటారు. అంటే, ఏ వస్తువులను అయితే తమ అకౌంట్స్‌లో క్యాపిటలైజ్ చేస్తారో వాటిని క్యాపిటల్ గూడ్స్‌గా వ్యవహరిస్తారు. మరి ఈ క్యాపిటల్ గూడ్స్‌ను తిరిగి అమ్మినప్పుడు జీఎస్‌టీ చెల్లించటానికి ఒక విధానం ఉంది. ఉదాహరణకు ఒక పరిశ్రమ ఒక యంత్రాన్ని లేదా క్యాపిటల్ గూడ్స్‌ను కొనుగోలు చేసినప్పుడు వాటి మీద చెల్లించిన జీఎస్‌టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు. ఈ క్యాపిటల్ గూడ్స్ జీవిత కాలం జీఎస్‌టీ కింద 20 త్రైమాసికాలుగా నిర్ధారించారు. అంటే, కనీసం 5 సంవత్సరాలు ఆయా వస్తువులను వాడితేనే దానికి సంబంధించి తీసుకున్న ఐటీసీ మొత్తానికి అర్హత లభిస్తుంది. లేదంటే ఎంత కాలమైతే వాడారో అంత మేరకే అర్హత ఉంటుంది. మిగతాది రివర్స్ చేయాల్సి ఉంటుంది.

దీన్ని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం. ఒక కంపెనీ తన పరిశ్రమ కోసం కొన్ని యంత్రాలను కొనుగోలు చేసింది. వీటి విలువ రూ.2 లక్షలు. కాగా దీని మీద 18 శాతం చొప్పున రూ.36,000 తీసుకోవటం జరిగింది. దీనికి సంబంధించిన ఇన్వాయిస్ 2002 జనవరి 1న పొందటం జరిగింది. ఈ యంత్రాలను తిరిగి 2023 సెప్టెంబరు 15న అమ్మారనుకుందాం. అప్పుడు ఆ కంపెనీ ఆ యంత్రాలను 6 త్రైమాసికాల రెండు నెలల పైచిలుకు వాడినట్లు అర్థం. సంబంధిత నియమం ప్రకారం ఒక త్రైమాసికం దాటి ఒక్క రోజు గడిచినా తదుపరి త్రైమాసికం కింద లెక్కించాలి. కాబట్టి సదరు యంత్రాలను 7 త్రైమాసికాల పాటు వాడినట్లు భావించాలి.

మొత్తం జీవిత కాలం 20 త్రైమాసికాలు కాబట్టి మిగిలిన 13 త్రైమాసికాలకు సరిపోను క్రెడిట్‌ను అర్హత లేనిదిగా భావించాలి. ఆ విధంగా లెక్కిస్తే రివర్స్ చేయాల్సిన మొత్తం రూ.23,400 అవుతుంది (36,000 x 13/20). ఇప్పుడు ఆ యంత్రాల వాస్తవ అమ్మకపు విలువ రూ.1,40,000 అనుకుందాం. దీని మీద 18 శాతం జీఎస్‌టీ లెక్కిస్తే పన్ను విలువ రూ.25,200 అవుతుంది. అంటే రివర్స్ చేయాల్సిన మొత్తం కంటే పన్ను విలువ ఎక్కువ ఉంది. కాబట్టి ఎక్కువ ఉన్న విలువ చెల్లించాల్సి ఉంటుంది. అలాకాకుండా ఒకవేళ ఆ యంత్రాల అమ్మకపు విలువ రూ.లక్ష అనుకుందాం. అప్పుడు చెల్లించాల్సిన పన్ను రూ.18,000 మాత్రమే అవుతుంది. ఇలాంటి సందర్భంలో రివర్స్ చేయాల్సిన మొత్తం అంటే రూ.23,400 ఎక్కువ కనుక ఆ మొత్తం పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ, ఇన్వాయిస్‌లో యధార్థ అమ్మకపు విలువ దానికి సంబంధించిన పన్ను మాత్రమే చూపాలి. అలాగే కొనుగోలుదారుడు కూడా ఇన్వాయిస్ చూపిన పన్నునే క్రెడిట్ కింద తీసుకోవాలి. అంటే మొదటి ఉదాహరణలో ఎలాగు చెల్లించాల్సిన పన్ను విలువే (ఇన్వాయిస్ ప్రకారం) ఎక్కువ ఉంది కాబట్టి ఎలాంటి సమస్య లేదు. రెండో ఉదాహరణలో ఇన్వాయిస్ చూపేది రూ.18,000 కాగా చెల్లించాల్సింది రూ.23,400. కాబట్టి జీఎస్‌టీఆర్-1లో ఇన్వాయిస్ విలువ రూ.1,00,000, పన్ను కింద రూ.18,000 చూపాలి. అంటే యధార్థ విలువే చూపించాలి. కాగా, వ్యత్యాసం ఉన్న రూ.5,400 జీఎస్‌టీఆర్-3బీ లో రివర్సల్ కాలమ్‌లో చూపాలి.

అయితే ఇక్కడ మరొక విషయం ఉంది. ఈ రివర్స్ చేసే విషయంలో త్రైమాసికాల బదులు నెలలను పరిగణనలోకి తీసుకోవాలని జీఎస్‌టీలోని మరొక నిబంధన తెలుపుతుంది. అంటే 20 త్రైమాసికాల బదులు 60 నెలలను తీసుకోవాలి. ఈ విధంగా తీసుకున్నా జీవితకాలం 5 సంవత్సరాలే వస్తుంది. కానీ, రివర్స్ చేయాల్సిన మొత్తంలో కొద్దిగా మార్పు ఉంటుంది. పై ఉదాహరణే నెలల ప్రకారం తీసుకుంటే, యంత్రాలను 20 నెలల పైచిలుకు అంటే 21 నెలల తర్వాత అమ్మినట్లు. కనుక 60 నెలల్లో మిగిలిన 39 నెలలకు సరిపోను క్రెడిట్‌ను లెక్కించాలి. ఈ ఉదాహరణలో ఈ విధంగా లెక్కించినా రివర్స్ చేయాల్సిన మొత్తం రూ.23,400 వస్తుంది కాబట్టి ఎలాంటి సమస్య లేదు. కానీ, కొన్ని సందర్భాల్లో నెలవారీ విధానంలో ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది.

ఉదాహరణకు 2023 సెప్టెంబరు బదులుగా ఆగస్టు లేదా జూలై నెలలో యంత్రాలను అమ్మి ఉంటే త్రైమాసిక విధానంలో ఎలాంటి మార్పు ఉండదు. కానీ, నెలవారీ విధానంలో ఎక్కువ రివర్స్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి క్యాపిటల్ గూడ్స్ అమ్మేటప్పుడు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి. ఒకవేళ కొనుగోలు సమయంలో ఎలాంటి ఐటీసీ తీసుకోకుంటే ఈ రెండు విధానాలను పాటించాల్సిన అవసరం లేదు. ఇన్వాయిస్ ప్రకారం పన్ను చెల్లిస్తే సరిపో

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



జూన్ 1వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	105
విశాఖపట్నం	106	అనంతపురం	105
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,310 ▲	89,150 ▼	1,10,500 ▼
విజయవాడ	98,300 ▲	92,500 ▲	99,500 ▼
విశాఖపట్నం	97,310 ▼	89,200 ▲	1,10,900 ▼
రాజమండ్రి	97,310 ▲	89,200 ▲	99,800 ▼
ప్రొద్దుటూరు	95,600 ▲	87,950 ▲	98,300 ▼
ముంబై	95,355 ▲	87,345 ▼	97,458 ▼

ఇక రేషన్ దుకాణాల్లో సరుకులు

- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పునఃప్రారంభం
- పండుగ వాతావరణంలో పంపిణీకి ఏర్పాట్లు
- వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే..
- పిఠాపురంలో అధికారికంగా ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల మనోహర్
- ఈ విధానంతో రేషన్ అక్రమాలకు అడ్డుకట్ట డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి



అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదివారం (జూన్ 1) నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీని పునఃప్రారంభించనుంది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం పట్టణం 18వ వార్డులో పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారికంగా ప్రారంభిస్తారు. రాష్ట్రంలోని 29,796 చౌక ధరల దుకాణాల్లోనూ ఈ కార్యక్రమం అమలు కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు రేషన్ డీలర్లు తమ దుకాణాలను పూలతో అందంగా అలంకరించారు. తొలిరోజు స్థానిక కూటమి నాయకుల ద్వారా సరుకుల పంపిణీని లాంఛనంగా ప్రారంభింపజేసేందుకు ఏర్పాట్లు చేశారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు.. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలని పౌరసరఫరాలశాఖ ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు డీలర్ల వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రాల్లో కొత్త సాఫ్ట్‌వేర్ లోడ్ చేయడంతోపాటు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి అవసరమైన బియ్యం, పంచదార నిల్వలను రేషన్ దుకాణాలకు రవాణా చేసింది. ప్రతి దుకాణం వద్ద ధరల పట్టిక, స్టాక్‌ల వివరాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించింది. 65 ఏళ్ల వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకే సరుకులు అందించేలా జాబితాలను సిద్ధం చేసి డీలర్లకు అందించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 15,74,057 మంది వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకు సరుకులు రానున్నాయి. గతంలో మాదిరిగానే పోర్టబులిటీ సౌకర్యం కూడా అందుబాటులో ఉన్నందున కార్డుదారులు తమకు సమీపంలోని ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు పొందవచ్చు. రాష్ట్రంలో రేషన్‌కార్డులు కలిగి ఉన్న కోటి 46 లక్షల కుటుంబాలకు నిత్యావసర సరుకులను సక్రమంగా అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని మంత్రి మనోహర్ వెల్లడించారు.

ప్రతి కుటుంబానికి సరుకులు అందేలా..: పవన్

రేషన్ బియ్యం అక్రమ తరలింపును అరికట్టేందుకే చౌక ధరల దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునఃప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రతినెలా 15 రోజుల పాటు, రోజుకు రెండు పూటలా సరుకులు పంపిణీ చేయడం వల్ల దుకాణాల వద్ద రద్దీ తగ్గుతుందని, తద్వారా ప్రతి కుటుంబానికి సరుకులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలలో ఒకటి, రెండు రోజులు మాత్రమే జంక్షన్లలో వాహనాలు నిలిపి సరుకులు ఇవ్వడంతో ఎంతోమంది పేదలకు సరుకులు అందక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు.

ప్రైవేటుకు ఫైబర్‌నెట్!

- కేంద్రం అనుమతి కోరిన మౌలిక సదుపాయాల శాఖ
- ప్రభుత్వ పరిధిలోనే ఆస్తులు
- నిర్వహణ మాత్రమే ప్రైవేటుకు

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ సేవల నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనా శాఖ(ఐఅండ్ఐ) సిద్ధమైంది. ఈ మేరకు కేంద్రాన్ని అనుమతి కోరింది. ఇప్పటిదాకా రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏపీ ఫైబర్ నెట్ సేవలను సంస్థ స్వయంగా అందిస్తోంది. అయితే, వైసీపీ హయాంలో ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఆర్థిక కార్యకలాపాలు అస్తవ్యస్తంగా మారి దివాలా అంచుకు చేరింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఫైబర్‌నెట్ సేవలు అందిస్తున్న సిబ్బంది సమాచారం కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. దీంతో.. ఫైబర్‌నెట్ కార్యకలాపాలపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఆదేశించింది. ఈ దర్యాప్తు తుదిదశకు చేరుకుంది. మరో పక్షం రోజుల్లోపే నివేదిక ప్రభుత్వానికి చేరనుంది. దీని ఆధారంగా భవిష్యత్ కార్యకలాపాలపై ప్రణాళికలు రచించేందుకు ఐఅండ్ఐ సిద్ధమైంది. 2019-24 మధ్య ఆర్థిక అవకతవకలు భారీగా జరిగాయని విచారణలో గుర్తించినట్టు తెలిసింది. ఉద్యోగ నియామకాల్లోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయని తేలింది. వైసీపీ ముఖ్యనేతల అనుచరులకు చెందిన వాహన డ్రైవర్లు, తాడేపల్లి ప్యాలెస్ సూచించినవారికి మౌఖిక సిఫారసులతోనే ఉద్యోగాలు ఇచ్చారు. వారికి నెలకు 4 అంకెల జీతాన్ని చెల్లించారు. గత యాజమాన్య విధానంలోనే ఫైబర్‌నెట్ సేవలను విస్తరించాలంటే.. ఆర్థికంగా చాలా ఖర్చు చేయాల్సి ఉంటుందని భావిస్తున్న నేపథ్యంలో కేంద్రం సవరించిన ఫైబర్‌నెట్ పథకం కింద ప్రైవేటు సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు అనుమతి ఇవ్వాలంటూ మే 21న డిజిటల్ భారత్ నిధి(డీబీఎన్) అడ్మినిస్ట్రేటర్ నీరజ్ వర్మకు ఐఅండ్ఐ కార్యదర్శి యువరాజ్ లేఖ రాశారు. అయితే, ఫైబర్ నెట్ ఆస్తులను ప్రభుత్వ నియంత్రణలోనే ఉంచనున్నారు. కేవలం సేవలను మాత్రమే ప్రైవేటుకు ఇవ్వనున్నారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే కార్యాచరణను ప్రారంభించేందుకు ఐఅండ్ఐ సిద్ధమైంది.

చిత్రజ్యోతి
SINCE 1965

కమల్ సినిమాలను నిషేధించాలి

● కర్నాటక మంత్రికి ఫిల్మ్‌చాంబర్ లేఖ



కమల్ హాసన్ క్షమాపణ చెప్పకుంటే ఆయన సినిమాలను నిషేధించాలని కోరుతూ కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడగికి కర్నాటక ఫిల్మ్ చాంబర్ లేఖ రాసింది. ఈ అంశంపై మంత్రి శివరాజ్ తంగడగి స్పందిస్తూ, ఇతర భాషల నటులు కన్నడ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని అన్నారు. విధానసౌధలో మంత్రి శనివారం మీడియాతో మాట్లాడారు. కమల్ సీనియర్ నటుడైనా, భాష గురించి అనుచితంగా మాట్లాడితే సహించేది లేదని అన్నారు. ఈ అంశంపై సీఎం సిద్దరామయ్యతోనూ, సీనియర్ నటుడు శివరాజ్‌కుమార్‌తోనూ చర్చిస్తానని అన్నారు. థగ్‌లైఫ్ సినిమా కోసం వచ్చిన సమయంలో కమల్‌హాసన్ మాట్లాడుతూ, తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందని అన్నారు. ఈ వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. జూన్ 5న సినిమా విడుదల కానుంది. కమల్ వ్యాఖ్యలు ఇప్పటికే వివాదాస్పదం అయ్యాయని, అందుకు ఆయన క్షమాపణ చెప్పాల్సిందేనని ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు నరసింహులు అన్నారు. జూన్ 5లోగా స్పందించకుంటే ఆయన నటించిన సినిమాను రాష్ట్రంలో ప్రదర్శించేందుకు అవకాశం ఇచ్చేది లేదని డిస్ట్రిబ్యూటర్‌లు స్పష్టం చేశారని తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అక్టోబర్‌లో పెళ్లివేడుక



అక్టోబర్‌లో సిరి లేళ్ల (శిరీష)తో ఏడడుగులు వేయబోతున్నట్లు నారా రోహిత్ తెలిపారు. ఆయన నటించిన 'భైరవం' చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా నారా రోహిత్ మీడియాతో మాట్లాడుతూ తమ పెళ్లి గురించి స్పందించారు. 'ప్రతినిధి 2' చిత్రంలో జంటగా నటించిన నారా రోహిత్, శిరీష ఆ సినిమా షూటింగ్ సమయంలో ప్రేమలో పడ్డారు. గతేడాది అక్టోబర్‌లో ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో వారి నిశ్చితార్థం జరిగింది. అయితే నారా రోహిత్ తండ్రి రామ్మూర్తి నాయుడు నవంబర్‌లో కన్నుమూయడంతో పెళ్లి వేడుకను వాయిదా వేసుకున్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



నార్నె నితిన్ కథానాయకుడిగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద కథానాయిక. శ్రీ వేధాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు నిర్మించారు. శనివారం చిత్ర బృందం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ ట్రైలర్‌ను ఆవిష్కరించి, విడుదల తేదీని ప్రకటించారు. ఈనెల 6న 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సతీశ్ వేగేశ్న మాట్లాడుతూ "ఇదొక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. మనల్ని మనం జయించడమే సక్సెస్' అంటే అని ఈ సినిమాలో నరేశ్ గారికి ఒక డైలాగ్ ఉంది. ఈ కాన్సెప్ట్‌తోనే సినిమాను రూపొందించాం. నార్నే నితిన్‌లోని యాక్షన్ కోణం ఈ సినిమాలో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అన్నారు. పూర్తి కమర్షియల్ ఫార్మాట్‌లో భారీ తారాగణంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని చింతపల్లి రామారావు తెలిపారు.

ఊహకందని మలుపులతో



వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధానపాత్ర పోషిస్తున్న హారర్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లెయింట్'. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో సింగపూర్ బాలకృష్ణ, మల్లెల ప్రభాకర్ నిర్మిస్తున్నారు. నవీన్‌చంద్ర, రవిశంకర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి వరలక్ష్మీ శరత్‌కుమార్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కర్మసిద్ధాంతం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. హారర్ థ్రిల్లర్ జానర్‌లో ఊహకందని మలుపులతో కథ సాగుతుంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది' అని చెప్పారు. ఈ చిత్రంలో కృష్ణగారి మీద ప్రత్యేకంగా ఓ గీతాన్ని రూపొందించాం, అది సినిమాకు ప్రత్యేకాకర్షణ అని నిర్మాతలు చెప్పారు. సంగీతం: సుదీంద్ర, సినిమాటోగ్రఫీ: ఎస్.ఎన్ హరీశ్

మైథలాజికల్ థ్రిల్లర్



జగదీశ్ ఆమంచి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'యముడు'. శ్రావణి శెట్టి హీరోయిన్. మైథాలజీ, సస్పెన్స్ క్రైమ్ అంశాలతో రూపుదిద్దుకుంటున్న థ్రిల్లర్ ఇది. గురువారం ఈ మూవీ టీజర్‌ను హీరో నవీన్‌చంద్ర విడుదల చేశారు. సిటీలో ఉన్న అమ్మాయిలు అపహరణకు, హత్యకు గురవడం, నాటకాల్లో యముడి వేషం వేసే నటుడికీ ఆ హత్యలకు సంబంధం ఉందేమో అన్నట్లుగా ఈ టీజర్‌లో చూపించారు. త్వరలోనే ఈ చిత్రం గురించి మరిన్ని అప్‌డేట్స్‌ను ప్రకటిస్తామని నిర్మాత జగదీశ్ చెప్పారు. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రజని ఆమంచి.

ఇన్ ప్రోగ్రెస్

కొత్త కథలతో తెరపైకి



'నిర్మాతగా టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది. కొత్త తరాన్ని ప్రోత్సహించడానికి, సరికొత్త కథలను తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం' అని వర్ధమాన నిర్మాత జేజే అన్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తన సొంత నిర్మాణసంస్థ 'సోమో ఐరానిక్ ఆర్ట్ క్రియేషన్స్' బేనర్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేజే మీడియాతో మాట్లాడుతూ 'త్వరలో ఓ భారీ చిత్రాన్ని ప్రకటిస్తాం. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమా రూపొందుతోంది. భవిష్యత్తులో ఎన్నో మంచి చిత్రాలను నిర్మించాలనేదే మా లక్ష్యం' అని తెలిపారు.

మీరే నాకు స్ఫూర్తి!

● చిరంజీవిని కలసిన శేఖర్ కమ్ముల



ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల చిత్ర పరిశ్రమలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ ప్రత్యేక సందర్భంలో ఆయన మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. '25 ఇయర్స్ ఆఫ్ శేఖర్ కమ్ముల' సెలబ్రేటింగ్ ది సోల్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్ అనే పోస్టర్‌ని చిరంజీవి ఆవిష్కరించి, అభినందించారు. ఈ విషయాన్ని శేఖర్ కమ్ముల సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. 'టీనేజ్‌లో ఉన్నప్పుడు మెగాస్టార్ చిరంజీవిని ఒకసారి దగ్గర నుంచి చూశాను. ఈయనతో సినిమా చేయాలనే భావన కలిగింది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 సంవత్సరాలు అవుతోంది. దీనిని సెలెబ్రేట్ చేసుకుందామని మా టీమ్ అనగానే వెంటనే నాకు గుర్తొచ్చింది చిరంజీవి గారే. కొన్ని తరాల వారిలో స్ఫూర్తి నింపిన వ్యక్తి ఆయన. కలలను వెంటాడితే విజయం తప్పకుండా మనల్ని అనుసరిస్తుందని నమ్మకం కలిగించింది ఆయనే. నా ఈ 25 ఏళ్ల వేడుకను ఆయన సమక్షంలో చేసుకోవాలనిపించింది. థాంక్యూ సర్. ఈ క్షణంలోనే కాదు నా టీనేజ్ నుంచి మీరు నా ముందు ఇలాగే ఉన్నారు' అని శేఖర్ కమ్ముల ఆ పోస్టులో పేర్కొన్నారు. చిరంజీవితో కలసి దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఆ సినిమాతో ముడిపెట్టడం సరికాదు

- ఆర్. నారాయణ మూర్తి



'ప్రభుత్వాన్ని సినీ పెద్దలు కలవాలి అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనడంలో తప్పులేదు. సమస్యలపై చర్చించడానికి సినీ పరిశ్రమను ప్రభుత్వం మరోసారి పిలిస్తే బాగుండేది' అని అన్నారు సీనియర్ నటుడు ఆర్.నారాయణ మూర్తి. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'గద్దర్ అవార్డులు ప్రకటించడం గర్వంగా ఉంది. ఏపీలో కూడా 'నంది' అవార్డులు ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరుతున్నా. పర్సంటేజీ విషయంలో ఈ మధ్య వివాదం నెలకొంది. 'హరి హర వీరమల్లు' చిత్రం కోసమే థియేటర్లు బంద్ చేస్తున్నారనేది అబద్ధం. పర్సంటేజీ విధానాన్ని కోరుకునే వ్యక్తుల్లో నేనూ ఒకడిని. పర్సంటేజీ ఖరారైతే నాలాంటి ఎంతోమంది నిర్మాతలకు మేలు కలుగుతుంది. అయితే, 'హరి హర వీరమల్లు' సినిమా ప్రస్తావన లేకుండా సమస్యలపై చర్చించడానికి పిలిస్తే పవన్‌పై గౌరవం మరింత పెరిగేది. పర్సంటేజీ విషయంలో చాంబర్ ముందు ఆందోళనలు చేశాం. ఎంతోమంది చాంబర్ అధ్యక్షులకు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదు. పర్సంటేజీ విషయం ఒక కొలిక్కి వచ్చే దశలో 'హరి హరి వీరమల్లు'కు లింక్ పెట్టడం సరికాదు. నేడు సింగిల్ థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమైంది. కొందరు కార్పొరేట్ వ్యవస్థకు వంత పాడుతున్నారు. సింగిల్ థియేటర్లు దేవాలయాల్లాంటివి. ఇప్పుడు ఇవి కల్యాణ మండపాలవుతున్నాయి. పర్సంటేజీని బతికించి నిర్మాతలను కాపాడాలి' అని అన్నారు.

భూమ్.. భూమ్



'అర్ధనారి', 'తెప్ప సముద్రం', 'వెడ్డింగ్ డైరీస్' వంటి వైవిధ్యమైన చిత్రాల్లో హీరోగా నటించిన అర్జున్ అంబటి తాజా చిత్రం 'పరమపద సోపానం'. నాగ శివ దర్శకత్వంలో గుడిమట్ల శివప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జూలై 11న విడుదల కానుంది. ఇటీవల 'చిన్ని చిన్ని తప్పులేవో' పాటను విడుదల చేసిన యూనిట్ ఇప్పుడు 'భూమ్ భూమ్' అనే పెప్పీ మాస్ నంబర్‌ను రిలీజ్ చేసింది. గీతా మాధురి పాడిన ఈ పాటను రాంబాబు గోశాల రాశారు. దేవ్ జాండ్ సంగీత దర్శకుడు. హీరోయిన్ నమ్రితపై ఈ పాటను చిత్రీకరించారు.



ప్రజావేదిక సభలో మడికి లక్ష్మి కుటుంబంతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

'గేట్స్'తో కలిసి క్యాన్సర్ నిర్మూలనకు కృషి

ప్రజల ఆరోగ్య వివరాలు ఆన్‌లైన్‌లోకి: చంద్రబాబు

అమలాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను నిరోధించడంతో పాటు రాకుండా చేసేందుకు ఏ చర్యలు చేపట్టాలనే దానిపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇందుకోసం బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఒక కార్యాచరణ చేపట్టనుందని వెల్లడించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో బంగారు కుటుంబం(పీ4) కార్యక్రమం సందర్భంగా ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడారు. బిల్‌గేట్స్‌కు వచ్చే ఆదాయంలో 99 శాతం ఫౌండేషన్ ద్వారా ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి అంశాలకు ఖర్చు చేయాలని నిర్ణయించారని, రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరినట్టు చెప్పారు. టెక్నాలజీ ఆధారంగా ఎన్నో మార్పులు వస్తున్నాయంటూ తన చేతికి ఉన్న ఓ రింగ్‌ను చూపించి.. 'ఇదేంటో మీకు తెలుసా? ఇది మానిటర్ రింగ్. ఎంతసేపు నిద్రపోవాలి, హార్ట్‌బీట్ ఎలా ఉంది, ఎంత కేలరీలు తినాలి' అనే గైడెన్స్ ఇస్తుందని చంద్రబాబు చెప్పారు. చెయ్యేరు గ్రామానికి చెందిన మడికి లక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ.. తన భర్త క్యాన్సర్‌తో చనిపోయాడని చెప్పారు. తనకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని, సొంతిల్లు కూడా లేదని, పూట గడవడం కష్టంగా ఉందని, వితంతు పెన్షన్ ఇప్పించి ఇల్లు కట్టించి ఆదుకోవాలని అభ్యర్థించారు. హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్న లక్ష్మి పెద్దకుమార్తెను.. 'నువ్వు ఏం కావాలనుకుంటున్నావ్' అని సీఎం అడిగారు. తాను డాక్టర్ కావాలని కోరుకుంటున్నానని ఆ అమ్మాయి చెప్పింది. మరో అమ్మాయి ఐపీఎస్ కావాలనుకుంటున్నానని బదులిచ్చింది. గ్రామానికి చెందిన ప్రముఖ వ్యక్తి త్సవటపల్లి నాగేంద్రరావు వీరిని దత్తత తీసుకుంటానని ప్రకటించారు. వారికి చేదోడు వాదోడుగా ఉంటానని, ఇల్లు నిర్మాణం పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో మరో 4 కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రకటించారు.

సొంత ఇల్లు కూడా లేదు: సత్యవతి

చెయ్యేరుకు చెందిన ఉప్పలగుప్తం సత్యవతి ప్రజావేదికపై మాట్లాడారు. తన భర్త ఓ చెట్టుకింద ఇస్త్రీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, తమకు సొంత ఇల్లు కూడా లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆమె కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. దాతగా ముందుకు వచ్చిన మంతెన రామరాజు స్పందిస్తూ.. సత్యవతి పిల్లలు చదువుకునేంత వరకు తానే బాధ్యత తీసుకుంటానని, ఇల్లు నిర్మాణంలో సహకారం అందిస్తానని, కిరాణా వ్యాపారం పెట్టుకునేందుకు ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చారు.

15 నిమిషాలు కూలీలతో సీఎం ముచ్చట్లు

చెయ్యేరు గ్రామంలో రూ.9.86 లక్షల వ్యయంతో చేపట్టనున్న చెరువు పూడికతీత పనులకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉపాధి మహిళా కూలీలతో ముచ్చటించారు. వారితో కలిసి చెరువు గట్టున తిరుగుతూ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ల పథకంపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న టీడీపీ నాయకుల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీల సమస్యలను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. 15నిమిషాల పాటు వారితో గడిపారు. ఇద్దరు ఉపాధి కూలీలకు సీఎం పింఛను సొమ్ముఅందజేశారు.

ఇక గేరు మారుస్తా..

(మొదటి పేజీ తరువాయి)

రోజుల్లో భగవంతుడు కరుణిస్తే పింఛన్ల సొమ్మును మరింత పెంచుతామని అన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే ఎగ్గొట్టేవారు. భర్త చనిపోతే ఆ మరుసటి నెలలో భార్యకు ఇచ్చే స్పౌజ్ పింఛను పథకాన్ని ఇప్పుడు అమలు చేస్తున్నాం. ప్రతినెలా 1వ తేదీన పింఛన్లు అందించే కార్యక్రమాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటే ప్రజల కష్టాలు అర్థమవుతాయి. ఈ నెలలో 9,176 మందికి మూడు నెలల పింఛన్లు ఒకేసారి అందించాం. లబ్ధిదారు ఎక్కడికివెళ్లినా 3నెలల పింఛను ఒకేసారి తీసుకోవచ్చు. ఇతర రాష్ట్రాల కంటే మనమే పింఛన్ల సొమ్ము ఎక్కువగా ఇస్తున్నాం. అన్ని రాష్ట్రాల కంటే అధికంగా ఆదాయం వచ్చే మహారాష్ట్రలో ఇచ్చే పింఛను రూ.1,000 మాత్రమే. పొరుగున తెలంగాణలో రూ.2,250 అందిస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ద్వారా నేను ఇంటికి పెద్ద కొడుకులా నెలకు రూ.4వేలు చొప్పున ఏడాదికి రూ.48వేలు పింఛను రూపంలో అందిస్తున్నాను. దేశంలోనే ఏడాదికి రూ.34 వేల కోట్లు పింఛన్ల రూపంలో అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. 1న సెలవు వస్తే ముందురోజు పింఛన్లు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే.' అని సీఎం పేర్కొన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

మెగా డీఎస్సీ... 3 ఉచిత సిలిండర్లు

'ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులతో యువతకు ఉద్యోగాలు కల్పించనున్నాం. దీపం పథకం ద్వారా మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. నాలుగు నెలలకోసారి మహిళల అకౌంట్‌కు గ్యాస్ డబ్బులు జమ చేస్తున్నాం. రూ.1,200 కోట్లతో 20వేల కిలోమీటర్ల రోడ్లు వేశాం. భవిష్యత్‌లో మరిన్ని రోడ్లు వేస్తాం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లు ఉన్నాయి. అవసరమైతే ఇంకా పెంచుతాం. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక చెత్తపన్ను రద్దు చేశాం. 83లక్షల టన్నుల చెత్తను అక్టోబరు కల్లా తీసి వేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఒకేరోజు అన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభించారు. పల్లె వెలుగు కింద రూ.4,500 కోట్లు వెచ్చించి 30వేల పనులకు శ్రీకారం చుట్టాం. గ్రామాల్లో వెలుగులు తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.'



చెయ్యేరులో మహిళలకు పెన్షన్ అందజేస్తున్న సీఎం చంద్రబాబు

'గత ప్రభుత్వం హయాంలో 94 పథకాలకు కేంద్రం ఇచ్చిన నిధులు మళ్లించి రాష్ట్రాన్ని బ్లాక్‌లిస్టులో పెట్టే పరిస్థితి తెచ్చారు. వీళ్లు దుర్వినియోగం చేసిన డబ్బులు చెల్లించి తిరిగి ఆ పథకాలను పునరుద్ధరించాం.'

'ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎక్కువమంది ముందుకొస్తున్నారు. ఎందుకని నన్ను ఢిల్లీలో అడిగారు. మా రాష్ట్రమే వేరు. ఇక్కడ సీబీఎన్ ఉన్నాడు. వేరే రాష్ట్రాల కంటే భిన్నంగా ఆలోచిస్తానని చాలా స్పష్టంగా చెప్పా.'

'వాట్సాప్ గవర్నెన్స్‌లో 403 రకాల సేవలు అందిస్తున్నాం. ఈ నెల 12 నుంచి 500 సేవలు అందిస్తాం.'

'నాది డేగ కన్ను.. నానుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఎవడైనా తప్పు చేస్తే చండశాసనుడిగా ఉంటాను. తోక జాడిస్తే.. కట్ అయిపోతుంది.' -సీఎం

సోలార్ ప్యానెళ్లు పెట్టుకోండి

ఎస్సీ, ఎస్టీలకు హామీ ఇస్తున్నా.. మీ ఇంటిపైన సోలార్ ప్యానెళ్లు పెట్టుకోండి.. 2కిలోవాట్ల వరకు సోలార్ ప్యానెళ్లు ఉచితంగా అందిస్తాం. బీసీలకు కేంద్రం ఇచ్చే సబ్సిడీకి అదనంగా రూ.20వేల రాయితీ ఇస్తాం. ప్రతి నియోజకవర్గంలో 10వేల ఇళ్లకు సోలార్ పెట్టాలి. ఇలా పెట్టించకపోతే ఎమ్మెల్యేలకు పవర్ కట్ అవుతుంది. కలెక్టర్‌కు కూడా నోటీసులిస్తాం.

గంజాయి అమ్మినా... వాడినా తాటతీస్తా

గంజాయి, డ్రగ్స్ వాడకం గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా పెరిగిపోయింది. కిరాణా షాపుల్లో కూడా దొరికేది. మా ప్రభుత్వంలో గంజాయి అమ్మినా, వాడినా తాటతీస్తా. గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం. నవజాతి శిశువుల కోసం, చిన్న పిల్లల కోసం 11 వస్తువులతో ఎన్టీఆర్ బేబీకిట్లను ప్రవేశపెట్టాం. తల్లికి వందనం కింద స్కూల్ తెరిచే నాటికి ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందిస్తాను. మీ ఊరిలో జనాభా బాగా తగ్గిపోతోంది. సంతానం లేకపోతే అందరూ వృద్ధులే ఉంటారు. వాళ్లు కూడా చనిపోతే అసలు మనుషులే ఉండరు. మళ్లీ చెయ్యేరు ఎక్కడ ఉందంటే రికార్డులో వెతుకోవాల్సి వస్తుంది. అందుకే జనాభాను పెంచేందుకు మీరు బాధ్యత తీసుకోవాలి. ఇద్దరి కంటే తక్కువ కాకుండా పిల్లల్ని కనాలి. అన్నదాత సుఖీభవ జూన్ నుంచే ప్రారంభిస్తాం. కేంద్రం అందిస్తున్న పథకాన్ని మూడు విడతల్లో ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఇది పేదల కోసం పనిచేసే ప్రభుత్వం. నిరంతరం పేదలకు ఇబ్బందులకు లేకుండా ఏం చేయాలో అన్నీ చేస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఆగస్టు 15నుంచి కల్పించనున్నాం. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నా. జస్టిస్ పునయ్య కమిషన్ ఏర్పాటు చేసి దళితులకు న్యాయం చేసిన పార్టీ టీడీపీ. రాజమహేంద్రవరంలో ఓ పాస్టర్ సహజంగా మరణిస్తే రాజకీయం చేస్తున్నారు. గతంలో బాబాయిని చంపి గుండెపోటుతో మరణించినట్లు చిత్రీకరించారు. ఇప్పుడూ అదే చేయాలని అనుకుంటున్నారు. తప్పుడు ఆరోపణలు చేసి బురద జల్లే కార్యక్రమాన్ని చేస్తే చూస్తూ ఊరుకోను.

త్వరలో సంక్షేమ క్యాలెండర్

'త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేస్తాను. పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా రేషన్ డీలర్ల వద్దే సరుకులు తీసుకునే విధానం అమలు చేస్తున్నాం. రేషన్ తెచ్చుకోలేని వారి కోసం డోర్ డెలివరీ అందిస్తాం. బియ్యం మాఫియాకు అడ్డుకట్ట వేస్తాం.'

92 శాతం పెన్షన్లు పంపిణీ

తొలి రోజు 58.50 లక్షల మందికి అందజేత

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా శనివారం 92.52 శాతం సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా ఒక రోజు ముందే పెన్షన్ల పంపిణీ చేపట్టారు. మొత్తం 63 లక్షల మందికి పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.2,717 కోట్లు విడుదల చేసింది. శనివారం 58.50 లక్షల మంది సామాజిక పెన్షన్‌దారులకు ఉద్యోగులు నగదు అందించారు. అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 94.69 శాతం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కోనసీమ జిల్లా ముమ్మడివరం నియోజకవర్గం చెయ్యేరులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టెన్త్ పేపర్లు ఎత్తుకుపోయిన జగన్!

విలువల గురించి మాట్లాడడమా?

- మూల్యాంకనంలో వ్యత్యాసం 16.8%
- మీ హయాంలో 17-20 శాతం తేడాలు
- జగన్‌కు మంత్రి లోకేశ్ కౌంటర్



అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడే టెన్త్ పేపర్లు ఎత్తుకుపోయిన జగన్ నుంచి హుందాతనం ఆశించడం తప్పే అవుతుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విద్యార్థుల యూనిఫాం నుంచి చిక్కీల వరకు పార్టీ రంగులు వేసుకుని, సొంత పేర్లు పెట్టుకున్న ఆయన ఇప్పుడు విలువల గురించి మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. పదో తరగతి మూల్యాంకనంపై మాజీ సీఎం జగన్ శనివారం పలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఎక్స్ ద్వారా ఆయనకు లోకేశ్ కౌంటర్ ఇచ్చారు. "జగన్ ప్రజా జీవితంలో, వ్యక్తిగత జీవితంలోనూ ఫెయిల్ అయ్యారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలను రద్దుచేసిన మీరూ మాట్లాడుతున్నారా?. అధికారంలో ఉన్నప్పుడు టీచర్లను మద్యం షాపుల వద్ద కాపలా పెట్టిన మీరు ఇప్పటికీ వారి పట్ల కక్షపూరితంగానే వ్యవహరిస్తున్నారు. మీరు తీసుకొచ్చిన జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 12 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. టీచర్లను, విద్యార్థులను సన్నద్ధం చేయకుండానే సీబీఎస్ఈ తీసుకొచ్చారు. నేను మంత్రి కాగానే వారికి పరీక్ష నిర్వహించగా 90శాతం మంది ఫెయిల్ అయ్యారు. వారి భవిష్యత్తు కోసం సీబీఎస్ఈని వాయిదా వేశాం. ఐబీ తీసుకొచ్చినట్టు కలలు కంటున్నారు. వాస్తవానికి మీరు తీసుకొచ్చింది ఐబీ సిలబస్ కాదు. ఐబీ అమలుకు రిపోర్ట్ కోసం రూ.5 కోట్లు ఖర్చు చేశారు అంతే. ఇక టోఫెల్ బోధించే టీచర్లు లేకపోయినా టోఫెల్ తెచ్చినట్లు జబ్బలు చరుచుకుంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో రూ.4,500 కోట్లు, గుడ్లు, చిక్కీలకు రూ.వెయ్యి కోట్లు బకాయిలు పెట్టిపోయారు. మీ హయాంలో టీచర్ల బదిలీలకు మంత్రి డబ్బులు వసూలు చేశారన్నది బహిరంగ రహస్యం. మీరు భ్రష్టు పట్టించిన విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నా. రాజకీయాలకు అతీతంగా టీచర్ల బదిలీలు చేస్తు న్నాం." అని పేర్కొన్నారు.

రీకౌంటింగ్ కొత్తది కాదు!

పదో తరగతి జవాబు పత్రాల రీకౌంటింగ్ అనేది కొత్త విధానం కాదని మంత్రి లోకేశ్ తెలిపారు. "ఈ ఏడాది 45,96,527 జవాబుపత్రాలు మూల్యాంకనం చేశారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ తర్వాత 11,175 పేపర్లలో మాత్రమే వ్యత్యాసం వచ్చింది. ఇందులో మానవ తప్పిదం 0.25శాతం మాత్రమే. బాధ్యులపై చర్యలు కూడా తీసుకున్నాం. అదే జగన్ హయాంలో 2022లో 20శాతం, 2023లో 18శాతం, 2024లో 17శాతం వ్యత్యాసాలు వచ్చాయి." అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

8,863 పేపరల్లో స్వల్ప వ్యత్యాసమే!

- 0.068శాతం పేపర్లలోనే ఎక్కువ మార్కుల తేడా
- ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి వెల్లడి
- టెన్త్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో తేడాలపై వివరణ

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలో పొరపాట్లు స్వల్పమేనని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసుల రెడ్డి చెప్పారు. మూల్యాంకనంలో పొరపాట్లపై శనివారం ఆయన వివరణ ఇచ్చారు. ఈ ఏడాది మొత్తం 45,96,527 పేపర్లు మూల్యాంకనం చేశామని, ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ రోజుకు 40 పేపర్ల చొప్పున దిద్దారని తెలిపారు. మూల్యాంకనంలో కచ్చితత్వం 2025లో మెరుగ్గానే ఉందన్నారు. 2022లో 99.82శాతం, 2023లో 99.76శాతం, 2024లో 99.81శాతం, 2025లో 99.76శాతం కచ్చితత్వంతో మూల్యాంకనం జరిగిందని చెప్పారు. 66,363 పేపర్ల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 11,175 పేపర్లలో మార్కులు మారాయన్నారు. 8,863 పేపర్లలో 5 మార్కుల లోపే మారాయని, 3,119 పేపర్లలో 5 మార్కులు దాటి మారాయని వివరించారు. ఎక్కువ మార్కులు మారింది కేవలం 0.068శాతం పేపర్లలో మాత్రమేనన్నారు. ఈ పొరపాట్ల వల్ల అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థుల కోసం ఆర్జీయూకేటీ ఈనెల 2 నుంచి 10 వరకు దరఖాస్తులకు మరో అవకాశం కల్పించిందని తెలిపారు.

మీరు, మీ కొడుకు ఫెయిల్

- మీ అసమర్థతతో పదో క్లాస్ విద్యార్థులకు క్షోభ
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై జగన్ విమర్శ



అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు గారూ... మీరు, మీ కొడుకు లోకేశ్ 10వ తరగతి పరీక్షల నిర్వహణలో ఫెయిల్ అయ్యారు' అని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. శనివారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'మీ పాలనలో విద్యారంగం భ్రష్టు పట్టిపోయింది. పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేని దుస్థితిలో ఉన్న మీరు, విగతా వ్యవస్థలను ఇంకెంత ఘోరంగా నడుపుతున్నారో అర్థం అవుతోంది. రాష్ట్రంలో 6.14 లక్షల మంది రాత్రీపగలూ కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలు సక్రమంగా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడించాల్సిన మీరు, ఘోరంగా విఫలమయ్యారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను క్షోభకు గురి చేశారు. తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో మొదలు అందరిపైనా చర్యలు తీసుకోవాలి' అని జగన్ డిమాండ్ చేశారు.

వ్యక్తిగత దూషణలకే మహానాడు పరిమితం: బొత్స

విశాఖపట్నం, మే 31(ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడు వ్యక్తిగత దూషణలకే పరిమితమైందని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విశాఖలో ఆరోపించారు. 'ఏడాది పాలన తరువాత వైసీపీని ఆడిపోసుకోవడానికే ఎక్కువ సమయం కేటాయించారు. ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వలేదు. కడప జిల్లా పేరును మార్చినట్టు విజయవాడ జిల్లా పేరు మారుస్తారా? ఈ ప్రభుత్వం పదో తరగతి జవాబు పత్రాలను కూడా సరిగ్గా మూల్యాంకనం చేయించలేకపోయింది' అని బొత్స అన్నారు.

వెన్నుపోటుకు జగన్ బ్రాండ్ అంబాసిడర్: సవిత

పెనుకొండ టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చేయడంలో సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ రాష్ట్రానికే బ్రాండ్ అంబాసిడర్లు అని మంత్రి సవిత అన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేయడం, కుటుంబ సభ్యులకు వెన్నుపోటు పొడవడంలో జగన్మోహన్‌రెడ్డి పెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

ఉడత ఊపులకు ఎవరూ భయపడరు: ఆనం

ఆత్మకూరు, మే 31(ఆంధ్రజ్యోతి): 'మీ ఉడత ఊపులకు భయపడే వారు ఎవరూ లేరు. మీరు చెబితే వినేవాడూ లేడు. వైసీపీని ప్రజలు ఛీ కొడుతున్నారు. మీరు ఇప్పుడొచ్చి తగుదునమ్మా అంటూ విద్రోహ దినం పాటిస్తానంటే ప్రజలు చూడడానికి, వినడానికి ఖాళీగా ఉన్నారా!? మీ ప్రయత్నాలేమీ ఫలించవ్' అని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో శనివారం మాట్లాడారు.

టీడీపీ ఆఫీసుపై దాడి!

మా నేతల ప్రోద్బలంతోనే



సీఐడీ అధికారుల విచారణలో వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి

గుంటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల ప్రోద్బలంతోనే మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిందని వైసీపీ నేత, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వెల్లడించినట్లు తెలిసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఇటీవల సీఐడీ అధికారులు ఆళ్ల రామకృష్ణారెడ్డిని 127వ నిందితుడిగా చేర్చారు. ఈ క్రమంలో ఆయనను గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. దీంతో శనివారం రామకృష్ణారెడ్డి విచారణకు హాజరయ్యారు. సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య ఆధ్వర్యంలో అధికారులు ఆయనను విచారించారు. మొత్తం 38 ప్రశ్నలు సంధించగా అత్యధిక ప్రశ్నలకు ఆళ్ల స్పష్టమైన సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. గతంలో వైసీపీని ఎందుకు వీడారు? మళ్లీ తిరిగి ఎందుకు ఆ పార్టీలో చేరారు? వంటి అనేక ప్రశ్నలను మాత్రం ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం.

పార్టీ పరంగానే..

పార్టీ పరంగానే టీడీపీ ఆఫీసుపై దాడి జరిగిందనే విషయం అందరికీ తెలుసునని ఆళ్ల రామకృష్ణారెడ్డి సమాధానం చెప్పినట్లు తెలిసింది. ఈ దాడిని ఎవరైనా ఖండించాల్సిందేనని.. నేనైతే పూర్తిగా ఖండిస్తున్నానని చెప్పినట్లు సమాచారం. టీడీపీ కార్యాలయం పై దాడి జరిగిన రోజు తాను ఫిరంగిపురం మండలం పరిధిలోని వేమవరంలో ఉన్న తన పొలంలో ఉన్నట్లు రామకృష్ణారెడ్డి చెప్పారని సమాచారం. టీడీపీ ఆఫీసుపై దాడి జరిగినట్టు ఓ విలేకరి ఫోన్ చేసి చెప్పాకే.. తనకు తెలిసిందన్నారు. "మీరు సాక్షులను విచారించుకుంటే ఆ సమయంలో నేను ఎక్కడ ఉన్నదీ తెలిసిపోతుంది." అని కూడా చెప్పినట్లు తెలిసింది. అయితే, ఈ దాడికి సంబంధించిన కుట్రతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన చెప్పారు. అంతేకాదు.. దాడికి సంబంధించి తనకు 'పైనుంచి' ఎలాంటి ఆదేశాలు కానీ, ముందస్తు సమాచారం కానీ లేదని ఆళ్ల వెల్లడించారు. "మీ నియోజకవర్గంలో మీకు తెలియకుండా ఎలా జరుగుతుంది." అని సీఐడీ అధికారులు ప్రశ్నించగా.. నియోజకవర్గంలో నాకు తెలిసి జరిగినవి కొన్ని అయితే.. తెలియకుండా జరిగినవి కూడా చాలా ఉన్నాయని చెప్పినట్లు సమాచారం. టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో తన అనుచరులు ఎవరూ పాల్గొనలేదని చెప్పారు. "దాడి కేసు విచారించిన పోలీసు అధికారుల సస్పెన్షన్ గురించి తెలుసా?." అని ప్రశ్నించగా తాను పత్రికల్లో చదివి తెలుసుకున్నానని చెప్పారు. "ఏ అధికారి పైనా ఒత్తిడి చేయలేదు. కేసు దర్యాప్తులో జోక్యం చేసుకోలేదు." అని చెప్పినట్లు తెలిసింది.

ఆ పేరు చెబితే..

నాకదే ఆఖరి రోజు!

- సిట్ విచారణలో రాజ్ కసిరెడ్డి ఆందోళన







జైలు వద్ద ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ

అమరావతి/విజయవాడ, మే 31(ఆంధ్రజ్యోతి): 'మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారు పేరు చెబితే... నాకు అంతిమ ఘడియలు వచ్చినట్లే.. అదే నాకు చివరి రోజవుతుంది' అని ఈ కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 'మీరేం చేసినా ఇంతకంటే ఇంకేమీ చెప్పలేను' అంటూ సిట్ అధికారుల ముందు తల దించుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... రెండు రోజుల సిట్ కస్టడీలో భాగంగా లిక్కర్ స్కాంలో కీలక నిందితులు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె. ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ పి. కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను ప్రశ్నించడానికి సిట్ అధికారులు 100 ప్రశ్నలు సిద్ధం చేసుకున్నారు. రెండు రోజుల పాటు ఏమడిగినా తమకేమీ తెలియదని బుకాయించారు. 'మాకేంటి సంబంధం.. మమ్మల్నెందుకు అడుగుతారు.. తప్పుడు కేసుల్లో ఇరికించారు..' అం టూ ఎదురు ప్రశ్నించారు. దీంతో అధికారులు శనివారం కొన్ని ఆధారాలు ముందుపెట్టి ప్రశ్నించడంతో నిందితులు మౌనం వహించారని తెలిసింది. మాజీ సీఎం జగన్ కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి కొన్ని ప్రశ్నల కు సమాధానాలిచ్చినా.. బ్యాంకు లావాదేవీలు, ఐటీ రిటర్న్‌లు ముం దుంచి ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రెవెన్యూ రికార్డులు చూపించి ఇక్కడున్న ఆస్తులు ఎలా వచ్చా యి? ఈ లావాదేవీ ఎందుకు చేశారు? ఇందులో పెట్టుబడుల వివరాలు ఆదాయపు పన్ను రిటర్న్స్‌లో ఎందుకు చూపించలేదు? అంటూ అడిగిన ప్రశ్నలకు ఆయన నీళ్లు నమిలినట్లు తెలిసింది. మరో గదిలో కృష్ణమోహన్ రెడ్డి(జగన్ ఓఎస్డీ)ని ప్రశ్నించిన అధికారులు... 'మీ కుమారుడు రోహిత్‌కు సంబంధించి న వ్యాపారాల్లో పెట్టుబడులు ఎలా వచ్చాయి? ముఖ్యం గా ఐదు కంపెనీల్లోని పెట్టుబడులు అనుమానాస్పదంగా ఉన్నాయి.. వాటి వివరాలు ఎందుకు దాచి ఉంచారు? రాజ్ కసిరెడ్డితో ఆర్థిక వ్యవహారాల గురించి మీరు జరిపిన సంభాషణ, వాట్సాప్ చాట్ గురించి ఏమంటారు?' అనే ప్రశ్నలకు ఆయన మౌనంగా ఉన్నట్లు తెలిసింది. భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను ఆర్థిక వ్యవహారాల గురించి ప్రశ్నించిన సిట్ అధికారులు అనుకున్న స్థాయిలో సమాచారం రాబట్టలేకపోయారు. అయితే మైసూరులో ఉన్న ఒక బ్యాంకు ఖాతాకు సంబంధించిన లావాదేవీలపై ప్రశ్నించడంతో గోవిందప్ప తడబడినట్లు సమాచారం. కాగా, మద్యం కుంభకోణంలో ఈ నలుగురు నిందితుల పోలీసు కస్టడీ శనివారం ముగిసింది. విచారణ ముగిసిన అనంతరం వారిని సీబీఐ కోర్టులో హాజరుపరిచారు. కాగా, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి డ్రైవర్‌ను సిట్ అధికారులు శనివారం విచారించారు. ఎక్కడి నుంచి ఎక్కడకు, ఎవరెవరికి డబ్బులు చేరవేశారో, కారులో ఎవరెవరిని ఎక్కడెక్కడకు తీసుకెళ్లారు వంటి కీలక సమాచారాన్ని అధికారులు సేకరించినట్లు తెలిసింది.

ప్రభుత్వ ఆస్పత్రిలో పీఎస్ఆర్‌కు వైద్యం

- బీపీలో హెచ్చుతగ్గులు, నిద్రలేమి సమస్యలకు చికిత్స

విజయవాడ, మే 31(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్ 1 కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న పీఎస్ఆర్ ఆంజనేయులు అస్వస్థతకు గురయ్యారు. బీపీలో హెచ్చుతగ్గులు ఉంటున్నాయని చెప్పడంతో ఆయనను జైలు అధికారులు శనివారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాత్రి పూట నిద్ర పట్టడం లేదని, కళ్లు తిరుగుతున్నాయని వైద్యులకు పీఎస్ఆర్ వివరించారు. దీంతో ఆయనను సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని కార్డియాలజీ వార్డులో చేర్చి అబ్జర్వేషన్‌లో ఉంచారు. ఆస్పత్రిలో చేరేటప్పుడు ఎస్కార్ట్ సిబ్బందితో పీఎస్ఆర్ వాగ్వాదానికి దిగారని తెలిసింది. తనను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాలని ఆయన కోరారని సమాచారం. దానికి కోర్టు అనుమతి అవసరమని చెప్పడంతో ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స పొందారు. అబ్జర్వేషన్ పూర్తయిన అనంతరం పీఎస్ఆర్‌ను రాత్రికి జైలుకు తరలించారు.

తురకా కిశోర్‌కు 14 రోజుల రిమాండ్

- హత్యాయత్నం కేసులో గురజాల కోర్టు ఉత్తర్వులు

కారంపూడి, మే 31 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ నేత తురకా కిశోర్‌కు గురజాల కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ప్రస్తుతం గుంటూరు జిల్లా జైల్లో ఉన్న కిశోర్‌ను పీటీ వారంట్‌పై శనివారం గురజాల కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి పి.అలేఖ్య రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చారు. 2023 నవంబరు 12వ తేదీ రాత్రి కారంపూడి మండలంలోని చింతపల్లి గ్రామంలో గమిడి పూర్ణచంద్రరావు ఇంటికి వెళ్లి వైసీపీలోకి మారాలని మారణాయుధాలతో మహిళలను సైతం బెదిరించి దాడి చేయబోయాడని బాధితుడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పుడు ఫిర్యాదును పోలీస్‌స్టేషన్లో తీసుకోలేదని, ప్రభుత్వం మారగానే మళ్లీ ఫిర్యాదు చేశానని పూర్ణచంద్రరావు తెలిపారు. కిశోర్, ఎంపీపీ మేకల శ్రీనివాసరెడ్డి, మరో నేత చిరుమామిళ్ల శ్రీకాంత్‌తోపాటు మరికొందరు బెదిరించిన వారిలో ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుల్లో శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ పరారీలో ఉన్నారని ఎస్ఐ వాసు తెలిపారు. తురకా కిశోర్‌ను తిరిగి గుంటూరు జైలుకు తరలించామన్నారు.

ప్రజాసేవ కంటే వ్యక్తిగత లబ్ధిపైనే దృష్టి

- జైలు శిక్షను సస్పెండ్ చేయొద్దు: 'గాలి' పిటిషన్‌పై సీబీఐ కౌంటర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో దోషిగా తేలిన మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డికి ఎలాంటి ఊరట కల్పించరాదని సీబీఐ హైకోర్టును కోరింది. ఆయనకు ప్రజాసేవ చేయడం కంటే వ్యక్తిగతంగా లబ్ధిపొందడంపైనే దృష్టి ఉందని అభిప్రాయపడింది. ఓఎంసీ కేసులో సీబీఐ కోర్టు విధించిన ఏడేళ్ల జైలుశిక్ష తీర్పును సస్పెండ్ చేయడంతోపాటు, బెయిల్ మంజూరు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని గాలి జనార్దన్‌రెడ్డి సహా ఇతర ముద్దాయిలు హైకోర్టును ఆశ్రయించారు. వీటిని వెకేషన్ కోర్టు జడ్జీలు ఎవరూ ఇంకా విచారణకు స్వీకరించలేదు. అయినప్పటికీ సీబీఐ ఆ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ కౌంటర్ దాఖలు చేసింది. 'జైలుశిక్షను సస్పెండ్ చేయకపోతే ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్ 8(3) ప్రకారం ఎమ్మెల్యే పదవి పోతుంద ని, ఇంకా అనుభవించాల్సిన జైలుశిక్ష మూడున్నరేళ్ల కాలంతోపాటు చట్టప్రకారం ఆరేళ్లు కలిపి దాదాపు పదేళ్లపాటు చట్టసభలకు పోటీచేసే అవకాశం కోల్పోతానని జనార్దన్‌రెడ్డి పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే అయినంత మాత్రాన ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరడం సరి కాదు. అందువల్ల ఎలాంటి ఊరట కల్పించరాదని హైకోర్టుకు సీబీఐ విజ్ఞప్తి చేసింది.

పోలవరం-బనకచర్ల ప్రయోజనాలేంటో చెప్పండి?

- రాష్ట్ర ఆర్థిక శాఖకు కేంద్రం పిలుపు.. రేపు ఢిల్లీలో ప్రత్యేక సమావేశం

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మానసపుత్రిక పోలవరం-బనకచర్ల రెగ్యులేటర్ పథకంపై కేంద్రం మేధోమథనానికి సిద్ధమైంది. పోలవరం-బనకచర్ల రెగ్యులేటర్ ప్రాజెక్టు కింద గోదావరి జలాల అనుసంధాన పథకంపై సవివరమైన సమాచారం ఇవ్వాలంటూ రాష్ట్ర ఆర్థిక శాఖను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కోరింది. రూ.81,000 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటి? రైతులకు, తాగునీటికి ఎలా ఉపయోగపడుతుందో వివరించాలని సూచించింది. దీంతో ఆదివారం ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ పీయూ ష్ కుమార్, జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వర రావు, పోలవరం ప్రాజెక్టు చీఫ్ సెక్రటరీ నరసింహమూర్తి తదితరులు ఢిల్లీకి వెళుతున్నారు. భవిష్యత్తులో స్వీయ ఆర్థిక ఆర్జిత ప్రాజెక్టుగా ఉంటుందని సోమవారం కేంద్రానికి వివరించనున్నారు.



మిస్ వరల్డ్‌గా థాయ్‌భామను ప్రకటించిన తర్వాత కరతాళ ధ్వనులతో శుభాకాంక్షలు తెలుపుతున్న సుందరీమణులు



ప్రపంచ సుందరి

థాయ్ సిరి

(మొదటిపేజీ తరువాయి)

నిదర్శనంగా నిలిచి ఆమెను ప్రపంచ సుందరిని చేసింది.థాయిలాండ్‌కు మిస్ వరల్డ్ కిరీటం దక్కడం ఇదే మొదటిసారి. సుచాత తలపై గత మిస్‌వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా కిరీటాన్ని అలంకరించారు. మిస్ వరల్డ్ తొలి రన్నర్ ఎగా ఇథియోపియా సుందరి హస్సెట్ దెరెజ్, రెండో రన్నరప్‌గా పోలాండ్ భామ మజా క్లాడ్జా, మూడో రన్నరప్‌గా మార్టెనిక్ సుందరి జోకిమ్ నిలిచారు.

సోనూసూద్ ప్రశ్నకు సమాధానంతో.. మిస్ వరల్డ్ పోటీల చివరి అంకమైన గ్రాండ్ ఫినాలేలో ప్రముఖ నటుడు సోనూసూద్ అడిగిన ప్రశ్నకు సుచాత ఇచ్చిన సమాధానం ఆకట్టుకుంది. ఆమెకు 72వ ప్రపంచ సుందరి కిరీటాన్ని అందించింది. థాయిలాండ్‌లోని ఫుకెట్‌లో 2003లో సుచాత జన్మించారు. ఆమె 16 ఏళ్ల వయస్సులోనే రొమ్ము క్యాన్సర్ బారినపడి చికిత్స తీసుకున్నారు. అప్పటినుంచే ఆమె 'ఓపల్ ఫర్ హర్' పేరుతో మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇది ఆమెను ప్రపంచ సుందరి పోటీల్లో ఇతరులకు భిన్నంగా నిలిపింది.

టాప్-20లో నిలిచిన నందినీ గుప్తా..

ఈసారి భారత సుందరి నందినీ గుప్తాకు మిస్ వరల్డ్ కిరీటం దక్కుతుందని ఎదురుచూసిన అభిమానులకు ఆమె మధ్యలోనే వెనుదిరగడం నిరాశ మిగిలింది. ఆసియా-ఓషియానా ఖండం విభాగంలో తొలుత టాప్-10లో, తర్వాత టాప్-5లోనూ నిలిచిన నందినీ గుప్తా.. ఆ తర్వాత విభాగాల వారీగా టాప్-2ను ఎంపిక చేసిన సమయంలో.. చోటు దక్కించుకోలేకపోయారు. ఆసియా-ఓషియానా విభాగంలో ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ భామలు టాప్-2లో నిలిచారు. చివరగా ఒక్కో విభాగం నుంచి ఒక్కొక్కరి చొప్పున ఎంపిక చేసిన ఫైనల్ పోటీలో ఆసియా-ఓషియానా విభాగం నుంచి ఓపల్ సుచాత చోటు దక్కించుకున్నారు. చివరి రౌండ్‌లో ఆకట్టుకునే సమాధానం చెప్పి మిస్‌వరల్డ్‌గా నిలిచారు. ఆమెకు రూ.8.5 కోట్ల (మిలియన్ డాలర్లు) నగదు పురస్కారంతోపాటు వజ్రాల కిరీటాన్ని నజరానాగా ఇచ్చారు.



ఫైనల్స్.. అదుర్స్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీల ముగింపు కార్యక్రమం అదుర్స్ అనిపించింది. దాదాపు నెల రోజులుగా వివిధ రకాల పోటీలు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అందాలభామల పర్యటనలతో అలరించిన 72వ ప్రపంచ సుందరి పోటీల ముగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో తుది పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల వెలుగులో.. అందాల తారల ర్యాంప్‌వాక్‌తో పోటీలు మొదలయ్యాయి. ఈ పోటీల్లో తెలంగాణ ప్రత్యేకమైన గుస్సాడి నృత్యం, గిరిజన జాతరలు, బోనాల సందడి, ఆదిలాబాద్ అడవులు, జోడేఘాట్‌లోని కొమురం భీమ్ మ్యూజియం, జలపాతాలు, చార్మినార్, బుద్ధవనం, చౌమహల్లా ప్యాలెస్, యాదాద్రి, రామప్ప ఆలయాలు, గోల్కొండ, పలు హస్తకళలు, చేనేత వస్త్రాల తయారీతోపాటు మరికొన్నింటిని వీడియో రూపంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. 'తెలంగాణ జరూర్ ఆనా' లోగో అందరినీ ఆకర్షించింది. పోటీల మధ్యలో బాలీవుడ్ నటులు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ కట్టర్ చేసిన డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. పోటీల్లో చివరి రౌండ్ ముగిసిన అనంతరం ప్రపంచ సుందరిగా ఎంపికైన థాయ్‌లాండ్ భామ ఓపల్ సుచాతకు మిస్‌వరల్డ్ కిరీటాన్ని అలంకరించడంతో పోటీలు ముగిశాయి. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సరిగ్గా ముందుగా నిర్దేశించుకున్న 9.30 గంటలకే ముగిసింది. కాగా, కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సతీమణి గీతారెడ్డి, కుమార్తె నైమిషతో కలిసి హాజరవగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా కుటుంబ సమేతంగా హాజరయ్యారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, టాలీవుడ్ సినీపరిశ్రమ నుంచి ప్రముఖ నటులు చిరంజీవి, విజయ్ దేవరకొండ, నిర్మాత, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు.

సోనుసూద్‌కు ప్రపంచ మానవతావాది పురస్కారం..

ప్రముఖ నటుడు సోనుసూద్‌కు మిస్‌వరల్డ్ ఆర్గనైజేషన్ ప్రపంచ మానవతావాది పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రముఖ నటుడు రానా అందించారు. కరోనా సమయంలో సోనుసూద్ చేసిన పలు మానవతా చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డును అందించినట్టు మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు ప్రకటించారు. కాగా తెలుగు సినిమా తనకు చాలా గుర్తింపునిచ్చిందని సోనుసూద్ చెప్పారు. తనకు అవార్డును అందించిన మిస్‌వరల్డ్ ఆర్గనైజేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం "వదల బొమ్మాళీ" అంటూ అరుంధతి సినిమాలో తాను చెప్పిన డైలాగ్‌ను స్టేజీపై చెప్పడంతో ప్రేక్షకులు కేకలు వేశారు.

పాసుల ప్రహసనం..

ప్రపంచ సుందరి ముగింపు పోటీలకు పర్యాటక శాఖ చాలా తక్కువ మందికే పాసులు అందించింది. మొత్తం మూడు రకాల పాసులు జారీ చేసింది. అయితే పోటీలకు ఒక్కరోజు ముందుగానైనా ఇవ్వకుండా పోటీలు ప్రారంభమయ్యే శనివారం ఉదయం నుంచే పాసులు ఇవ్వడంతో కొంత గందరగోళం నెలకొంది. మరోవైపు సమయానికి పాసులు అందకపోవడంతో.. చాలామంది కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చారు. ఇచ్చిన పాసుల కంటే ప్రేక్షకులు ఎక్కువగా రావడంతో స్టేజీకి ముందున్న ప్రముఖుల గ్యాలరీతోపాటు వెనుకవైపున్న మరో గ్యాలరీ వద్ద చాలా మంది నిలబడేపోటీలను చూడాల్సివచ్చింది. పాసులకు సరిపడా సీట్లు లేకుండా పాసులు ఎలా జారీ చేశారంటూ నిలబడిన వారంతా చర్చించుకున్నారు. కాగా, సోమవారం మిస్ వరల్డ్ విజేత.. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ కానున్నారు. అదే రోజు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మిస్ వరల్డ్ విజేతతోపాటు ముగ్గురు ఫైనలిస్టు రాష్ట్ర ప్రభుత్వం తేనీటి విందు ఇవ్వనుంది. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరు కానున్నారు.



సోనూసూద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న రానా దగ్గుబాటి

జడ్జీల ప్రశ్నలకు సుందరీమణులు చెప్పినదేమంటే..

మానుషి చిల్లర్ (మిస్ వరల్డ్ 2017): తప్పుడు సమాచారంతో నిండిన ప్రపంచంలో, మీలాంటి యువ నాయకులు సత్యం, గౌరవం, కృతజ్ఞతతో ఎలా వ్యవహరించగలరు?

మిస్ మార్టినిక్: భవిష్యత్ నాయకులుగా మన దగ్గర ఉన్న సమాచారాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రత్యేకంగా కొంత సమయాన్ని వెచ్చించాలని భావిస్తున్నాను. ప్రస్తుతం సోషల్ మీడియాలో, ఇతర సమాచారంలో వాస్తవాలేవో మనకు తెలియదు. ఏఐ యుగంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. కాబట్టి మనం కాస్త సమయాన్ని వెచ్చించి, ప్రతి సమాచారాన్ని అర్థం చేసుకోవాలి. మన హృదయం చెప్పేది నమ్మాలి.

రానా దగ్గుబాటి (నటుడు): మిస్ వరల్డ్‌పై మీ ఆలోచన ఏమిటి? ఈ పోటీలను తప్పుగా పేర్కొనే విమర్శలపై మీరు ఎలా స్పందిస్తారు?

మిస్ ఇథియోపియా: మిస్ వరల్డ్ ఇథియోపియాగా నా దేశం నుంచి చాలా విమర్శలు ఎదుర్కొన్నాను. చాలా మంది కేవలం అందాల పోటీగానే భావిస్తారు. కానీ అంతకంటే ఎక్కువ. నా వెనుక చాలా మంది పిల్లలు, తల్లులున్నారు. నేను ఇక్కడ నిలబడటం నుంచి వారు ఎంతో స్ఫూర్తి పొందుతారు. ఇంత దూరం వచ్చిన మొదటి ఇథియోపియన్ నేనే. ఇక్కడికి వచ్చినందుకు చాలా గర్వపడుతున్నాను. నేను ఇక్కడ ఉండటం కేవలం నాకోసమే కాదు. నా దేశంలోని పిల్లలు, తల్లుల కోసం అని నమ్ముతున్నాను. సేవ అంతర్లీనంగా ఉన్న ఈ పోటీల ఉద్దేశం గురించి నా దేశానికి చెప్పడమే నా లక్ష్యం.

నమ్రతా శిరోద్కర్ (నటి): తెలంగాణలో మీ అనుభవం, ఇక్కడ మీకు నచ్చిన ఒక ప్రధాన అంశం ఏమిటి?

మిస్ పోలాండ్: నా మితిమీరిన బిడియాన్ని ఈ పోటీల్లో పాల్గొని అధిగమించడమే ఇప్పటివరకు నా గొప్ప విజయంగా భావిస్తున్నాను. నేను ఇకనుంచి మరింత ఎక్కువమంది గొప్ప వ్యక్తులను నిర్భయంగా కలుస్తాను.. వారి నుంచి ప్రేరణ పొందుతాను. తెలంగాణలో నాకు ఇష్టమైన అనుభవం.. ఇక్కడి ఆతిథ్యం. ఈ దేశం, ఈ రాష్ట్రం అందించిన ఆతిథ్యం నన్ను ఎంతో ప్రభావితం చేసింది. పోలాండ్ నా మొదటి ఇల్లు, తెలంగాణ నా రెండో ఇల్లుగా అనిపిస్తోంది. ఇక్కడి ప్రజలు చిరునవ్వుతో పలకరిస్తారు.. సంతోషంగా ఆతిథ్యమిస్తారు. ఈ అనుభవాలు చిరస్మరణీయమైనవి.

సోనూ సూద్ (నటుడు): మిస్ వరల్డ్ ప్రయాణం మీకు వ్యక్తిగత బాధ్యత గురించి ఏం నేర్పింది?

మిస్ థాయిలాండ్: మిస్ వరల్డ్ వేదికపై నిలవడం నాకు జీవితంలో లభించిన గొప్ప అవకాశం. పర్యాటకులకు ఎలా ఆతిథ్యమిస్తారో అన్న విషయాన్ని నేను ఇక్కడ ప్రత్యేకంగా నేర్చుకున్నా. మన వెన్నంటి ఒకరున్నారన్న ధైర్యం ఎంతో సంతోషాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. బాల్యంలో తల్లిదండ్రులు తోడున్నట్టుగా జీవితంలోని ప్రతిదశలో ఎవరో ఒకరు మనకు తోడుగా నిలుస్తారు. ప్రతి ఒక్కరికీ ఈ తోడు చాలా ముఖ్యం. సమస్యల్లో ఉన్నవారికి తోడుగా నిలబడటానికి నేను ప్రాధాన్యత ఇస్తా. దయాగుణమే ప్రపంచంలో అత్యుత్తమమైనదని విశ్వసిస్తా. చుట్టుపక్కల వారితో దయతో వ్యవహరించడం కంటే గొప్పది ప్రపంచంలో మరొకటి ఉండదు.



'రైజింగ్ తెలంగాణ' సత్తా చాటాం

మిస్ వరల్డ్‌గా నిలిచిన ఓపల్ సుచాత, రన్నరప్‌లు, ఇతర పోటీదారులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ప్రపంచం నలుమూలల నుంచి అందాల పోటీల కోసం వచ్చినవారంతా కూడా విజేతలేనని.. వారు అందంతోపాటు తెలివితేటలు, సమాజం కోసం చేస్తున్న మానవీయ కృషిని ప్రపంచ వేదికపై ఘనంగా చాటారని ప్రశంసించారు. ప్రపంచ సుందరి పోటీలు అద్భుతంగా సాగాయని, ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, వారసత్వం, చరిత్రను, మన విలువలను, 'తెలంగాణ రైజింగ్' సత్తాను ఘనంగా చాటిచెప్పామన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు, వేడుకలకు హాజరైన వారంతా మన రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లేనని, వారు 'తెలంగాణ జరూర్ ఆనా' నినాదాన్ని ప్రపంచం నలుమూలలకూ తీసుకెళ్లారని పేర్కొన్నారు.




రేవంత్, చిరంజీవి పక్కపక్కనే..

పోటీల కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిరంజీవి.. ఇద్దరూ వారి కుటుంబాలతో కలిసి ఒకేచోట కూర్చున్నారు. వారిద్దరు పక్కపక్కన ఉన్న వీడియో అక్కడి స్క్రీన్‌లపై కనిపించగానే చాలా మంది ఫొటోలు తీసుకున్నారు. పోటీల సందర్భంగా గతేడాది మిస్ వరల్డ్ క్రిస్టినా ప్రిజ్కోవా ర్యాంప్‌పైకి వస్తున్న సమయంలో చిరంజీవి తన ఫోన్‌లో ఆమె ఫొటో తీసుకున్నారు.



నాటు నాటుతో.. హోరెత్తిన ప్రాంగణం

మిస్ వరల్డ్ ముగింపు పోటీల సందర్భంగా బాలీవుడ్ నటులు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ కట్టర్ పలు పాటలకు డ్యాన్స్‌లు చేశారు. జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ నటించిన ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు పాటకు' కట్టర్ స్టెప్పులు వేశారు. ఆ సమయంలో పోటీల ప్రాంగణమంతా ప్రేక్షకుల కేరింతలతో హోరెత్తింది. మిస్ వరల్డ్ పోటీదారులు కూడా వారి కుర్చీల్లో నుంచి లేచి మరీ ఆ పాటకు అనుగుణంగా డ్యాన్స్ వేయడం మరింత సందడి చేసింది. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసింది. హైటెక్స్ ప్రాంగణం ప్రధాన ద్వారం నుంచి మొదలుకుని వేదిక వరకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎక్కడా చిన్న లోపం లేకుండా పర్యవేక్షించారు. సీఎం సహా పలు రంగాల ప్రముఖులు హాజరవడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. అయితే పోటీలు ముగిసి సీఎం, సహా ప్రముఖులు వెళ్లిపోయిన తరువాత మిస్ వరల్డ్ పోటీదారుల దగ్గరకు వెళ్లేందుకు ప్రేక్షకులు ఎగబడ్డారు. ఆ సమయంలో పోలీసులు కొద్ది సేపు అక్కడ లేకపోవడంతో పరిస్థితి ఇబ్బందిగా మారింది. స్టేజీ దగ్గరకు పోలీసులు రావాలంటూ నిర్వాహకులు మైకులో ప్రకటించిన తరువాత అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే చాలామంది స్టేజీ పైకి వెళ్లడంతో వారిని పంపించే క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు.





మిస్ వరల్డ్ ఫైనల్ పోటీలకు హాజరైన ఆహ్వానితులు



ఓ పాటకు నృత్యం చేస్తున్న ఇషాన్ కట్టర్ బృందం



మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న వివిధ దేశాల సుందరీమణులు

ర్యాంప్‌పై తూలి పడబోయిన
అర్మేనియా భామ

» ఈవినింగ్ గౌన్ రౌండ్‌లో సుందరీమణుల పాట్లు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలేలో భాగంగా నిర్వహించిన 'ఈవినింగ్ గౌన్' రౌండ్ అందాల భామలకు పరీక్ష పెట్టింది. వివిధ దేశాల నుంచి వచ్చిన పోటీదారులను పరిచయం చేస్తూ సాగిన ఈ రౌండ్‌లో పోటీదారులు భారీ డిజైనర్ గౌన్లు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. ఈ క్రమంలో వారంతా అవస్థలు పడ్డారు. ర్యాంప్‌పై నడిచేందుకు మిస్ వరల్డ్ స్కాట్లాండ్ తీవ్రంగా ఇబ్బంది పడితే, మిస్ వరల్డ్ అర్మేనియా ఏకంగా ర్యాంప్‌పై తూలి పడిపోబోయారు. తాము ధరించిన గౌన్లు కాళ్లకు అడ్డం పడుతుంటే కాంబోడియా, చైనా తదితర దేశాల వనితలు కూడా ర్యాంప్ వాక్‌కు కష్టపడ్డారు. ఇక, ఈ రౌండ్‌లో మిస్ వరల్డ్ ఇండియా నందినీ గుప్తా ర్యాంప్ మీదికి రాగానే ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు. పిలిప్పైన్స్, థాయ్‌లాండ్, శ్రీలంక పోటీదారులకు కూడా ప్రేక్షకుల నుంచి స్పందన లభించింది.

మిస్ వరల్డ్ వేదికపై మెరిసిన తెలంగాణా చేనేత

వేదికపై తెలంగాణ చేనేత వైభవం మెరిసింది. నేషనల్ కాస్ట్యూమ్ రౌండ్‌లో భాగంగా ఆతిథ్య దేశం, రాష్ట్రం సంప్రదాయ వస్త్రధారణను ప్రపంచానికి చాటి చెప్పేలా పోటీదారులు వస్త్రాలు ధరించారు. భారతీయ సంప్రదాయ ప్రకారం అభివందనం చేస్తూ ర్యాంప్ వాక్ చేశారు. పోటీదారుల్లో ఎక్కువ మంది లంగా, వోణీలలో మెరిసిపోయారు. ప్రముఖ డిజైనర్ అర్చనా కొచ్చర్ రూపొందించిన వస్త్రాలు, డిజైన్లు పోటీదారులకు కొత్త అందాన్ని తీసుకొచ్చాయి. తెలంగాణ ఇక్కత్‌తోపాటు తెలంగాణ సంప్రదాయ వస్త్రాలతో ఈ డిజైన్లు రూపొందించానని, అసలైన బంగారు జరీతో వస్త్రాలను తీర్చిదిద్దానని అర్చనా కొచ్చర్ తెలిపారు.

'బ్యూటీ విత్ పర్పస్' విజేత ఇండోనేషియా భామ

మిస్ వరల్డ్ ఇండోనేషియా మోనికా కీజియా సెమ్బిరింగ్.. పోటీలో భాగంగా బ్యూటీ విత్ పర్పస్ అవార్డు విజేతగా నిలిచారు. 'పైప్‌లైన్ ఫర్ లైఫ్‌లైన్' పేరిట చేపట్టిన ప్రాజెక్టు ఆమెకు అవార్డు తెచ్చిపెట్టింది. మెకానికల్ ఇంజనీరింగ్ చదివి ఓ బ్యాంకులో పని చేస్తోన్న మోనికా.. పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారిణిగా కూడా సేవలందిస్తున్నారు.



మోడల్ కాకుంటే..
రాజకీయాల్లో ఉండేదాన్ని

రొమ్ము క్యాన్సర్ రావడంతో భయపడ్డా.. ఆ భయమే ధైర్యాన్నిచ్చి, ముందుకు నడిపింది

» క్యాన్సర్‌పై అవగాహనకు 'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్టును ప్రారంభించా

» అందాల పోటీలతోనే ప్రపంచానికి.. నా గొంతును వినిపించగలననే నమ్మకం

» 'ఆంధ్రజ్యోతి'తో మిస్‌వరల్డ్ ఓపల్

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): మోడల్ కాకుండా ఉండిఉంటే.. తాను కచ్చితంగా రాజకీయాల్లో ఉండేదాన్నని, థాయ్‌లాండ్‌కు అంబాసిడర్‌గా సేవలందించడమే తన కర్తవ్యమని మిస్ వరల్డ్-2025 టైటిల్ విజేత ఓపల్ ఉద్ఘాటించారు. తనకు 16వ ఏట రొమ్ము క్యాన్సర్ రావడంతో భవిష్యత్‌పై ఆశలన్నీ ఛిద్రమైపోయినట్లు భావించానని, ఆ భయమే తనలో ధైర్యాన్ని నింపాయని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకే 'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్టును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అందాల పోటీల్లో పాల్గొంటే.. తన గొంతును ప్రపంచానికి వినిపించవచ్చనే ఉద్దేశంతో మోడల్‌గా మారారు. మిస్ వరల్డ్ థాయ్‌లాండ్‌గా నిలిచి.. మెక్సికోలో జరిగిన మిస్ యూనివర్స్-2024లో మూడోస్థానాన్ని సాధించారు. ఇప్పుడు.. 'మిస్ వరల్డ్-2025' టైటిల్‌ని సాధించారు. మిగతా పోటీదారుల కంటే ముందే హైదరాబాద్ చేరుకున్న ఓపల్.. వేడుకలకు ముందు 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చరించారు. వివరాలు ఆమె మాటల్లోనే..



మిస్ వరల్డ్‌గా టైటిల్‌పై..

ఒకవేళ నేను మిస్ వరల్డ్ టైటిల్ గెలిస్తే.. థాయ్‌లాండ్ ఈ కిరీటాన్ని అందుకోవడం తొలిసారి అవుతుంది. మిస్ వరల్డ్‌గా.. ఆరోగ్య పరంగా మహిళల జీవన స్థితిగతులను మార్చాలనుకుంటున్నాను. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ బారిన పడిన వారి జీవితాలను మార్చాలన్నదే నా ఆశయం. మగవారికి కూడా రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయి. దాని పట్ల కూడా అవగాహన కల్పించాలనుకుంటున్నాను. యువతరం కూడా ఈ వ్యాధి బారిన పడుతోంది. అందుకే.. యువతరం ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి. ఆరోగ్యానికి మించిదేమీలేదు. యువతరం ఆరోగ్యంగా ఉంటే.. ఈ ప్రపంచాన్నే మార్చగలరు.

మోడల్ కాకపోయి ఉంటే..

ఒకవేళ నేను మోడలింగ్ రంగంలోకి రాకపోతే.. రాజకీయాల్లో ఉండేదాన్ని. ముఖ్యంగా అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించిన విభాగంలో పనిచేసే దాన్ని. భవిష్యత్‌లో థాయ్‌లాండ్ అంబాసిడర్‌గా సేవలందించాలన్నదే నా కోరిక.

జంతువులపై సోదరి ప్రేమ

నాకు జంతువులంటే చాలా ఇష్టం. మా ఇంట్లో 18 పిల్లులు, 5 శునకాలు ఉన్నాయి. వాటిని నా తోబుట్టువుల్లానే చూస్తాను. వాటిపై సోదరి ప్రేమను చూపుతాను.

15 రోజుల్లో సిద్ధమయ్యా

కేవలం 15 రోజుల్లో ఈ పోటీలకు ఎంపికై.. ఇక్కడకు రావడం ఓ అద్భుతమనే చెప్పాలి. నా 18వ ఏట తొలిసారిగా అందాల పోటీల్లో పాల్గొన్నాను. అప్పటి నుంచి పోటీపడుతూనే ఉన్నా.

భయమే.. ధైర్యంగా నడిపింది

వైద్యులు నా 16 ఏళ్ల వయసులో రొమ్ములో పెద్ద కణితిని కనుగొన్నారు. అది నా జీవితంలో అత్యంత క్లిష్టమైన దశ. ఈ దశను విజయవంతంగా అధిగమించాలని, నాకు నేను వాగ్దానం చేసుకున్నా. దాని కోసమే ప్రయత్నించా. 'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్టును ప్రారంభించా. ఈ ప్రాజెక్ట్ ఎంతో మందికి స్ఫూర్తిని కలిగించింది. కొందరు ధైర్యంగా క్యాన్సర్‌తో పోరాడి, విజయం సాధించారు. సమస్యను ముందుగానే గుర్తిస్తే.. అధిగమించవచ్చని.. ఆ దిశగా కృషిచేస్తున్నా.

హైదరాబాద్‌తో సంబంధం

హైదరాబాద్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ అనుభూతిని ఎన్నటికీ మరిచిపోలేను. నాకు జన్మనిచ్చిన ఫుకెట్‌కు, హైదరాబాద్‌కు సంబంధం ఉంది. హైదరాబాద్ మాదిరిగానే మాది 'ముత్యాల నగరి'. అందుకే.. హైదరాబాద్ నా మనసుకు నచ్చిన నగరంగా మారింది.

తెలంగాణ ఆతిథ్యం
అపూర్వం

తెలంగాణ ప్రభుత్వ సహకారం, మద్దతు.. అన్నింటికీ మించి ఆతిథ్యం అపూర్వం. తెల్లవారుజామున 2 గంటలకు విమానాశ్రయంలో దిగగానే.. నన్ను ఆహ్వానించడం సంతోషాన్నిచ్చింది. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు నన్ను ఆకట్టుకున్నాయి. ఇక్కడివంటలు చాలా బాగున్నాయి. ఇక్కడి ప్రజల మోముల్లో చిరునవ్వు నాకు చాలా నచ్చింది. నా ఇంట్లో ఉన్నట్లే ఫీల్ అయ్యాను. ఆభరణాలకు నేను పెద్ద అభిమానిని. హైదరాబాద్ పాతనగరంలో ముత్యాలను అన్వేషించాలనుకుంటున్నాను.

ఆలయాలకెళ్తే
ప్రశాంతత

నేను థాయ్‌లాండ్‌లో ఓ దేవాలయాన్ని సందర్శించినప్పుడు.. అక్కడ పొందిన అనుభూతి అద్భుతమనిపించింది. మరో ప్రపంచంలా ఫీలయ్యాను. దేవాలయాల్లోని ప్రశాంతతను ప్రత్యక్షంగా అనుభవించాల్సిందే..! హైదరాబాద్ తోపాటు.. భారత్‌లోని దేవాలయాలను సందర్శించాలనుకుంటున్నాను. దేవాలయాల్లో ఏదో తెలియని శక్తి మనకు లభిస్తున్నట్లు అనిపిస్తుంది.



సుందరి నీ వంటి..

టాప్-4లోని అందగత్తెలు నలుగురూ నలుగురే

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌కు చెందిన సుచాత షుంగ్‌సిరి మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని సొంతం చేసుకోగా.. ఆఫ్రికాలోని ఇథియోపియాకు చెందిన యోజా సియమ్ రన్నరప్‌గా నిలిచారు. ఐరోపాలోని పోలాండ్‌కు చెందిన మాజా క్లాజ్డా రెండో రన్నరప్‌గా, ఉత్తర అమెరికా ఖండానికి చెందిన ఔరెలీ జోయాకీమ్ మూడో రన్నరప్‌గా నిలిచారు. ఈ విజేతల నేపథ్యాలివి..

5 అడుగుల 11 అంగుళాల అందం ఓపల్

మిస్ వరల్డ్ సుచాత షుంగ్‌సిరి ముద్దు పేరు 'ఓపల్'. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో 2003లో జన్మించిన సుచాత.. ఎత్తు 5 అడుగుల 11 అంగుళాలు. తనే ఎత్తే తన ప్రత్యేకత అని ఓపల్ అంటుంటారు. చిన్నతనం నుంచే డ్యాన్స్, మ్యూజిక్, మోడలింగ్‌పై ఆమెకు ఆసక్తి ఎక్కువ. ఓపల్‌కు థాయ్‌తోపాటు ఆంగ్లంలో మంచి ప్రావీణ్యం ఉంది. అద్భుతమైన కమ్యూనికేషన్ స్కిల్స్ ఆమె సొంతం. ప్రతిభ, పట్టుదల, సమాజానికి సేవ చేయాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమని చెప్పే సుచాతకు సామాజిక సేవపై ఆసక్తి ఎక్కువ. బాలల విద్య, మహిళల సాధికారత కోసం ప్రధానంగా కృషి చేస్తుంటారు. మోడలింగ్ రంగంలోకి ప్రవేశించి, అంతర్జాతీయ సంబంధాలపై అధ్యయనం చేస్తున్నారు. వాయిస్ ఫర్ చేంజ్ సిల్వర్ అవార్డును గెలుచుకుని ప్రపంచానికి తన సామాజిక స్పృహ చాటారు. 2024లో మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ టైటిల్ గెలిచిన సుచాత.. ఆ తర్వాత మిస్ వరల్డ్ థాయ్‌లాండ్ 2025గా ఎంపికయ్యారు.

యోజా సియమ్ - ఇథియోపియా

మిస్ వరల్డ్ 2025లో రన్నరప్‌గా నిలిచిన యోజా సియమ్ ఇథియోపియాకు చెందిన మోడల్, సామాజిక కార్యకర్త. తమ దేశ సంప్రదాయాలను గర్వంగా ప్రపంచానికి చూపించడంలో ఆమె అదరగొట్టారు. యోజా బాల్యంలో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ, చదువుపై ఆసక్తి, సేవ మార్గంలో నిబద్ధతతో ఎదిగారు. మహిళల హక్కులు, బాలికల విద్య, వాతావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. మిస్ వరల్డ్ వేదికపై ఆమె చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. తన బ్లూ హోప్- క్లీనింగ్ వాటర్ ప్రాజెక్ట్ ఆమె విజయంలో కీలకపాత్ర పోషించింది. ఆమెకు టాప్-4లో స్థానం దక్కేలా చేసింది.

మాజా క్లాజ్డా - పోలాండ్

పోలాండ్‌లోని లెంచ్నా అనే చిన్న పట్టణానికి చెందిన మాజా క్లాజ్డా.. మిస్ వరల్డ్ పోలాండ్ 2025 టైటిల్‌ను గెలుచుకొని అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు. చిన్నతనం నుంచే మోడలింగ్, డ్యాన్స్, సామాజిక సేవపై ఆమెకు ఆసక్తి. కమ్యూనికేషన్ అండ్ మీడియా స్టడీస్‌లో డిగ్రీ పొందిన మాజా.. వృద్ధుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహించే సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. 'మిస్ పొలోనియా' పోటీ ద్వారా మిస్ వరల్డ్ 2025కు ఎంపికయ్యారు.

ఔరెలీ జోయాకీమ్- మార్టినిక్ (ఉత్తర అమెరికా)

ఉత్తర అమెరికాలోని మార్టినిక్ అనే చిన్న ద్వీపదేశానికి చెందిన ఔరెలీ జోయాకీమ్‌కు చిన్నతనం నుంచే డ్యాన్స్, సంగీతం, సమాజ సేవ అంటే ఇష్టం. తమ దేశంలోని విశ్వవిద్యాలయంలో పబ్లిక్ హెల్త్ విభాగంలోచదువుతున ఔరెలీ.. మిస్ వరల్డ్ పోటీకి ఎంపికయ్యాక తన బ్యూటీ విత్ పర్పస్ ప్రాజెక్ట్(దీవులోని గ్రామాల్లో యువతకు వృత్తిపరమైన శిక్షణ) ద్వారా ఎంతో మందికి ప్రేరణగా మారారు. తన దేశ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడం, చిన్నద్వీపాల గొప్పతనాన్ని ప్రపంచానికి చూపాలన్న తపనతోనే ఆమె మిస్ వరల్డ్ పోటీలకు వచ్చారు.



మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్ గౌరవాన్ని
బాధ్యతగా భావిస్తా

మేఘా ఇంజనీరింగ్ సంస్థ డైరెక్టర్ సుధా రెడ్డి

బంజారాహిల్స్, మే 31(ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్‌గా తన నియామకం పట్ల మేఘా ఇంజనీరింగ్ సంస్థ డైరెక్టర్ సుధా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బ్యూటీ విత్ పర్పస్ దాతృత్వ సంస్థకు ప్రతినిధిగా వ్యవహరించడంతో పాటు గ్లోబల్ అంబాసిడర్‌గా తనకు దక్కిన గౌరవాన్ని బాధ్యతగా భావిస్తానని పేర్కొన్నారు. మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలే అంతర్జాతీయ న్యాయ నిర్ణేతల కమిటీలో తనని సభ్యురాలిగా చేర్చడం గర్వంగా ఉందని తెలిపారు.

డాక్టర్‌ను అవ్వాలనుకున్నా..

» కానీ, బిజినెస్ వైపు వెళ్లాల్సి వచ్చింది

» గైనకాలజికల్ క్యాన్సర్‌పై వర్క్‌షాప్ ప్రారంభం సందర్భంగా నారా బ్రాహ్మణి



హైదరాబాద్ సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): తనకు వైద్యవిద్యపై ఎంతో ఆసక్తి ఉండేదని, డాక్టర్ కావాలనుకున్నానని, కానీ, బిజినెస్ వైపు వెళ్లాల్సి వచ్చిందని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ట్రస్టు సభ్యురాలు నారా బ్రాహ్మణి అన్నారు. వైద్యురాలిని కాలేకపోయినప్పటికీ, వైద్యం అందించాలన్న కోరిక బసవతారకం ఆస్పత్రి ద్వారా తీరుతోందన్నారు. శనివారం ఆస్పత్రిలో 'గైనకాలజికల్ అంకాలజీ లైవ్ ఆపరేటివ్ వర్క్‌షాప్'ను బ్రాహ్మణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వివిధ రకాల క్యాన్సర్లపై మహిళల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన చాలా తక్కువగా ఉందన్నారు. గైనకాలజికల్ క్యాన్సర్‌పై బసవతారకం ఆస్పత్రిలో వర్క్‌షాపు నిర్వహించడం మంచి పరిణామం అని అభిప్రాయపడ్డారు. క్యాన్సర్లపై మహిళల్లో అవగాహన పెంచడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వర్క్‌షాపులో డాక్టర్ రాజగోపాలన్ నేతృత్వంలో గైనకాలజికల్ అంకాలజీకి సంబంధించిన శస్త్ర చికిత్సలను వైద్యులకు లైవ్‌లో చూపించి వివరించి, చర్చించనున్నారు.

యోగాంధ్రకు 1.13 కోట్ల మంది రిజిస్ట్రేషన్

అమరావతి, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రారంభించిన యోగాంధ్ర ప్రచార కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో 2కోట్ల మందిని భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా శుక్రవారం నాటికే కోటి మందికి పైగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 నాటికి 2 కోట్లకు పైగా లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం నెల రోజుల పాటు నిర్వహించే యోగాంధ్రలో రెండు కోట్ల రిజిస్ట్రేషన్ల లక్ష్యంలో శుక్రవారం రాత్రికి 1.13 కోట్ల మంది స్వచ్ఛందంగా నమోదు చేసుకున్నారని యోగాంధ్ర నోడల్ అధికారి ఎం.టీ.కృష్ణబాబు మంత్రుల కమిటీకి నివేదించారు. మాస్టర్ ట్రైనర్ల నమోదు 408 శాతం కాగా, శిక్షకుల నమోదు 113 శాతం మేర జరిగిందని పేర్కొన్నారు.

టీచర్ ఉద్యోగాలకు భారీ పోటీ

16,347 పోస్టులకు 5.77 లక్షల దరఖాస్తులు

» సగటున ఒక్కో పోస్టుకు 35 మంది పోటీ

» ఎస్జీటీకి 25, స్కూల్ అసిస్టెంట్‌కు 28

» పీజీటీ పోస్టులకు ఏకంగా 152 మంది

» ఈ నెల 6 నుంచి 30 వరకు పరీక్షలు

» 87.8 శాతం మందికి ఫస్ట్ ఆప్షన్ సెంటర్లు

» ఆగస్టు రెండో వారంలో ఫలితాలు వెల్లడి

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం తర్వాత రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో పోటీ తీవ్రస్థాయిలో నెలకొంది. 16,347 పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగా 3,35,401 మంది 5,77,675 దరఖాస్తులు సమర్పించారు. సగటున ఒక్కో పోస్టుకు 35.33 మంది పోటీపడుతున్నారు. వారికి ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు హాల్‌టికెట్లు శనివారం విడుదలయ్యాయి. కంప్యూటర్ ఆధారంగా జరగనున్న ఈ పరీక్షల కోసం రాష్ట్రం సహా ఇతర రాష్ట్రాల్లో 150 సెంటర్లు ఏర్పాటుచేశారు. ఏపీతో పాటు హైదరాబాద్, చెన్నై, బరంపురం, బెంగళూరుల్లో పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల కోసం 5 జిల్లాలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకోగా 87.8 శాతం మందికి మొదటి ఆప్షన్ జిల్లాలోనే పరీక్షా కేంద్రం కేటాయించారు. ఆగస్టు రెండో వారంలో డీఎస్సీ ఫలితాలు విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయ రామరాజు తెలిపారు.

పోస్టుల వారీగా దరఖాస్తులు

కేటగిరీ	పోస్టుల సంఖ్య	దరఖాస్తులు	ఒక్కో పోస్టుకు ఎంతమంది
ఎస్జీటీ	6614	165187	24.97
పీఈటీ	177	26335	148.78
ఎస్ఏ	7487	210010	28.04
టీజీటీ	1731	127915	73.89
పీజీటీ	286	43483	152
ప్రిన్సిపాల్	52	4745	91.25

అత్యధికంగా దరఖాస్తు చేసుకున్న పోస్టులు

పోస్టు	దరఖాస్తులు
ఎస్ఏ-తెలుగు	21892
ఎస్ఏ-ఇంగ్లీష్	17960
ఎస్ఏ-హిందీ	9905
ఎస్ఏ-గణితం	38705
ఎస్ఏ-ఫిజిక్స్	18187
ఎస్ఏ-బయాలజీ	30494
ఎస్ఏ-సోషల్	52870
ఎస్ఏ-పీఈటీ	17881
పీజీటీ-ఇంగ్లీష్	8353
పీజీటీ-హిందీ	3511
పీజీటీ-గణితం	6239
టీజీటీ-గణితం	24788
టీజీటీ-సోషల్	24736
టీజీటీ-తెలుగు	18266
ప్రిన్సిపాల్	4745

చట్టం, బైలా అనుమతిస్తేనే నామినేటెడ్ సభ్యుల తొలగింపు

» పశుగణాభివృద్ధి సంఘం వ్యవహారంలో హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): ఏదైనా చట్టం, బైలా అనుమతి ఉంటేనే నామినేటెడ్ సభ్యుల రాజీనామా కోరడం లేదా వారిని పదవుల నుంచి తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం పాలకవర్గంలో నామినేటెడ్ సభ్యుల పదవీకాలం ముగియకముందే రాజీనామా చేయాలని కోరడం, పదవుల నుంచి తొలగించడాన్ని తప్పుబట్టింది. వారిని తొలగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. అలాగే పిటిషనర్లను సభ్యులుగా తొలగిస్తూ ప్రకాశం, విజయనగరం, చిత్తూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు ఇచ్చిన ఉత్తర్వులను కూడా రద్దు చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది.

10న భారత్ బంద్!.. మావోయిస్టుల పిలుపు

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌లో భాగంగా చేస్తున్న ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ జూన్ 10న దేశవ్యాప్త బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట శనివారం ఒక ప్రకటన విడుదలైంది. జూన్ 11 నుంచి ఆగస్టు 3 వరకూ అమరుల స్మారక సభలు నిర్వహించాలని ఆ ప్రకటనలో కోరారు. శాంతి చర్చలకు సిద్ధమని తాము ప్రకటించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టి హింసను కొనసాగిస్తున్నాయని ఆక్షేపించారు. 2026 మార్చి 31నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామంటున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా చర్యల్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

మేమంతా జైలుకే!

» నెలో రెండు నెలలో అంతే ఎప్పుడైనా జైలుకెళ్లొచ్చు

» 'రెడ్ బుక్'ను లైట్ తీసుకున్నాం

» వైసీపీ నేత సజ్జల వ్యాఖ్యలు

» జైలులో కాకాణితో ములాఖత్



జైలు ముందు మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి

నెల్లూరు(క్రైం), మే 31(ఆంధ్రజ్యోతి): "మా అందరిపైనా కేసులున్నాయి. మహా అయితే.. నెలో, రెండు నెలలో ఎప్పుడైనా జైలుకు పోవచ్చు. అంతకుమించి చేసుకోగలిగేది ఏమీ లేదు." అని వైసీపీ నేత, ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. నెల్లూరు సెంట్రల్‌జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో శనివారం సజ్జల ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు ముందు మీడియాతో మాట్లాడుతూ.. "గత ఎన్నికలకు ముందు టీడీపీ నేతలు మేం అధికారంలోకి వస్తే రెడ్‌బుక్ పాలన ఉంటుందని చెప్పారు. అప్పుడు లైట్ తీసుకున్నాం. దాని పర్యవసానాలు ఇంత తీవ్రంగా ఉంటాయని ఇప్పుడు చూస్తున్నాం." అని అన్నారు. కల్పిత కథలు సృష్టించి వైసీపీ నాయకుల పాత్రలు చేర్చి ఎఫ్ఐఆర్ నమోదు చేసి జైలుకు పంపుతున్నారన్నారని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాతో మొదలై ఇప్పుడు పరాకాష్ఠకు చేరుకుందన్నారు. కాకాణి గట్టిగా మాట్లాడుతున్నప్పుడే ఆయనపై గురిపెడతారని ఊహించామని, అనుకున్నట్టుగానే జరిగిందన్నారు. వైసీపీని బలహీనం చేసి ప్రతిపక్షం లేకుండా చేయాలని చూస్తున్నారని చెప్పిన ఆయన.. అది అసాధ్యమని తెలిపారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ గాడి తప్పితే ఎలా ఉంటుందో బిహార్ వంటి రాష్ట్రాలు, ఆటవిక రాజ్యాలు, ఎమర్జెన్సీ సమయాల్లో చూశామని ఇప్పుడు మళ్లీ ఏపీలో చూస్తున్నామని వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు నాటిన విత్తనం.. రేపు దాని ఫలాలు.. ఎలా ఉంటాయో ఆయన ఊహించడం లేదని, అవి భయంకరంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం, నెల్లూరు నగరంలోని కాకాణి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.